సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 202

గురువారం 13-10-2022



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



అమ్మ అందం

ప్రసవానంతరం శారీరక స్థితిని తమ ఆధీనం లోకి తెచ్చుకునే పద్ధతులపై కథనం - 11లో



అదానీకి టెలికం లైసెన్సు

టెలికం సర్వీసులకు సంబంధించి అదానీ డేటా నెట్‌వర్క్‌కు ఏకీకృత లైసెన్సు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



SAMSUNG

Galaxy S22

Now in Bora Purple



Own at ₹ 52999*

Retail price	₹ 72999^
Instant cashback	₹ 10000^^
Upgrade bonus / Bank cashback	₹ 10000^^
Effective price	₹ 52999*

FESTIVE TREATS | Samsung upgrade

Follow us on: samsung.com | @SamsungIndia | @SamsungIndia | SamsungIndia | @samsungindia

Re+ Please dispose e-waste and plastic waste responsibly. For more information or for e-waste pick up, please call 1800 40 7267864 or 1800 5 7267864.

*T&C apply. Final pricing is subject to dealer discretion. ^Retail price of 1 Unit of Galaxy S22 128GB | 8GB. Price inclusive of taxes.
^^Cashback provided by issuer at its sole discretion. Image simulated for representational purpose only. Colour as per availability.

Scan to buy.

Or WhatsApp "S22" to 9870-494949 to buy now at Samsung Exclusive Stores.

Cheil-13592/22

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 202

గురువారం 13-10-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'




ముగిసిన జాతీయ క్రీడలు

సర్వీసెస్‌కు అగ్రస్థానం.. తదుపరి క్రీడలకు గోవా ఆతిథ్యం - 12లో



ఫేస్‌బుక్‌లో అన్‌ఫాలో కలకలం

భారీగా పడిపోయిన ఫాలోవర్ల సంఖ్య జుకర్‌బర్గ్‌కూ తప్పని తిప్పలు - 6లో



కొనసాగుతున్న దాడులు

ఉక్రెయిన్‌లో రష్యా విధ్వంసం కొనసాగుతోంది. నేరుగా జనావాసాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తోంది.

వివరాలు 6లో



సూకీకి మరో ఆరేళ్ల శిక్ష

మయన్మార్ ఉద్యమ నాయకురాలు ఆంగ్ సాన్ సూకీకి మరో ఆరేళ్ల శిక్ష పడింది. దీంతో మొత్తంగా 26 ఏళ్ల శిక్ష పడినట్లయింది.

వివరాలు 6లో



నోట్ల రద్దుపై పరిశీలన

2016లో నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రకటించిన నోట్ల రద్దు నిర్ణయాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

వివరాలు 6లో



మనకే 85 శాతం మెడికల్ సీట్లు

ప్రైవేట్ కాలేజీల్లో మెడికల్ కోర్సులకు సంబంధించిన 85% సీట్లు ఏపీ విద్యార్థులకే దక్కేలా సర్కార్ నిబంధనలు సవరించింది.

వివరాలు 14లో

ఉవ్వెత్తున ఉద్యమం

విశాఖ కోసం ఏకమైన ఉత్తరాంధ్ర.. మూడు రాజధానులతోనే సమన్యాయం





అనకాపల్లి జిల్లా పరవాడలో మానవహారంలో పాల్గొన్న ప్రజలు.. పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో బైక్ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

- మరోసారి రాష్ట్రాన్ని ముక్కలు కానివ్వబోం.. ప్రజల ఆకాంక్షకు మేధావులు, విద్యార్థులు, న్యాయవాదుల మద్దతు
- భారీ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, మానవ హారాలు, దేవాలయాల్లో పూజలు
- 15న జరగనున్న విశాఖ గర్జనకు తరలిరావాలని నాన్ పొలిటికల్ జేఏసీ పిలుపు
- ఉత్తరాంధ్రులది బతుకు పోరాటమన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు
- అభివృద్ధికి అడ్డురావద్దని హితవు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర సమగ్రాభివృద్ధిని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న వికేంద్రీకరణ విధానం గ్రామగ్రామాన నినదిస్తోంది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా ఎదగాలని తపిస్తూ చారిత్రక నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారు. ఇప్పటికే హేతుబద్ధత లేని విభజనతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ మరోసారి ముక్కలు చెక్కలు కాకుండా సీఎం దూరదృష్టితో కాపాడుతున్నారంటూ ప్రజలంతా బాసటగా నిలుస్తున్నారు. అనవసర వ్యయాన్ని, పెనుభారాన్ని భరించే పరిస్థితిలో రాష్ట్రం ఏమాత్రం లేదని, అందుకే అన్ని సదుపాయాలున్న విశాఖ పరిపాలన రాజధాని కావాలని స్పష్టం చేస్తున్నారు. మూడు రాజధానుల ఏర్పాటుతోనే సమన్యాయం జరుగుతుందని పేర్కొంటున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటే గర్జిస్తామంటూ మేధావులు, విద్యార్థులు, న్యాయవాదులు, ఉద్యోగులు ఏకతాటిపైకి వచ్చారు. మానవహారాలు, భారీ ర్యాలీలు, పూజలతో ప్రజల ఆకాంక్షను చాటి చెబుతున్నారు.

విశాఖపట్నంలో ర్యాలీల హోరు

విశాఖ నగరం సహా పలు ప్రాంతాల్లో బుధవారం భారీ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో యువత, మేధావులు, న్యాయవాదులు, సామాన్య ప్రజలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జీవీఎంసీ 77వ వార్డు నమ్మిదొడ్డి జంక్షన్‌లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నినాదాలతో హోరెత్తించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో వికేంద్రీకరణకు మైనారిటీ సంఘాలు మద్దతు పలికాయి. గోపాలపట్నం ప్రధాన రహదారిలో మసీదు వద్ద భారీ ప్రదర్శన నిర్వహించారు. విశాఖ పరిపాలన రాజధానిగా

మిగతా 3వ పేజీలో ▶

బొగ్గు.. తగ్గొద్దు

నిల్వలకు కొరత రాకూడదు.. దేశీయ బొగ్గు సమకూర్చుకోవాలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- వేసవి కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయండి
- మోటార్లకు మీటర్లతో ప్రయోజనాలను రైతులకు వివరించాలి
- ట్రాన్స్‌ఫార్మర్ పాడైతే 24 గంటల్లోగా కొత్తది ఇవ్వాలి
- పంప్డ్ స్టోరేజీతో రాష్ట్రానికి ప్రయోజనం.. భూములిచ్చే రైతులకు ఆదాయం
- జగనన్న కాలనీలు పూర్తయ్యే కొద్దీ విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలు
- రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ప్రతిపాదనలు



సాక్షి, అమరావతి: విదేశీ బొగ్గు ధరలు మండిపోతున్న దృష్ట్యా దేశీయంగానే బొగ్గు సమకూర్చుకునేలా కృషి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. బొగ్గు నిల్వలకు ఎలాంటి కొరత లేకుండా సులియారీ, మహానది కోల్ బ్లాక్స్ నుంచి పూర్తిస్థాయి ప్రయోజనాలు పొందేలా ప్రయత్నాలు చేయాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని, వేసవి కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జగనన్న కాలనీలు పూర్తయ్యే కొద్దీ ఎప్పటికప్పుడు విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. ఇంధన శాఖపై బుధవారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. ఆ వివరాలివీ..

మీటర్లపై విస్తృత అవగాహన..

వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ పంపిణీ పారదర్శకంగా, నాణ్యంగా, రైతులకు మేలు చేసేలా అత్యంత మెరుగైన వ్యవస్థను తేవాలని సీఎం జగన్ స్పష్టం చేశారు. మీటర్ల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలపై ఎప్పటికప్పుడు

మిగతా 2వ పేజీలో ▶

ఏది నిజం?

ఉత్త.. రాతల ప్రేమ

- పథకం ప్రకారం 'ఈనాడు' ప్రభుత్వ వ్యతిరేక కథనాలు
- గడిచిన ఆరు రోజుల్లో 5 రోజులు ఉత్తరాంధ్ర ప్రస్తావనే
- విశాఖలో దసపల్లా భూములంటూ మళ్లీ మళ్లీ రాతలు
- ఉత్తరాంధ్రకు విద్య, ఇరిగేషన్ ప్రాజెక్టులు తెచ్చింది బాబేనట
- ఆ రెండింట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమీ చేయలేదంటూ విమర్శలు
- 'విశాఖ రాజధాని' నినాదంపై దృష్టి మరల్చేందుకు తంటాలు
- అమరావతి యాత్రకు ఇబ్బందులొస్తాయని టీడీపీ అనుమానాలు
- ఆ పరిస్థితి నివారించడానికి పవన్‌ను పంపుతున్న టీడీపీ
- రెండ్రోజుల్లో వచ్చి డైలాగులకు సిద్ధమవుతున్న పవన్‌కల్యాణ్
- ఆ 'సీన్' కోసం వ్యతిరేక వార్తలతో రంగం సిద్ధం చేస్తున్న 'ఈనాడు'
- జేఏసీ ఉద్యమ కార్యాచరణకు జనం కలిసిరాకూడదని వ్యూహం
- రామోజీ రాతలతో రెచ్చిపోయి 'సేవ్ ఉత్తరాంధ్ర' అంటున్న బాబు

4లో

దసపల్లా.. టీడీపీదే రసగుల్లా

విభజన హక్కులూ బాబు గొప్పలేనా..

ఇదే ఉత్తరాంధ్రపై ప్రేమ

ఉద్దానం బాధితులను పట్టించుకున్నదెవరు?

- వివరాలు 4లో

ఏపీలో ఆర్బీకేలు అద్భుతం

- ఆర్బీకే సాంకేతికతను అందిపుచ్చుకుంటాం.. రైతు సేవలు గ్రామ స్థాయికి తీసుకెళ్తాం
- ల్యాబ్ టు ల్యాండ్ కాన్సెప్ట్ చాలా బాగుంది.. ప్రభుత్వ ఆలోచనలు చాలా ఇన్నోవేటివ్‌గా ఉన్నాయి
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు
- ఇథియోపియా వ్యవసాయ శాఖ మంత్రి మెలెస్ మెకోనెన్ ఐమెర్
- గన్నవరం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్, ఆర్బీకే చానల్ సందర్శన
- గండిగుంట ఆర్బీకేని పరిశీలించిన ఇథియోపియా బృందం



కృష్ణా జిల్లా గండిగుంటలోని ఆర్బీకేలో అందిస్తున్న సేవలను తెలుసుకుంటున్న ఇథియోపియా బృందం

సాక్షి, అమరావతి/ఉయ్యూరు: 'రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. మేము ఊహించిన దానికంటే చాలా అడ్వాన్స్‌డ్‌గా ఉన్నాయి. ఆర్బీకేలు గ్రామ స్థాయిలో రైతులకు అందిస్తున్న సేవలు చాలా ఇన్నోవేటివ్‌గా ఉన్నాయి. కియోస్క్ ద్వారా రైతులే నేరుగా వారికి కావల్సిన ఇన్‌పుట్స్ బుక్ చేసుకోవడం, సకాలంలో వాటిని అందించడం అద్భుత విధానం. ల్యాబ్ టు ల్యాండ్ కాన్సెప్ట్ కింద పరిశోధన ఫలితాలు, విస్తరణ కార్యక్రమాలను రైతుల ముంగిటకు తీసుకెళ్లడం నిజంగా మంచి ఆలోచన. ప్రపంచంలో ఎక్కడా ఈ తరహా సేవలందిస్తున్నట్టు వినలేదు. ఈ తరహా ఆలోచన చేసిన సీఎం వైఎస్ జగన్‌ను అభినందిస్తున్నాం' అంటూ ఇథియోపియా దేశ వ్యవసాయ శాఖ మంత్రి మెలెస్ మెకోనెన్ ఐమెర్ ప్రశంసించారు. రాష్ట్రంలో ఆర్బీకే వ్యవస్థ గురించి తెలుసుకున్న ఇథియోపియా ప్రభుత్వం, వాటిని తమ దేశంలో కూడా అమలు చేయాలని నిర్ణయించింది. ఇందు కోసం ఆర్బీకే వ్యవస్థ పరిశీలనకు ఆ దేశ వ్యవసాయ శాఖ మంత్రి మెలెస్ మెకోనెన్ ఐమేర్ నేతృత్వంలో ఓ బృందాన్ని పంపింది. ఆ బృందం

మిగతా 2వ పేజీలో ▶

ఇథియోపియాకు సహకారం అందిస్తాం

మా సాంకేతిక సహకారం కోరడం ఆనందంగా ఉంది: సీఎం జగన్ 2లో

రైల్వే కార్మికులకు బోనస్



6లో

'ఎల్పీజీ' నష్టాలను పూడ్చడానికి చమురు సంస్థలకు రూ.22,000 కోట్లు

కేంద్ర మంత్రివర్గం ఆమోదం

- రైల్వేలో పనిచేస్తున్న 11.27 లక్షల మంది నాన్-గెజిటెడ్ ఉద్యోగులు, కార్మికులకు శుభవార్త. వారికి ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్ చెల్లించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏటా దసరా/దీపావళి ముందు ఈ బోనస్ ప్రకటిస్తుంటారు. ఈ ఏడాది 78 రోజుల వేతనానికి సమానమైన బోనస్ చెల్లించనున్నారు.

కేరళలో నరమాంస భక్షణ

- కేరళలో చోటుచేసుకున్న నరబలి ఘటనలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయనే మూఢ విశ్వాసంతో ఇద్దరు మహిళలను బలి ఇవ్వడమే కాకుండా వారి మాంసాన్ని వండుకొని ముగ్గురు నిందితులు ఆరగించినట్లు తెలిసింది. పత్తనంతిట్ట జిల్లా ఎలాంథూర్‌కు చెందిన మసాజ్ థెరపిస్టు భగావల్ సింగ్, ఆయన భార్య లైలాతో పాటు ప్రధాన నిందితుడు మొహమ్మద్ షఫీని పోలీసులు అరెస్టు చేశారు.

- వివరాలు 6లో

సచివాలయాల్లో మ్యారేజి సర్టిఫికెట్లు

- దీంతో సులువుగా రేషన్ కార్డు విభజన
- పెళ్లయిన తర్వాత గడువులోగా దరఖాస్తు చేయాలి
- గ్రామీణ ప్రాంతాల్లో 60 రోజులు, పట్టణాల్లో 90 రోజుల గడువు
- అది దాటితే సబ్ రిజిస్ట్రార్లకు దరఖాస్తు చేయాలి

2లో



లాభాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఎందుకు?

- విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే నిర్ణయాన్ని పునఃపరిశీలించండి
- నిర్వాసితులకు ఉద్యోగాల కల్పనపై కౌంటర్ దాఖలు చేయండి
- కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచన.. ప్లాంట్ లాభాల్లో ఉందన్న రాష్ట్ర ప్రభుత్వం
- విచారణ నవంబర్ 9కి వాయిదా

5లో

ఇదండీ సంగతి



పోన్లెండి! మీ వల్ల నలుగురికి ఉద్యోగాలొస్తున్నాయంటే సంతోషమే కదా!!

ఆ భూముల్ని 22ఏ నుంచి తొలగించవచ్చు

షరతులు గల పట్టా భూముల విషయంలో జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం మార్గదర్శకాలు



సాక్షి, అమరావతి: షరతులు గల పట్టా భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించవచ్చని కలెక్టర్లకు స్పష్టం చేస్తూ కొన్ని మార్గదర్శకాలతో ప్రభుత్వం బుధవారం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. భూమి స్వభావం ప్రభుత్వ మెట్ట/మాగాణి/సాగు లభ్యత ఉన్న మెట్ట భూమి అయి ఉండి, రీసర్వే రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్)లో షరతుల గల పట్టా అని కొన్ని ప్రత్యేక సూచికలతో ఉన్న భూములను వీటి కింద పరిగణించాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఆర్ఎస్ఆర్‌లోని పట్టాదారు కాలమ్‌లో పట్టాదారుడి పేరు అదే సర్వే నంబరులో ఉన్నట్లు రికార్డుల్లో ఉండాలని సూచించింది. అలాగే ఈ పట్టాలన్నీ 1954 జూన్ 18 లోపు ఇచ్చి ఉండాలని పేర్కొంది. ఈ మూడు అంశాలకు లోబడి రాష్ట్రంలో అన్నిజిల్లాల్లో షరతులు గల పట్టాలను 1908 రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ నుంచి తొలగించవచ్చని సూచించింది. కృష్ణా జిల్లాలో ఈ తరహా భూములు వేలాదిగా ఉన్నాయని, వాటిని 22ఏ నుంచి తొలగించేందుకు మార్గదర్శకాలు ఇవ్వాలని కృష్ణా జిల్లా కలెక్టర్ ఇటీవల ప్రభుత్వాన్ని కోరారు. బ్రిటిష్ పాలనలో 1932–34ల్లో కొన్ని షరతులతో ఈ భూములను రైతులకు పంపిణీ చేసినట్లు ఆయన ప్రభుత్వానికి నివేదించారు. రెవెన్యూ కార్యాలయాల రికార్డుల్లో మాత్రం ఈ వివరాలేవీ లేవని పేర్కొన్నారు. రైతులు మాత్రం పూర్వం నుంచి ఈ భూములను సాగు చేసుకుంటూ.. 2016 వరకు వాటి క్రయవిక్రయాలు కూడా నిర్వహించుకున్నారు. ఆ తర్వాత నుంచి ఆ భూములను నిషేధిత భూముల జాబితాలో చేర్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించినప్పుడు షరతులు గల పట్టా పేరుతో 18,285 ఎకరాలు రికార్డుల్లో ఉన్నట్లు గుర్తించింది. కృష్ణా జిల్లాలో ఒక్క అవనిగడ్డ నియోజకవర్గంలోనే 15 వేల ఎకరాలకుపైగా ఉన్నట్లు తేల్చారు. మరికొన్ని జిల్లాల్లోనూ షరతుల గల పట్టా భూములు ఉన్నాయని, వాటి విషయంలోనూ స్పష్టత ఇవ్వాలని జేసీలతో నిర్వహించిన సమావేశంలో వారు కోరారు. లోతుగా అధ్యయనం చేశాక వేలాది మంది రైతులకు మేలు చేసే అవకాశం ఉండడంతో ప్రభుత్వం ఈ భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించేందుకు మార్గదర్శకాలు ఇచ్చింది.

ఆగని వానలు

అనంతపురం జిల్లాలో కుండపోత

త్వరలో అల్పపీడనం?



అనంతపురంలోని రంగస్వామి నగర్‌లోకి చేరిన వరద నీరు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రవ్యాప్తంగా పది రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు ఇంకా ఆగలేదు. బుధవారం కొన్ని ప్రాంతాల్లో తెరపినిచ్చినా చాలా ప్రాంతాల్లో వర్షాలు పడుతూనే ఉన్నాయి. అనంతపురం, అన్నమయ్య, అనకాపల్లి, పల్నాడు, చిత్తూరు, సత్యసాయి, పల్నాడు, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల్లో భారీవర్షాలు కురిశాయి. ప్రధానంగా అనంతపురం జిల్లాలో కుండపోత వర్షం కురుస్తోంది. అనంతపురం నగరం వర్షాలతో వణుకుతోంది. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం కసిపాడులో బుధవారం అత్యధికంగా 12.7 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మరోవైపు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి బంగాళాఖాతంలో ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇది ఏర్పడితే మరింత బలపడి రాష్ట్రంలో వర్షాలు మరింతగా కురుస్తాయని భావిస్తున్నారు. రెండు, మూడురోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గత 24 గంటల్లో పుంగనూరులో 6.9 సెంటీమీటర్లు, రాప్తాడు, కూడేరుల్లో 6.4, కె.కోటపాడులో 6.3, అనంతపురంలో 6.2, తంబళ్లపల్లెలో 5.7, కుట్టగుళ్లలో 5.4, నగరంలో 5.3, రాజాంలో 5.1 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

అనంతపురాన్ని చుట్టుముట్టిన వరద

అనంతపురం జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం రాత్రి వరకు వర్షం ఏకధాటిగా

మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా

ముగ్గురు ఐపీఎస్ అధికారుల బదిలీ

సాక్షి, అమరావతి: ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్ర పోలీస్ గృహనిర్మాణ సంస్థ ఎండీగా ఉన్న ఎన్.సంజయ్‌ను రాష్ట్ర విపత్తుల స్పందన–అగ్నిమాపక శాఖ డీజీగా నియమించింది. ఐజీ(శిక్షణ)గా ఉన్న పి.వెంకట్రామిరెడ్డిని రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ ఎండీగా బదిలీ చేసింది. రాష్ట్ర విపత్తుల స్పందన- అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్న మాదిరెడ్డి ప్రతాప్‌ను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ సీఎస్ సమీర్ శర్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టీసీ దసరా రాబడి రూ.271 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజా రవాణా విభాగం(ఆర్టీసీ)కి దసరా సీజన్ రికార్డు స్థాయిలో రాబడిని అందించింది. దసరా సీజన్‌లో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 10 వరకు ఆర్టీసీ రూ.271 కోట్లు రాబడి సాధించింది. దసరా సందర్భంగా ఈ ఏడాది 4,626 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడిపింది. ప్రత్యేక బస్సుల ద్వారా రూ.11.50 కోట్లు రాబడి వచ్చింది. ప్రత్యేక బస్సు సర్వీసుల ద్వారా గతేడాది రూ.5.49 కోట్లు రాబడి రాగా ఈ ఏడాది అంతకు రెట్టింపు రాబడి వచ్చింది. పౌర్ణమి సందర్భంగా ఈ నెల 9న అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం నెల్లూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, నరసారావుపేట నుంచి నడిపిన 11 ప్రత్యేక బస్సులు నిర్వహించారు. అక్టోబర్ 10న రూ.22 కోట్లు రాబడి రావడం విశేషం. అలాగే, దసరా సీజన్‌లో ఆర్టీసీ 85 శాతం ఆక్యుపెన్సీ సాధించింది.

బ్యాంక్ ఆఫ్ బరోడా'తో ఏపీఐఐసీ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో భరత్ గుప్తా, మన్మోహన్ గుప్తా

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ మార్గనిర్దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలకు ఉపయోగపడేలా ఏపీఐఐసీ మరో కీలక ఒప్పందం చేసుకుంది. ఎంఎస్ఎంఈ సంస్థలకు తక్షణం రుణాలు మంజూరు చేసేలా బ్యాంక్ ఆఫ్ బరోడాతో ఏపీఐఐసీ ఒప్పందం చేసుకుంది. బుధవారం విజయవాడలో ఒప్పంద పత్రాలపై ఏపీఐఐసీ వీసీ, ఎండీ భరత్‌గుప్తా, బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ మన్మోహన్‌గుప్తాలు సంతకాలు చేసి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. భరత్‌గుప్తా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పారిశ్రామిక పార్కుల్లోని పారిశ్రామికవేత్తలకూ ఈ వెసులుబాటు కల్పించేలా బ్యాంక్ ఆఫ్ బరోడాతో కలిసి ముందుకు సాగుతామన్నారు. గత ఆగస్టులో యూనియన్ బ్యాంకుతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందంతో ఎంఎస్ఎంఈ యూనిట్లకు రూ.10 కోట్లకు పైగా రుణాలిచ్చినట్టు తెలిపారు.

జేఏ పోస్టుల స్క్రీనింగ్ టెస్ట్ ఫలితాలు విడుదల

సాక్షి అమరావతి: జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్ ఫలితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) బుధవారం వెల్లడించింది. 670 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా 2,11,341 మంది స్క్రీనింగ్ టెస్టుకు హాజరయ్యారు. మెయిన్ పరీక్షలకు 11,574 మంది ఎంపికయ్యారు. ఫలితాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ https://psc.ap.gov.in/ లో పొందుపరిచారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి మెయిన్ పరీక్షలు నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షల షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తారు.

ఇంధన సామర్థ్యానికి 16 మార్గాలు

- గోవా జాతీయ శిఖరాగ్ర సదస్సులో ప్రతిపాదించిన ఏపీఎస్ఈసీఎం

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాలు కేంద్ర విద్యుత్ శాఖ నేతృత్వంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ)కి రూ.వెయ్యి కోట్ల విలువైన 56 ఎనర్జీ ఎఫిషియెన్సీ ఫైనాన్సింగ్ ప్రాజెక్టులను సమర్పించగా వాటిలో 16 ప్రాజెక్టులతో ఏపీ తొలిస్థానంలో నిలిచిందని బీఈఈ డైరెక్టర్ వినీతా కన్వాల్ ప్రకటించారు. గోవాలో మంగళ, బుధవారాల్లో జరిగిన జాతీయ శిఖరాగ్ర సదస్సులో ఆమె ఏపీని అభినందించినట్లు రాష్ట్రం తరఫున హాజరైన ఏపీ ఇంధన సంరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి బుధవారం మీడియాకు తెలిపారు. ఇంధన సామర్థ్య కార్యక్రమాలను అమలు చేస్తున్న పరిశ్రమలకు వడ్డీ రాయితీ పథకాన్ని ప్రారంభించాలని రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తరఫున ఈ సదస్సులో ప్రతిపాదించినట్లు చెప్పారు. ఎంఎస్ఎంఈలు విద్యుత్ పొదుపు చర్యలను అమలు చేయడానికి ఈ రాయితీ ఉపయోగపడుతుందన్నారు. 2030 నాటికి కర్బన ఉద్గారాలను ఒక బిలియన్ టన్నులు తగ్గించాలని, 2070 నాటికి సున్నాకు తీసుకురావాలనే లక్ష్యంతో వచ్చే జనవరి నాటికి ఐదేళ్ల యాక్షన్ ప్లాన్ ఖరారు చేయాలని బీఈఈ డీజీ అభయ్ బక్రే అన్ని రాష్ట్రాల డిజిగ్నేటెడ్(నోడల్) ఏజెన్సీలకు సూచించారని ఆయన చెప్పారు.

ఇథియోపియాకు సహకారం అందిస్తాం

మా సాంకేతిక సహకారం కోరడం ఆనందంగా ఉంది

- గ్రామ స్థాయిలో రైతుకు సేవ లందించాలన్నదే మా ఆలోచన
- సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందాలి.. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలందాలి
- ఈ ఆలోచనతోనే గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకే వ్యవస్థలను తీసుకొచ్చాం
- ఆర్బీకేల ద్వారా నాణ్యమైన ఇన్‌పుట్స్ అందిస్తున్నాం
- పంటల ధరలు తగ్గితే వెంటనే ప్రభుత్వమే మద్దతు ధరకు కొంటోంది.. రైతుల సమస్యల పరిష్కారానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం
- ఇథియోపియా బృందంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- సచివాలయ వ్యవస్థ చాలా ఆకట్టుకుందన్న ఇథియోపియా బృందం.. ఆర్బీకే సాంకేతికతను తమకూ అందించాలని వినతి
- తప్పకుండా అందిస్తామని చెప్పిన సీఎం వైఎస్ జగన్



ఇథియోపియా బృందంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సీఎం జగన్‌లో దార్శనికత కనిపిస్తోంది: ఇథియోపియా మంత్రి

'ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న ఆర్బీకేల వ్యవస్థ మమ్మల్ని చాలా ఆకట్టుకుంది. వీటికి బీజం వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో దూరదృష్టి, దార్శనికత కనిపిస్తోంది. ఆయన ఆలోచనలు క్షేత్రస్థాయిలో అద్భుతంగా అమలవుతున్నాయి' అని ఇథియోపియా దేశ వ్యవసాయ శాఖ మంత్రి మెలెస్ మెకొనెన్ ఐమెర్ సీఎంతో జరిగిన భేటీలో చెప్పారు. 'రైతుకు అండగా నిలవాలి, వారికి మంచి జరగాలన్న మీ అభిరుచి, సంకల్పం, క్షేత్రస్థాయిలో మంచి మార్పులు తేవడం మమ్మల్ని అబ్బుర పరుస్తోంది. ఏపీలో ఆర్బీకేల వ్యవస్థ రైతులకు చేదోడుగా నిలుస్తోంది. వ్యవసాయ రంగానికి సంబంధించిన వివిధ విభాగాలను ఆర్బీకేలతో అనుసంధానం చేయడం చాలా బాగుంది. డిజిటల్, సాంకేతిక పరిజ్ఞానాన్ని బాగా వినియోగించుకుంటున్నారు. ఆర్బీకేల విషయంలో మీ ప్రభుత్వం నుంచి మేం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. వ్యవసాయ రంగంలో మీకున్న పరిజ్ఞానాన్ని మేం అందిపుచ్చుకుంటాం. మాకున్న పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను మీతో పంచుకుంటాం' అని ఆయన చెప్పారు. అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఏజెన్సీ ఆఫ్ ఇథియోపియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ మాండెఫ్రో నిగుస్సియా మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం రైతుకు అండగా నిలుస్తున్న తీరు చాలా బాగుందని చెప్పారు. ఆర్బీకేల వ్యవస్థ వ్యవసాయ రంగాన్ని ఎంతో బలోపేతం చేస్తోందన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకునేలా వ్యవసాయ రంగాన్ని ఈ వ్యవస్థ తీర్చిదిద్దుతోందని తెలిపారు. రైతుల సందేహాలు, సమస్యలు.. తదితర అంశాలన్నింటికీ క్షేత్రస్థాయిలో వన్‌స్టాప్ పద్ధతిలో పరిష్కారాలు సూచించడానికి ఈ వ్యవస్థ దోహదపడుతోందని అన్నారు ఇతరులకూ ఈ వ్యవస్థ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. పశువుల కోసం మొబైల్ అంబులెన్సులు ఏర్పాటు కూడా బాగుందన్నారు. ఈ విధానాలను తాము కూడా అనుసరిస్తామని చెప్పారు. ఆర్బీకేల్లో అమలు చేస్తున్న డిజిటల్ సొల్యూషన్స్‌లో తమకు సహకారం అందించాలని ఇథియోపియా బృందం అభ్యర్థించగా, కచ్చితంగా సహకారం అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

సాక్షి, అమరావతి : ఇథియోపియాలో వ్యవసాయ రంగం విస్తరణకు సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఇథియోపియా బృందం బుధవారం రాత్రి తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో సమావేశమైంది. ఆర్బీకేలు, సమీకృత రైతు సమాచార కేంద్రం, ఆర్బీకే చానల్, ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌లో తాము తెలుసుకున్న విషయాలను, అనుభవాలను సీఎంకు వివరించింది. ఈ వ్యవస్థలు రైతులకు ఎంతో మేలు చేసేవిగా ఉన్నాయని వివరించింది. ఆర్బీకే సాంకేతికతను తమ దేశంలోనూ ప్రవేశపెట్టడానికి సహకారం అందించాలని కోరింది. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. 'మీకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. ఏ రూపంలో ఏ సహాయం కావాలన్నా తోడుగా ఉంటాం. మీ సహాయాన్ని కూడా మేము తీసుకుంటాం ' అని చెప్పారు. 'మీ బృందం ఆర్బీకేలను సందర్శించడం, రైతులతో మాట్లాడడం సంతోషకరం. సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందాలి. గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలందాలి. ఈ ఆలోచనతోనే గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకే వ్యవస్థలను తీసుకొచ్చాం. ప్రతి ఆర్బీకేలో పంటల సాగును బట్టి వ్యవసాయ, ఉద్యాన, మత్స్య పట్టభద్రులను అందుబాటులో ఉంచాం. ప్రతి ఆర్బీకేలో కియోస్క్ పెట్టాం. ఆర్డర్ పెట్టిన వెంటనే నాణ్యమైన ఇన్‌పుట్స్‌ను రైతులకు అందిస్తున్నాం. తద్వారా కల్తీకి అడ్డుకట్ట వేశాం. ఆర్బీకేల్లో వ్యవసాయ సలహా మండళ్లను ఏర్పాటు చేశాం. సాగవుతున్న ప్రతి పంటను ఈ–క్రాపింగ్ చేసి ఫిజికల్, డిజిటల్ రసీదు లిస్తున్నాం. మార్కెట్‌లో పంట ఉత్పత్తుల ధరలను నిరంతరం పర్యవేక్షించడానికి సీఎం యాప్‌ను తీసుకొచ్చాం. ఎక్కడైనా ధరలు తగ్గితే వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతులకు నష్టం రాకుండా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. అంకిత భావంతో పనిచేసే అధికారుల వల్ల ఇవన్నీ సాకారమవుతున్నాయి. ఎరువులు, రసాయనాలు, పురుగు మందులు విచక్షణ రహితంగా వాడటాన్ని నివారించాలన్నది మరో లక్ష్యం. ఇందుకోసం మార్చి, ఏప్రిల్, మే నెలల్లో భూసార పరీక్షలు చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాం. సాయిల్ టెస్ట్ ఫలితాల ఆధారంగా ఎలాంటి పంటలు వేయాలి? ఎంత మోతాదులో ఎరువులు, రసాయనాలు వాడాలి? అన్న విషయాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తాం. దీనికి సంబంధించి రిపోర్టు కార్డులను కూడా ఇస్తాం. ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్‌ను వచ్చే ఏడాది జూన్ నుంచి అమల్లోకి తీసుకువస్తాం' అని సీఎం వైఎస్ జగన్ వివరించారు.

ఏపీలో ఆర్బీకేలు అద్భుతం

▶ మొదటి పేజీ తరువాయి

బుధవారం తొలుత గన్నవరంలోని సమీకృత రైతు సమాచార కేంద్రం (ఐసీసీ), ఆర్బీకే చానల్‌ను, ఆ తర్వాత కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం గండిగుంట ఆర్బీకే–2ను సందర్శించింది. ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌లో రైతుల నుంచి వస్తున్న కాల్స్‌ను రిసీవ్ చేసుకుంటున్న తీరు, అక్కడున్న శాస్త్రవేత్తలు, అధికారులు బదులిస్తున్న తీరును పరిశీలించింది. ఆర్బీకే చానల్ ద్వారా రైతులకు సంబంధించిన ఎలాంటి కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నారో తెలుసుకుంది.

గండిగుంట ఆర్బీకేలోనే రెండున్నర గంటలు

ఆర్బీకేల సేవలను తెలుసుకునేందుకు ఈ బృందం గండిగుంట ఆర్బీకేలో రెండున్నర గంటల పాటు గడిపింది. రైతులతో మమేకమైంది. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల స్టాల్స్‌ను లకించింది. కియోస్క్ ద్వారా రైతులు ఇన్‌పుట్స్ బుక్ చేసుకుంటున్న విధానాన్ని పరిశీలించింది. డిజిటల్ లైబ్రరీ, కొనుగోలు కేంద్రం, వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రం, వెటర్నరీ అంబులెన్స్, రైతు రథం, పొలం బడి క్షేత్రం ఇలా ప్రతి ఒక్కటీ పరిశీలించి వాటి పనితీరు, సేవలను తెలుసుకుంది. వ్యవసాయ సలహా మండళ్ల ఏర్పాటు, విధులు, బాధ్యతలపై బృందం సభ్యులు ఆరా తీసారు. మూడేళ్లుగా ఆర్బీకేలు అందిస్తున్న సేవలను వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య వివరించారు. ఆర్బీకే లొచ్చిన తర్వాత వ్యవసాయ అవసరాల కోసం గ్రామం విడిచి వెళ్లడంలేదని రైతులు ఈ బృందానికి వివరించారు. అనంతరం విజయవాడలో అధికారులతో సమావేశమయ్యారు. శాఖలవారీగా అమలు చేస్తున్న కార్యక్రమాలు, అందిస్తున్న సేవలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ బృందానికి వివరించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి ముందుకెళ్తాం

ఆర్బీకేలు నిజంగా రోల్ మోడల్‌గా ఉన్నాయని ఇథియోపియా వ్యవసాయ మంత్రి చెప్పారు. వీటి సాంకేతికతను అందిపుచ్చుకుంటామని, తమ దేశంలో కూడా ఈ సేవలు అందించడానికి ఏపీ ప్రభుత్వంతో కలిసి ముందుకెళ్తామని చెప్పారు. వ్యవసాయాధార దేశమైన ఇథియోపియాలో రైతులకు నాణ్యమైన సేవలందించడమే లక్ష్యమని చెప్పారు. సౌత్‌సౌత్ కో ఆపరేషన్ సమావేశంలో భారతప్రభుత్వం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న కార్యక్రమాలు తెలుసుకున్నామన్నారు. ఏపీ ప్రభుత్వ పనితీరు, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని కొనియాడారు. ఈ పర్యటనలో ఇథియోపియా బృందం సభ్యులతో పాటు వ్యవసాయ, ఉద్యాన, మత్స్య శాఖల కమిషనర్లు చేవూరు హరికిరణ్, శ్రీధర్, కన్నబాబు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల బకాయిల విడుదలపై హర్షం

సాక్షి, అమరావతి: సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న చేనేత బకాయిల విడుదలపై చేనేత సహకార సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. పూర్వపు గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి బుధవారం విజయవాడ ఆప్కో కేంద్ర కార్యాలయానికి వచ్చిన నేతన్నలు సంస్థ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, చేనేత, జౌళి శాఖ కమిషనర్, ఆప్కో ఎండీ ఎంఎం నాయక్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం నుంచి పేరుకుపోయిన బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిస్థాయిలో విడుదల చేసిందని చిల్లపల్లి చెప్పారు. చివరి విడతగా ఇటీవల రూ.70 కోట్లను సీఎం జగన్ విడుదల చేశారన్నారు. పండుగల సమయంలో ఇచ్చిన ప్రత్యేక రాయితీ, థ్రిఫ్ట్ ఫండ్, నూలు రాయితీ, పావలా వడ్డీల బకాయిలను కూడా విడుదల చేయాలని ప్రతినిధులు విన్నవించారు. అనంతరం చిల్లపల్లి నేతృత్వంలో ప్రభుత్వ సలహాదారు సజ్జలను కలసి ధన్యవాదాలు తెలిపారు.

గవర్నర్‌తో అమెరికా కాన్సుల్ జనరల్ భేటీ



గవర్నర్‌తో అమెరికా కాన్సుల్ జనరల్

సాక్షి, అమరావతి: అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో బుధవారం భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని సామాజిక, రాజకీయ పరిస్థితులను ఆమెకు గవర్నర్ వివరించారు. రాష్ట్రంలోని ఆకర్షణీయ పర్యాటక ప్రదేశాలను సందర్శించాలని సూచించారు. భారతీయ విద్యార్థులకు వీసాల జారీ ప్రక్రియను అమెరికా సరళతరం చేసిందని జెన్నిఫర్ లార్సన్ గవర్నర్‌కు వివరించారు. ఈ భేటీలో ఉప కాన్సుల్ జనరల్ మార్షల్ విలియమ్స్, అమెరికా కాన్సులేట్ రాజకీయ, ఆర్థిక విభాగాధిపతి సీన్ రూత్, రాజకీయ, ఆర్థిక నిపుణుడు శ్రీమల్లి, రాష్ట్ర గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌దారులను విడిచిపెట్టం

- మా ఉత్తర్వుల తర్వాత కూడా తవ్వకాలు జరిగాయో, లేదో తేలుస్తాం
- దీనిపై సుమోటో కోర్టు ధిక్కార కేసు నమోదు చేయండి
- రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: అక్రమ మైనింగ్‌దారులను విడిచిపెట్టే ప్రసక్తే లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి పరిధిలో అక్రమ గ్రావెల్ తవ్వకాలను నిలిపేయాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేశాక కూడా తవ్వకాలు జరిగాయా, లేదా అనే వ్యవహారాన్ని తేలుస్తామంది. దీనిపై సుమోటోగా కోర్టు ధిక్కార కేసు నమోదు చేయాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ నెల 17న దీనిపై విచారణ జరుపుతామని తెలిపింది. ఈ కేసులో పిటిషనర్ల తరఫు వాదనలు వినిపిస్తున్నందుకు తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని న్యాయవాది మహేశ్వరరావు చేసిన ఫిర్యాదుపై హైకోర్టు స్పందించింది. బెదిరింపుల విషయాన్ని లిఖిత పూర్వకంగా తమ ముందుంచాలని పేర్కొంది. అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేసిన వారిపై ఆగిరిపల్లి పోలీసులు కేసు నమోదు చేయడంపై మండిపడ్డ హైకోర్టు తమ ముందు హాజరైన ఎస్ఐ చంటిబాబును వివరణ కోరింది. ఈ వ్యవహారానికి దూరంగా ఉండాలని, లేనిపక్షంలో ఇబ్బందులు పడతారని హెచ్చరించింది. మైనింగ్ ఆపాలంటూ తాము ఆదేశాలు ఇచ్చిన రోజునే ఫిర్యాదుదారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ప్రశ్నించింది. ఇలాంటి చర్యలకు పాల్పడితే అరెస్టుకు ఆదేశాలిస్తామని ఎస్ఐను హెచ్చరించింది. ఒంటిపై ఉన్న యూనిఫాంను ఎలా తీయించాలో తమకు బాగా తెలుసంది. గ్రావెల్ తవ్వకాలకు అనుమతినిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఈ వ్యవహారంపై తిరిగి విచారణ జరపాలని సింగిల్ జడ్జికి సూచిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది.

ఇదీ కేసు..

తోటపల్లి పరిధిలో గ్రావెల్ తవ్వకాలు జరుపుకునేందుకు బసవపూర్ణయ్యకు తాత్కాలిక అనుమతి మంజూరు చేస్తూ గనుల శాఖ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ జె.లక్ష్మణరావు, మరో ఐదుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మొదట విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ రావు రఘునందన్‌రావు తవ్వకాలు జరపొద్దంటూ ఉత్తర్వులిచ్చారు. మరో సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తవ్వకాలు జరుపుకునేందుకు అనుమతినిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్లు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన సీజే ధర్మాసనం గ్రావెల్ తవ్వకాలకు అనుమతినిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపివేసింది. హైకోర్టును ఆశ్రయించిన రైతులపైనే ఆగిరిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారని తెలుసుకున్న ధర్మాసనం మైనింగ్ నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించింది.

సచివాలయాల్లో మ్యారేజి సర్టిఫికెట్లు

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో మ్యారేజి సర్టిఫికెట్లు జారీచేయనున్నారు. ఆయా సచివాలయాల్లో ఈ సేవను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇకనుంచి ఎవరైనా మ్యారేజి సర్టిఫికేట్ కోసం గ్రామ, వార్డు సచివాలయంలోనే దరఖాస్తు చేసుకోవచ్చు. పెళ్లయిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో 60 రోజుల్లోపు, పట్టణ ప్రాంతాల్లో 90 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఆ గడువు తర్వాత మ్యారేజి సర్టిఫికెట్ అవసరమైన వారు ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మ్యారేజి సర్టిఫికెట్ జారీకి సంబంధించి యూజర్ మాన్యువల్‌ను గ్రామ, వార్డు సచివాలయశాఖ అధికారులు అన్ని సచివాలయాలకు పంపారు. పెళ్లి జరిగిన ప్రాంతానికి సంబంధించిన సచివాలయంలోనే సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. దంపతుల ఆధార్ నంబరు, ఇతర వివరాలతో ఈ కార్డులు జారీచేస్తారు. ఈ సర్టిఫికెట్ తీసుకోవడం ద్వారా కొత్త దంపతుల పేరుతో రేషన్‌కార్డు విభజన ప్రక్రియ సులువుగా ఉంటుందని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో రేషన్‌కార్డు విభజన ప్రక్రియలో ఆయా వ్యక్తుల ఆధార్ నంబరు ఆధారంగా ఏపీసేవ పోర్టల్‌లో గ్రామ, వార్డు సచివాలయశాఖ మ్యారేజి సర్టిఫికెట్‌ను ధ్రువీకరించుకునే వీలును కూడా కల్పించినట్టు చెప్పారు.

పెట్టుబడులకు ఏపీని వేదికగా ఉపయోగించుకోండి

- యూఎస్ కాన్సుల్‌జనరల్ జెన్నిఫర్ లార్సన్‌ను కోరిన సీఎం జగన్
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు వెల్లడి
- కోవిడ్ మేనేజ్‌మెంట్ బాగా చేశారని సీఎం జగన్‌ను అభినందించిన జెన్నిఫర్



యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను మంచి వేదికగా ఉపయోగించుకోవాలని యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోరారు. ఇందుకోసం ప్రభుత్వం తరఫున ఎటువంటి సహకారమైనా అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని సీఎం జగన్ చెప్పారు. యూఎస్ కాన్సుల్ జనరల్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జెన్నిఫర్ ఏపీలో మొదటిసారి పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జెన్నిఫర్ లార్సన్ బృందం బుధవారం కలిసింది. కొత్త రాష్ట్రమైనా, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కోవిడ్ మేనేజ్‌మెంట్ బాగా చేశారని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని జెన్నిఫర్ అభినందించారు. జీడీపీ గ్రోత్ రేట్‌లో రాష్ట్రం నంబర్ వన్‌గా ఉందంటూ ప్రశంసించారు. ఏపీలో అమెరికన్ కార్నర్ పని తీరు బావుందని తెలిపారు. ఈ సమావేశంలో యూఎస్ కాన్సులేట్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులు, సీఎం స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, స్పెషల్ సెక్రటరీ డాక్టర్ ఎం.హరికృష్ణ పాల్గొన్నారు.

బొగ్గు.. తగ్గొద్దు



ఇంధన శాఖపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

రైతులకు వివరాలు అందించాలని సూచించారు. 'మీటర్లు పెట్టడం వల్ల రైతులకు ఎంత కరెంట్ అవసరమో తెలుస్తుంది. దీనివల్ల సరిపడా విద్యుత్‌ను పంపిణీ చేయడానికి వీలు కలుగుతుంది. వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవు. రైతులకు ఒక్కపైసా కూడా ఖర్చు కాకుండా విద్యుత్ పంపిణీ సంస్థలే మీటర్లను బిగిస్తాయి. వినియోగించుకున్న విద్యుత్‌కు అయ్యే ఖర్చును కూడా నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తారు. ఆ డబ్బు అక్కడ నుంచి విద్యుత్ పంపిణీ సంస్థలకు చేరుతుంది. దీంతో విద్యుత్ పంపిణీ సంస్థలు రైతులకు జవాబు దారీగా ఉంటాయి. మోటార్లు కాలిపోయినా, నాణ్యమైన కరెంట్ సరఫరా కాకపోయినా డిస్కంలను రైతులు ప్రశ్నించగలుగుతారు. ఈ వివరాలన్నింటిపైనా వారికి నిరంతరం అవగాహన కల్పించాలి' అని సూచించారు. శ్రీకాకుళం జిల్లాలో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు ద్వారా రైతులకు పెద్ద ఎత్తున మేలు జరుగుతోందని, దీనివల్ల చాలా విద్యుత్ ఆదా అయిందనే వివరాలతో సమగ్ర లేఖ ద్వారా విడుదల చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

16.63 లక్షల మంది రైతుల అంగీకారం

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు అమర్చేందుకు ఇప్పటికే 16,63,705 మంది రైతులు అంగీకరించారని అధికారులు తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నందున వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. రైతుల పేరు చెప్పి దొంగతనంగా విద్యుత్ వాడుతున్న ఘటనలను దాదాపుగా అడ్డుకోగలుగుతున్నామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పాడైన 24 గంటల్లోపే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పెట్టాలని ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి అవాంతరాలు లేకుండా విద్యుత్ అందిస్తున్నామని, గత 90 రోజుల్లో 99.5 శాతం ట్రాన్స్‌ఫార్మర్లను 24 గంటల్లోపే రీప్లేస్ చేశామని వివరించారు. అయితే ఇది నూటికి నూరుశాతం జరగాలని సీఎం జగన్ ఆదేశించారు.

అందుబాటులోకి కొత్త యూనిట్లు..

పోలవరంలో విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనుల ప్రగతిని అధికారులు సీఎంకు వివరించారు. ఇప్పటికే టర్బైన్ మోడల్ టెస్ట్ ముగిసిందని, ఇంజనీరింగ్ డ్రాయింగ్స్ వేగంగా పూర్తవుతున్నాయని తెలిపారు. పవర్ హౌస్‌లో కాంక్రీటు పనులు ముందుకు సాగుతున్నాయన్నారు. అప్పర్ సీలేరులో 1,350 మెగావాట్ల ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ పూర్తైందని, టెండర్ల ప్రక్రియకు సిద్ధమవుతున్నామని వెల్లడించారు. కృష్ణపట్నంలో 800 మెగావాట్ల యూనిట్ అందుబాటులోకి వచ్చిందని, ఈ ప్రాజెక్టును ఈ నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. విజయవాడ థర్మల్ పవర్ కేంద్రంలో కూడా మరో 800 మెగావాట్ల కొత్త యూనిట్‌ను వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తి చేస్తామన్నారు. ఈ రెండు యూనిట్లను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని సీఎం సూచించారు.

సాంకేతికతతో ముందడుగు..

విద్యుత్ డిమాండ్, కొనుగోళ్లు, మార్కెట్‌లో ధరలు తదితర అంశాలపై స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్(ఎస్ఎల్‌డీసీ)లో డేటా అనలిటిక్స్‌ను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. విద్యుత్ కొనుగోలు ఖర్చు తగ్గించుకునేందుకు ఇది చాలా ఉపయోగపడుతోందన్నారు. కచ్చితమైన డిమాండ్‌ను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానాన్ని వినియోగిస్తున్నామని, దీనివల్ల గతంలో 4 నుంచి 5 శాతం ఉన్న మీన్ యావరేజ్ పర్సంటేజ్ ఎర్రర్ (ఎంఏపీఈ) 2 శాతానికి తగ్గిందని వెల్లడించారు.

పంప్డ్ స్టోరేజీతో రాష్ట్రానికి ప్రయోజనం..

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల వల్ల రాష్ట్రానికి చాలా ప్రయోజనాలున్నాయని సీఎం జగన్ పేర్కొన్నారు. 'ప్రాజెక్టులకు భూములిచ్చిన వారికి, అసైన్డ్ భూములున్న వారికి కూడా ఏడాదికి ఎకరాకు రూ.30 వేల చొప్పున ఆదాయం సమకూరుతుంది. దీర్ఘకాలం ఈ ప్రయోజనాలు అందుతాయి. ప్రతి రెండేళ్లకు ఒకసారి 5 శాతం చొప్పున ఈ ధర పెరుగుతుంది. భూములిచ్చే రైతులకు గరిష్ట ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ విధానానికి శ్రీకారం చుట్టాం' అని సీఎం తెలిపారు.

గ్రీన్ ఎనర్జీకి భారీ ప్రతిపాదనలు..

గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి కోసం భారీ ప్రాజెక్టు ప్రతిపాదనలు అందాయని, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులను నెలకొల్పనున్నట్లు రెన్యూ కంపెనీ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయని అధికారులు వెల్లడించారు. ఇందుకోసం విశాఖపట్నం, కాకినాడ పోర్టులకు సమీపంలో దాదాపు రూ.20 వేల కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రతిపాదించారని తెలిపారు. ఎన్టీపీసీ నుంచి కూడా ప్రతిపాదనలు వచ్చాయన్నారు. విశాఖ జిల్లా పూడిమడక సమీపంలో గ్రీన్ హైడ్రోజన్ ఇ- మెథనాల్, గ్రీన్ అమ్మోనియా, ఆఫ్ షోర్ విండ్ పవర్, హైడ్రోజన్ ఆధారిత విద్యుత్ కేంద్రాలపై రూ.95 వేల కోట్ల పెట్టుబడులు పెడతామంటూ వచ్చిన ప్రతిపాదనల గురించి అధికారులు సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు. ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎస్ సమీర్ శర్మ, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ రావత్, ఏపీ జెన్‌కో ఎండీ బి.శ్రీధర్, డిస్కమ్‌ల సీఎండీలు కె.సంతోషరావు, జె. పద్మా జనార్దనరెడ్డి తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ లజపతిరాయ్, మంత్రి గుడివాడ తదితరులు

'విశాఖ గర్జన' పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, విశాఖపట్నం: మూడు రాజధానులకు మద్దతుగా నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించనున్న 'విశాఖ గర్జన' పోస్టర్‌ను బుధవారం ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్ లజపతిరాయ్, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించారు. జెండా, అజెండాలను పక్కన పెట్టి ఉత్తరాంధ్ర ప్రాంత నేతలు వికేంద్రీకరణకు మద్దతివ్వాలని, ఇందుకు భిన్నంగా వ్యవహరించేవారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర జేఏసీ వైస్ చైర్మన్ దేవుడు మాస్టార్, జేఏసీ అడ్వైజరీ బాల మోహన్‌దాస్, జేఏసీ సభ్యులు కృష్ణమోహన్, షోరన్‌రాజ్, శివశంకర్, పోలాకి శ్రీనివాసరావు, బి.నరసింగరావు, గంట్ల శ్రీను బాబు, ఎన్.ఏ.డీ పాల్, కృష్ణమోహన్, జి.రవికుమార్, శుభశ్రీ, వసంత కృష్ణ, బి.నాగభూషణ్, కొల్లు సూర్యనారాయణ, కొయ్య ప్రసాద్‌రెడ్డి, టి.శివాజీలు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎంపీ భీశెట్టి సత్యవతి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకెరాజు, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉవ్వెత్తున ఉద్యమం

▶ మొదటి పేజీ తరువాయి

కావాలని కోరుతూ పెందుర్తిలో నాన్ పొలిటికల్ జేఏసీ నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పాల్గొన్నారు. వేపగుంట కూడలిలో వందలాది మందితో ర్యాలీ చేశారు. ఈ నెల 15న జరిగే విశాఖ గర్జనలో అంతా పాల్గొనాలని కోరుతూ ప్రయాణికులకు, స్థానికులకు, పాదచారులకు, చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే కరపత్రాలు పంపిణీ చేశారు. పరవాడ సినిమా హాలు కూడలిలో రాజకీయేతర జేఏసీ భారీ మానవహారం నిర్వహించి ఒక్క రాజధాని వద్దు.. మూడు రాజధానులే ముద్దు అంటూ నినదించింది. విశాఖ తూర్పు నియోజకవర్గంలో నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నగర మేయరు గొలగాని హరి వెంకటకుమారి హాజరయ్యారు. ఈనెల 15న జరిగే విశాఖ గర్జనకు ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. మూడు రాజధానులకు మద్దతుగా గాజువాకలో ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

అనకాపల్లి జిల్లాలో..

పరిపాలనా రాజధానిగా విశాఖకు మద్దతుగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లిలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. నక్కపల్లి జాతీయ రహదారి పక్కన ఉన్న పాన్‌షాప్ వద్ద మూడు రాజధానులే మేలంటూ ఫ్లెక్సీ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. చోడవరం నియోజకవర్గం వడ్డాదిలో వెంకటేశ్వరస్వామి ఆర్చ్ నుంచి బుచ్చెయ్యపేట నాలుగు రోడ్ల జంక్షన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బుచ్చెయ్యపేట జంక్షన్‌లో మానవ హారంగా ఏర్పడి మూడు రాజధానులు కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆపరేటివ్ అధ్యక్షులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వికేంద్రీకరణ, విశాఖ పరిపాలన రాజధానిగా కోరుతూ బుచ్చింపేట నుంచి జేపీఅగ్రహారం వరకు వివిధ అభివృద్ధి సంఘాల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

శ్రీకాకుళం జిల్లాలో..

వికేంద్రీకరణకు మద్దతుగా శ్రీకాకుళం జిల్లాలో ఐదు రోజులుగా జరుగుతున్న రిలే దీక్షలు బుధవారంతో ముగిశాయి. నరసన్నపేటలో జరుగుతున్న ఈ దీక్షా శిబిరాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ బుధవారం సందర్శించారు. ఈ నెల 15న నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశాఖ గర్జనకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. విశాఖను పరిపాలన రాజధాని చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆముదాలవలస నియోజకవర్గం పొందూరులో స్పీకర్ తమ్మినేని సీతారాం వికేంద్రీకరణ అవసరాన్ని ప్రజలకు వివరిస్తూ, విశాఖ రాజధాని సాధన కోసం యువత, ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

విజయనగరం జిల్లాలో..

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోనూ పలు ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించారు. బాడంగి మండలం భీమవరంలో జరిగిన సదస్సులో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొని ఉత్తరాంధ్ర అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ విశాఖ గర్జనకు రావాలని పిలుపునిచ్చారు. బాడంగిలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో వికేంద్రీకరణకు మద్దతుగా ప్రదర్శనలు చేశారు.

అల్లూరి జిల్లాలో..

మూడు రాజధానులకు మద్దతుగా చింతపల్లిలోని ముత్యాలమ్మ దేవాలయంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మత్స్యరాస వెంకటలక్ష్మి 108 కొబ్బరి కాయలు కొట్టారు. 26 జిల్లాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలబడేలా దీవించాలని మొక్కుకున్నారు.

వికేంద్రీకరణకు మద్దతుగా భారీ బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీలో మంత్రి కారుమూరి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

నిడదవోలు/తణుకుఅర్బన్/ఇరగవరం: పాలన వికేంద్రీకరణకు మద్దతుగా తూర్పు గోదావరి జిల్లాలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు నేతృత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీ గణపతి సెంటర్, పాటిమీద సెంటర్, పోలీస్‌స్టేషన్ కూడలి, గాంధీబొమ్మ సెంటర్లకు చేరుకుంది. అక్కడ నుంచి నిడదవోలు మండలం సమిశ్రగూడెం, డి.ముప్పవరం, కలవచర్ల, మునిపల్లి వరకు కొనసాగింది. పెరవలి మండలంలో మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు మద్దిపాటి ఫణీంద్ర, అయినీడి పల్లారావు, కార్యదర్శి గాజుల రంగారావు, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, జెడ్పీటీసీలు కొయ్యే సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

తణుకులో

పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం అయితంపూడి లాకుల వద్ద మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం భారీ బైక్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ ఏలేటిపాడు, తణుకు మండలం వేల్పూరు, పైడిపర్రు, తణుకులోని రాష్ట్రపతి రోడ్డు మీదుగా సాగింది. తణుకులోని నరేంద్ర సెంటర్‌లో సభ నిర్వహించారు. ర్యాలీలో భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు నల్ల షర్టులు, నల్ల కండువాలు వేసుకుని సభకు హాజరయ్యారు. సభ ముగింపులో మంత్రి కారుమూరి నల్ల బెలూన్‌లు గాలిలోకి వదిలి అమరావతి రైతుల పాదయాత్రకు నిరసన తెలిపారు. మంత్రి మాట్లాడుతూ అమరావతి రైతుల పాదయాత్రలో ఉన్నవారంతా టీడీపీ నేతలు, కార్యకర్తలేనన్నారు. పెత్తందార్లు, చంద్రబాబు బినామీ, టీడీపీ నాయకులు మాత్రమే ఫేక్ పాదయాత్రలో పాల్గొంటున్నారని విమర్శించారు.

ఉత్తరాంధ్రులది బతుకు పోరాటం

- మూడు రాజధానులతోనే సమాన ప్రగతి
- విశాఖను రాజధానిగా సమర్థించని వారు ఉత్తరాంధ్ర ద్రోహులు
- ఉత్తరాంధ్రకు చంద్రబాబు చేసిందేమీ లేదు
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్రులది బతుకు పోరాటమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. మూడు రాజధానులతోనే రాష్ట్రంలో అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలోని ఒకప్పటి రైతు ఇప్పుడు వాచ్‌మెన్‌గా, రోజు కూలీగా మారిపోయాడని, ఇందుకు ప్రాంతాల మధ్య ఆర్థిక అసమానతలే కారణమని చెప్పారు. రాజధానిలో కాస్మోపాలిటిన్ వాతావరణం ఉండాలని, విశాఖలో ఆ తరహా వాతావరణం ఉందని తెలిపారు. అమరావతిలో ఇతరులకు భూమి లభించే అవకాశం లేదని, సామాన్యులకు అవకాశం లేని రాజధానికి తాము వ్యతిరేకమని స్పష్టంచేశారు. అమరావతిని అభివృద్ధి చేశామన్న చంద్రబాబు.. ఆయన కొడుకు అక్కడ ఎందుకు గెలవలేదని ప్రశ్నించారు. విశాఖను రాజధానిగా సమర్థించని వారు ఉత్తరాంధ్ర ద్రోహులుగా మిగిలిపోతారని అన్నారు. శివరామకృష్ణన్ కమిటీ రిపోర్టులో విశాఖ రాజధాని పెట్టుకోవచ్చని సూచించినట్లు గుర్తు చేశారు. ఇందుకు టీడీపీ అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రం మధ్యలో రాజధాని ఉండాలన్నది అర్థరహితమని, చాలా రాష్ట్రాలకు రాజధానులు చివరలోనే ఉన్నాయని అన్నారు. శివరామకృష్ణన్ కమిటీలో నిపుణులు ఉంటే.. చంద్రబాబు రాజధాని కమిటీలో నారాయణ, సుజనా చౌదరి, జయదేవ్ ఉన్నారని, బాబు చెప్పినట్టే నివేదికలు ఇచ్చారని విమర్శించారు.

ఉత్తరాంధ్రకు చంద్రబాబు చేసిందేమీ లేదని చెప్పారు. కేంద్రం 23 సంస్థలు ఇచ్చినా, ఉత్తరాంధ్రకు మూడు కూడా తేలేదని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందలేదన్న ప్రతిపక్షం విమర్శల్లో వాస్తవం లేదన్నారు. రెండేళ్లు కరోనాతోనే సరిపోయిందన్నారు. అయినా ఉత్తరాంధ్ర అభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రతి జిల్లాకూ మెడికల్ కాలేజ్, ఐటీడీఏలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంత సాగునీటి ప్రాజెక్టులపై శ్రద్ధ ఉండబట్టే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒడిశా, ఢిల్లీ వెళ్లి సంప్రదింపులు జరిపారని చెప్పారు. ఉద్దానం నీటి ప్లాంట్‌కు రూ. 700 కోట్లు కేటాయించారని, పలాసలో కిడ్నీ బాధితుల కోసం మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నేరడి వద్ద బ్యారేజీ ఆలస్యం అవుతుండటంతో ప్రత్యామ్నాయంగా రూ.180 కోట్లతో 2.50 లక్షల ఎకరాలకు 19 టీఎంసీల నీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. విజయనగరం జిల్లాలో గురజాడ వర్సిటీ ఏర్పాటుకు చట్టం చేసింది ఈ ప్రభుత్వమేనని తెలిపారు.

తొడలు కొట్టే యాత్రతో ఉత్తరాంధ్రలో చైతన్యం

- మండే సూర్యుడి వద్దకు వెళ్తే కాలిపోతారు.. మీ చంద్రుడి వద్దకే వెళ్లండి: అంబటి
- లేదంటే ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారు
- జనసేన కాలగర్భంలో కలిసే పార్టీ.. జనసైనికులూ మళ్లీ మోసపోవద్దు



సాక్షి, అమరావతి: అమరావతి రైతుల పేరుతో ఒళ్లు బలిసిన వారు చేస్తున్న పాదయాత్రతో ఉత్తరాంధ్ర ప్రజలు చైతన్యవంతులు అవుతున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందకూడదని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ తొడలు కొడుతూ పాదయాత్ర చేస్తున్న వారికి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. 'స్వలాభం కోసం చేస్తున్న ఈ పాదయాత్ర అరసవిల్లి సూర్య దేవాలయం వరకూ చేరుతుందా? భగభగ మండే సూర్యుడి వద్దకు వెళ్లలేరు. పోతే మాడి మసైపోతారు. అందుకే మానుకోండి. మీ చంద్రుడి దగ్గరికి తిరిగి వెళ్లండి' అని వ్యాఖ్యానించారు. పరిపాలన వికేంద్రీకరణ.. మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధే తమ విధానమని, దీన్ని ప్రజలంతా స్వాగతిస్తున్నారని చెప్పారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో అంబటి మీడియాతో మాట్లాడారు.

పోరుబాటలో ఉత్తరాంధ్ర

గతంలో న్యాయస్థానం నుంచి దేవస్థానం అంటూ తిరుపతి వెళ్లారు. ఇప్పుడు అమరావతి నుంచి అరసవిల్లి అంటూ సూర్య దేవాలయానికి యాత్ర మొదలు పెట్టారు. ఎక్కడెక్కడో తిరుగుతూ, రాజకీయాలు మాట్లాడుతూ, సీఎం జగన్‌ను విమర్శిస్తూ యాత్ర చేస్తున్నారు. అమరావతి నుంచి పాదయాత్ర చేస్తున్న వారు ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందకూడదనడాన్ని ఆ ప్రాంత ప్రజలు గుర్తించారు. దీనిపై ఇప్పుడు ఉత్తరాంధ్ర ప్రజలు పోరాటం మొదలు పెట్టారు. అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశాల్లో రాజధానిని నిర్మించడం సాధ్యం కాదు. దేశంలో ఎక్కడైనా రాజధానిని కట్టారా? సృష్టించారా? ఏదైనా నగరంలో రాజధాని పెట్టాలేగానీ.. దానికి 30 కి.మీ. దూరంలో కాదు. ఆస్ట్రేలియా అభివృద్ధి చెందిన దేశం కాబట్టే కాన్‌బెర్రా రాజధానిని నిర్మించింది.

కమీషన్ల కోసమే బాబు ఖర్చు ..

ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టుల పనులపై దుష్టచతుష్టయంలో భాగమైన ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు ప్రచురించిన అసత్య కథనాలపై ఈఎన్‌సీ వాస్తవాలు చెబుతూ వివరణ ఇస్తే దాన్ని కూడా ఆ రెండు పత్రికలు వక్రీకరించాయి. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఒక్క ప్రాజెక్టుకైనా రూపకల్పన చేసి జాతికి అంకితం చేశారా? ఆయన హయాంలో ఎక్కువ ఖర్చు చేసింది కమీషన్ల కోసం కాదా? వైఎస్సార్ 2004లో ప్రాజెక్టులకు రూపకల్పన చేసి కొన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేశారు. మిగతావి పూర్తి చేసే దిశగా సీఎం జగన్ చిత్తశుద్ధితో అడుగులేస్తున్నారు. వంశధార నదీ జలాలపై ఒడిశాతో వివాదాల పరిష్కారానికి చంద్రబాబు ఏనాడైనా ప్రయత్నించారా? చంద్రబాబు అసలు నాయకుడే కాదు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలే ఆయన్ను నాయకుడిగా చిత్రీకరించాయి.

175 సీట్లలో పోటీ చేస్తారా?

జనసేన ప్రస్థానం, పవన్‌కళ్యాణ్ ప్రకటనలు చూస్తుంటే జాలేస్తోంది. ప్రజల తరపున పోరాడి అధికారంలోకి వచ్చి సమస్యలను పరిష్కరించాలనే తపన ఉండాలి గానీ ఎవరి ప్రయోజనాల కోసమో పనిచేయడం సరి కాదు. పవన్‌ను నమ్ముకున్న జనసైనికులు, వీర మహిళలు గతంలో మాదిరిగానే మళ్లీ నష్టపోతారు. బీజేపీతో పొత్తులో ఉన్నామని చెబుతూనే మరో వైపు పవన్ టీడీపీకి కన్నుకొడుతున్నారు. పవన్ కళ్యాణ్‌కు ఒక విధానం లేదు. జనసేన ఒక పార్టీనే కాదు. అది కాలగర్భంలో కలిసిపోయే పార్టీ.

ప్రజాగర్జన నుంచి దృష్టి మళ్లించేందుకే పవన్ యాత్ర

ఆర్ అండ్ బీ శాఖ మంత్రి దాడిశెట్టి



తుని: మూడు రాజధానులకు మద్దతుగా విశాఖలో తలపెట్టిన ప్రజాగర్జన యాత్ర నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే పవన్‌కళ్యాణ్ ఉత్తరాంధ్ర యాత్ర చేస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ధ్వజమెత్తారు. బుధవారం కాకినాడ జిల్లా తునిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు దగ్గర ప్యాకేజీ తీసుకుని జనసేనాని యాత్రకు సిద్ధమవుతున్నారన్నారు. ప్రజాగర్జన యాత్ర ఎవరి కోసమని పవన్ ప్రశ్నించడం విడ్డూరంగా ఉందని, రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. అందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వికేంద్రీకరణకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా 15న ప్రజాగర్జన యాత్రకు ఏర్పాట్లు చేసుకున్నారని, ప్రజల మనోభావాలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ వారికి సంఘీభావంగా నిలుస్తోందన్నారు. చంద్రబాబు, ఆయన బినామీలు 150 మంది కోసం అమరావతిని అభివృద్ధి చేయాలా అని పవన్‌ను ప్రశ్నించారు. రాష్ట్రంలోని 5 కోట్ల ప్రజలు పన్నుల రూపంలో కట్టే సొమ్మును ఒకేచోట ఖర్చు చేస్తే.. మిగిలిన ప్రాంతాలు వెనుకబడిపోతాయన్నారు. తద్వారా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రజలు 200 ఏళ్లపాటు బానిసత్వంలో మగ్గిపోవాలని పవన్ కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు. 2014 నుంచి పవన్‌ను రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని.. 2019లో దేశంలో ఏ పార్టీ అధినేతకు ఇవ్వని విధంగా పవన్‌ను రెండుచోట్లా ఓడించినా ఆయనకు సిగ్గు రాలేదన్నారు. అమరావతికి మద్దతుగా టీడీపీ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి.. తిరిగి ఎన్నికలకు సిద్ధం కావాలని చంద్రబాబుకు సవాల్ చేశారు.

2023కి రాష్ట్రంలో రోడ్లు పూర్తి

వర్షాలు పడుతున్న సమయంలో రాష్ట్రంలోని రోడ్లపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా నానాయాగీ చేస్తున్నాయని రాజా ధ్వజమెత్తారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ రోడ్లను తమ ప్రభుత్వ హయాంలో వేశామన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో వేసిన రోడ్లు ఎన్నో ప్రజలకు తెలుసన్నారు. వర్షాకాలం తగ్గిన వెంటనే రోడ్లు వేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని చెప్పారు. రోడ్ల కోసం రూ.1,500 కోట్లు వెచ్చిస్తామన్నారు. 2023 నాటికి రాష్ట్రంలోని అన్ని రోడ్లను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి అడ్డుపడితే తొక్కేస్తాం

మంత్రి సీదిరి అప్పలరాజు



సాక్షి, అమరావతి: పరిపాలనా రాజధానిగా విశాఖను కోరుకుంటూ ఉత్తరాంధ్రలో గ్రామగ్రామాన ప్రజలు 15న విశాఖ గర్జన కార్యక్రమానికి సిద్ధమవుతున్నారని పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలను దెబ్బతీసేలా ఈనాడు తప్పుడు కథనాలను ప్రచురిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల ప్రజలు మూడు రాజధానులకు, పరిపాలనా వికేంద్రీకరణకు సానుకూలంగా ఉన్నారని చెప్పారు. విశాఖ గర్జన ప్రత్యర్థుల గుండెల్లో గునపంలా దిగుతుందని వ్యాఖ్యానించారు. మా తలలు తెగినా సరే.. విశాఖను రాజధానిగా చేసుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎవరు అడ్డుపడ్డా సహించబోమని, తొక్కుకుంటూ ముందుకు వెళతామని హెచ్చరించారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

- ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధి అంతా హైదరాబాద్‌లో కేంద్రీకృతం కావడంతో మా ప్రాంతం వెనుకబడిపోవడం వాస్తవం కాదా? సీఎం జగన్ తీసుకున్న వికేంద్రీకరణ నిర్ణయంతో ఉత్తరాంధ్రకు స్వేచ్ఛ లభించింది. బలమైన రాజకీయ నిర్ణయంతో మా ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. పాదయాత్ర పేరుతో మాపై దండయాత్ర చేస్తామంటే సహించం.
- ఉద్దానంలో కిడ్నీ బాధితుల కోసం రీసెర్చ్ ఆస్పత్రి కట్టాలని చంద్రబాబు ఏనాడైనా ఆలోచించారా? శుద్ధి చేసిన మంచి నీళ్ల కనీసం ఒక్క చుక్క ఇప్పించగలిగారా? సీఎం జగన్ పుణ్యమా అని కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి పనులు 70 శాతం పూర్తి చేసుకోగలిగాం. రూ.700 కోట్లతో ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు పనులు 70 శాతం జరిగాయి.
- టీడీపీ నేత అచ్చెన్నాయుడు చంద్రబాబుకు బంట్రోతులా వ్యవహరిస్తున్నారు. భావనపాడు పోర్టును మీరు అడ్డుకునేందుకు ప్రయత్నించడం నిజం కాదా? వంశధార ప్రాజెక్టుకు చంద్రబాబు చేసిందేమిటి? ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఒక్క ఇటుక వేశారా? అంగుళం భూమినైనా ప్రాజెక్టు కోసం సేకరించారా? ఉత్తరాంధ్రకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు మా ప్రాంతంలో ఎలా అడుగు పెడతారో చూస్తాం.
- ఈనాడు పత్రిక నాలుగు రోజులుగా ఉత్తరాంధ్రపై విషం చిమ్ముతోంది. దసపల్లా భూములు ప్రైవేట్‌వి అని హైకోర్టు, సుప్రీం కోర్టులే తీర్పులిచ్చాయి. ఇక ప్రభుత్వం ఏం చేయగలుగుతుంది? చంద్రబాబు, రామోజీరావులకు ఆ భూములు కావాలంటే కొనుగోలు చేయవచ్చు.
- ఆగిపోయిన వంశధార ఫేజ్ – 2 పనులను పూర్తి చేసే దశకు తెచ్చాం. నేరడి బ్యారేజ్ కట్టడానికి ముందుగానే హిర మండలం రిజర్వాయర్ నింపేందుకు గొట్టా బ్యారేజ్ దగ్గర లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి జీవో ఇచ్చాం. గత ఎన్నికలకు ముందు గురజాడ యూనివర్సిటీ అంటూ చంద్రబాబు ఉత్తుత్తి జీవో ఇచ్చారు. ఆయన హయాంలో ఉత్తరాంధ్రలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా పెట్టారా?

అమరావతి ఒక్కటే రాజధానైతే మరో ఉద్యమం తప్పదు

- విశాఖలో పుట్టి పెరిగిన 'ఈనాడు' ఈ ప్రాంతంపైనే విషం చిమ్ముతోంది
- విశాఖ గర్జన డైవర్ట్ చేసేందుకే టీడీపీ నీచ రాజకీయం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ఆదాయమంతా ఒకటే రాజధాని అయిన హైదరాబాద్‌పైనే వెచ్చించడంతో దాని కోసమే తెలంగాణ ఉద్యమం వచ్చిందని, భవిష్యత్తులో అలా కాకూడదనే ముందు చూపుతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడు రాజధానులు ఏర్పాటు చేస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. అమరావతి ఒక్కటే రాజధాని అయితే భవిష్యత్తులో తెలంగాణ ఉద్యమం లాంటి మరో ఉద్యమం తప్పదని, అమరావతితో మీకు సంబంధం లేదంటే ఉత్తరాంధ్ర ప్రజలను ఏ బంగాళాఖాతంలో దూకమంటారని మండిపడ్డారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. పచ్చ మీడియాకి విశాఖ ఇప్పుడు గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు. 'ఈనాడు' విశాఖలో పుట్టి, ఇక్కడే పెరిగిందని, ఇప్పుడు రామోజీరావు ఈ ప్రాంతంపైనే విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. విశాఖ గర్జనను డైవర్ట్ చేయడానికే టీడీపీ ఈనెల 15న సమావేశాలు, దత్తపుత్రుడితో మీటింగ్‌లు పెడుతోందని అన్నారు. ఇక్కడి ప్రజల మనోభావాలతో ఆటలాడొద్దని, పచ్చపత్రికలు, ఛానళ్లు ఈ ప్రాంత ప్రజలను అవహేళన చేయొద్దని వేడుకుంటున్నామన్నారు.

బావ, బామ్మర్దుల కొత్త సినిమా

నిన్న రిలీజ్ అయిన మీ బావ, బావమరదుల కొత్త సినిమా బావుందని వ్యాఖ్యానించారు. ఈ సినిమాలో ఒకరు అబద్ధాలు చెబితే... మరొకరు వాటికి ప్రసంశలు కురిపిస్తున్నారని, వారిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. 'చంద్రబాబు ఎవరూ చూడని సమయంలో ఎన్టీఆర్ కాళ్లు పట్టుకుని బతిమిలాడాడంట. ఒప్పుకోలేదని కాళ్లు లాగేశాడట. ఇది ఆయన జీవితంలో బిగ్గెస్ట్ డెసిషన్ అని చంద్రబాబు ఈ షోలో అంటాడు. బావ డైరెక్షన్.. బావమరిది యాంకరింగ్. మళ్లీ దీనికి టెలీకాన్ఫరెన్స్‌లో వక్తలు చంద్రబాబుని పొగడడం' అని మంత్రి వ్యాఖ్యానించారు.

అమరావతి యాత్రతోనే ఉత్తరాంధ్ర ఉద్యమం తీవ్రం

టీడీపీ మద్దతుదారుల అమరావతి యాత్ర కారణంగానే ఉత్తరాంధ్రలో ఉద్యమం తీవ్రస్థాయికి వచ్చిందని చెప్పారు. విశాఖ గర్జనతో ఉత్తరాంధ్ర ఉద్యమం మరింత ఉధృతమవుతుందని తెలిపారు. చంద్రబాబు ఉత్తరాంధ్రకు చేసింది శూన్యమని, ఉత్తి ఆంధ్రగా మార్చేశారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి పార్లమెంట్ పరిధిలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతమైన పాడేరులో మెడికల్ కళాశాల మంజూరు చేసిన ఘనత సీఎం వై.ఎస్ జగన్‌దని చెప్పారు.



ఆలోచనలు ఎప్పుడు ఉన్నాయో అది పరధ్యానం.
ఆలోచనలు ఎప్పుడు లేవో అది ధ్యానం.
- రమణ మహర్షి

ఉత్తి.. రాతల ప్రేమ

పథకం ప్రకారం 'ఈనాడు' ప్రభుత్వ వ్యతిరేక కథనాలు.. గడిచిన ఆరు రోజుల్లో 5 రోజులు ఉత్తరాంధ్ర ప్రస్తావనే

ఎంత ప్రేమ.. ఎంత ప్రేమ!!. రామోజీరావుకు ఉత్తరాంధ్ర అంటే మరీ ఇంత ప్రేమా!. గడిచిన ఆరు రోజుల్లో ఐదు రోజులు ఉత్తరాంధ్ర వ్యవహారాలే 'ఈనాడు' బ్యానర్‌గా మారాయి మరి!. ప్రభుత్వం ఉత్తరాంధ్రను పట్టించుకోవటం లేదంటూ పేజీలకు పేజీలు పచ్చి అబద్ధాలు!!. ఇదంతా ఎందుకు రామోజీరావు గారూ? విశాఖ వాసుల్లో వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకత నింపి మీ చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ వచ్చేసరికి రంగం సిద్ధం చేయటానికా? వైఎస్సార్ సీపీ తలపెట్టిన బహిరంగ సభ విజయవంతం కాకూడదనే నిష్ఫల ప్రయత్నమా? లేక రాజధాని కోసం ఉద్యమిస్తున్న ఉత్తరాంధ్ర వాసుల దృష్టిని మళ్లించడానికా? ఎందుకిదంతా?



మాకు తప్ప మీకెవ్వరికీ రాజధానిని అడిగే అర్హత లేదంటూ ఉత్తరాంధ్రపై దండయాత్రకు వస్తున్న చంద్రన్న మురాల కోసమేగా ఈ రాతలు? ఎవడ్రా మమ్మల్ని అడ్డుకునేదని తొడలు కొట్టుకుంటూ వస్తున్న నారీ మణుల కోసమేగా ఈ అబద్ధాలు? మరీ ఇంత దిగజారుడు తనమా? ఒక ప్రాంతం అభివృద్ధి చెందకూడదని మరీ ఇంత కక్ష చూపించాలా? వారం రోజులుగా మీరు గుప్పిస్తున్న వార్తారాజాల్లో వక్రీకరణ ఏ స్థాయిలో ఉందో తెలియనిదెవరికని?

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Water Resources Department – "BRR Vamsadhara Project Phase II of Stage II – Hiramandalam Lift Scheme – Detailed Investigation, Designs and Construction of lift Irrigation Scheme for Drawl and Lifting of water from Gotta Barrage Right Main Canal @ KM 2.400 near Kovada (Village), Hiramandalam (Mandal) of Srikakulam District and dropping into Hiramandalam Reservoir for providing Irrigation facilities, drinking water facilities to [illegible] Project and to achieve early benefits" for Rs. 176,35,00,000/- (Rupees One Seventy Six Crores Thirty Five Lakhs only) Administrative Approval – Accorded – Orders

వంశధార ప్రాజెక్టు రెండో దశలో భాగంగా హిరమండలం లిఫ్ట్ స్కీమ్ నిర్మాణం కోసం రూ. 176 కోట్లతో మంజూరు చేసిన పాలనా అనుమతులు

Water Resources Department - Revised Administrative Approval for the work of 'Excavation of Flood Flow Canal taking off from River Mahendratanaya near Chapara (V), of Meliaputti (M) and formation of Off-shore Reservoir near Rayalapadu (V) and formation of canals from Reservoir including distributary network for Rs. 852,44,96,000/- (Rupees Eight Hundred Fifty Two Crores, Forty Four Lakhs and Ninety Six Thousand only) - Administrative Approval - Accorded Orders Issued

మహేంద్రతనయ నది నుంచి రూ. 852 కోట్లతో తవ్వే వరద కాలువ పనులకు పాలనా అనుమతులు..

Water Resources Department - BRR Vamsadhara Project Phase-II of Stage-II, Srikakulam - Sanction of Rs 216.71 Crores towards ex gratia to the land losers, PDFs who have lost their land, houses, livelihood for the BRR Vamsadhara Project - Orders - Issued.
WATER RESOURCES(BRR -A2) DEPARTMENT

వంశధార ప్రాజెక్టు భూ నిర్వాసితులకు పరిహారం కోసం రూ.216 కోట్లు మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు

ఇదే... ఉత్తరాంధ్రపై ప్రేమ

ఉత్తరాంధ్రపై చంద్రబాబు నాయుడు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ చూపిస్తున్న ప్రేమకు మురిసిపోతున్నదెవరైనా ఉంటే... అందులో 'ఈనాడు' పత్రిక, దాని అధిపతి రామోజీరావుదే ఫస్ట్ మార్క్. ఎందుకంటే పవన్‌కల్యాణ్ పదేపదే శ్రీకాకుళం జిల్లా ఉద్దానానికి వెళుతూ... అవసరాన్ని మించి ఆవేశపడుతూ ఉండేవారు. కానీ చంద్రబాబు ఏలిన ఐదేళ్లు ఆవేశాన్ని ఆపేసుకున్నారు. రామోజీరావు కూడా తాత్కాలికంగా ఉద్ధానాన్ని, అక్కడి కిడ్నీ బాధితులను మరిచిపోయారు. మళ్లీ ఇప్పుడు మాత్రం... ఉత్తరాంధ్రకు ప్రస్తుత ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆవేశపడి డైలాగ్‌లు చెప్పేందుకు పవన్ సిద్ధం కాగా... పవన్ చెప్పేది నమ్మండని చెప్పటానికి రామోజీ రాతలు మొదలెట్టారు. ఐదేళ్లు కిడ్నీ బాధితుల్ని చంద్రబాబు మరిచిపోవటం అబద్ధమా రామోజీరావు గారూ? కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్నా మంచినీటి సమస్యను పట్టించుకున్నారా? పాదయాత్రలో బాధితులకిచ్చిన హామీ మేరకు... వై.ఎస్.జగన్ అధికారంలోకి వచ్చాకపలాసలో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కిడ్నీ వ్యాధుల రీసెర్చ్ సెంటర్, 65 మంది రోగులకు ఏకకాలంలో ఉపయోగపడేలా అతిపెద్ద డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేయటం మీకు కనిపించదా? వాటి పనులు సైతం వేగంగా జరుగుతున్నాయి కదా? కొద్ది రోజుల్లో ఇది పూర్తయి వారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తున్న విషయాన్ని మీ పత్రిక చెప్పదెందుకు? ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులకు ప్రధాన కారణం తాగునీరేనని అన్ని కమిటీలూ చెబుతున్న నేపథ్యంలో పలాస, ఇచ్ఛాపురం పరిధిలోని 7 మండలాల్లోని 807 గ్రామాలకు రక్షిత మంచినీరు అందించడానికి రూ.700 కోట్లతో నిర్మాణాలు చేపడుతున్నది ఈ ప్రభుత్వమే







శ్రీకాకుళం జిల్లాలో ఉద్ధానం ప్రజల కోసం రూ.700 కోట్లతో నిర్మిస్తున్న భారీ మంచినీటి ప్రాజెక్టు



శ్రీకాకుళం జిల్లా పలాసలో నిర్మాణంలో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కిడ్నీ వ్యాధుల రీసెర్చ్ సెంటర్

గా? ఆసుపత్రి, డయాలసిస్ సెంటర్లకు మరో రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నది వాస్తవం కాదా? నిజాలు పక్కనబెట్టి అబద్ధాలతో ఎన్నాళ్లిలా చెలరేగిపోతారు? ఉత్తరాంధ్ర జిల్లాల సంఖ్యను 3 నుంచి 6కు పెంచటమే కాక జిల్లాకో మెడికల్ కాలేజీని తీసుకువస్తున్నది ఈ ప్రభుత్వమేనని జనానికి తెలియదనుకుంటున్నారా?

ప్రాజెక్టుల ఘనత చంద్రబాబుదా?

అసలు చంద్రబాబు ముఖ్యమంత్రయిందెప్పుడు రామోజీ? 1995లో ముఖ్యమంత్రి అయిన వ్యక్తి... పద్నాలుగేళ్లు సీఎం అని డప్పు కొట్టే మీరు... ఆయన హయాంలో ఒక్క ప్రాజెక్టయినా పూర్తయిందని చెప్పగలరా? ఇది తాను తెచ్చిన ప్రాజెక్టని ఒక్కటైనా చంద్రబాబు చెప్పుకునే పరిస్థితి ఉందా? పైపెచ్చు సీఎం అయిన 27 ఏళ్ల తరవాత ఆ ప్రాజెక్టులు, ఈ ప్రాజెక్టులు పూర్తి చేయలేదని కుప్పం నుంచి ఇచ్చాపురం వరకూ వేరొకరిపై నిందలేయటం కన్నా దౌర్భాగ్యం వేరొకటి ఉంటుందా?

ఇవిగో... ప్రాజెక్టుల వాస్తవాలు

- వంశధార ప్రాజెక్టును మొదలుపెట్టింది దివంగత నేత వైఎస్సార్. అరవై శాతం పూర్తి చేశారు కూడా. టీడీపీ ఐదేళ్లలో మిగిలిన 40 శాతం పూర్తి చేయలేకపోయింది. వచ్చే 4–6 నెలల్లో ఈ ప్రభుత్వం వాటిని పూర్తి చేయబోతోంది.
- వంశధార–నాగావళి అనుసంధాన పనులు ఐదేళ్లలో కనీసం 30 శాతం కూడా టీడీపీ చేయని మాట అబద్ధమేమీ కాదు. ఈ ప్రభుత్వం వచ్చే 4–6 నెలల్లో పూర్తి చేయనున్నదనేదీ నిజమే.
- మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ వైయస్సార్ మొదలుపెడితే టీడీపీ ప్రభుత్వం కనీసం 40 శాతం కూడా చేయకుండా గాలికి వదిలేసింది. ఇపుడు రూ. 840 కోట్లతో రివైజ్డ్ శాంక్షన్ చేసి టెండర్లకు వెళుతోంది ఈ ప్రభుత్వం.
- తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పనులు టీడీపీ ప్రభుత్వం చేయకపోతే కోర్టుకెళ్లారు. అది కూడా ఈ ప్రభుత్వానికే అంటగట్టబోయారు రామోజీరావు. కోర్టు సమస్యను పరిష్కరించింది ఈ ప్రభుత్వమే. రివైజ్డ్ శాంక్షన్ ఇచ్చి ముందుకెళ్తున్నదీ ఈ ప్రభుత్వమే.
- గజపతినగరం బ్రాంచ్ కెనాల్ కూడా టీడీపీ ప్రభుత్వం వదిలేస్తే ఈప్రభుత్వం రివైజ్డ్ శాంక్షన్ ఇచ్చి ముందుకెళ్తోంది.
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని మంజూరు చేసింది వైయస్సార్. ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయనిది టీడీపీ. రూ.1700 కోట్లతో ప్రాజెక్టు శాంక్షన్ చేసి భూ సేకరణ వేగంగా చేస్తున్నది ఈ ప్రభుత్వమే. డిజైన్లు కూడా పూర్తవుతున్నాయి.
- తోటపల్లి ప్రాజెక్టు కాంగ్రెస్ హయాంలోనే 95 శాతం పూర్తయితే అది బాబు ఘనతగా చెబుతోంది 'ఈనాడు'. మిగిలిన పనులు రెండు ప్యాకేజీలుగా చేసి పనులు చేపట్టింది ఈ ప్రభుత్వమే.







ఆమదాలవలస మండలం దన్నానపేట గ్రామ సమీపంలో వ్యవసాయ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల.. తొగరాంలో ఉన్న వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాల.. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం పెద్దపేటలో ఉద్యాన పరిశోధన కేంద్రం

విభజన హక్కులూ బాబు గొప్పలేనా?

- విభజన చట్టంలో రాష్ట్రానికి పలు హామీలిచ్చిన కేంద్రం
- వాటి ప్రకారం పలు ప్రాంతాల్లో కేంద్ర విద్యా సంస్థలు
- వాటిని కూడా బాబు ఘనతగా ప్రచారం చేస్తున్న 'ఈనాడు'
- ఆంధ్రా వర్సిటీ నిధులు ఎస్ఎఫ్‌సీ దగ్గర డిపాజిట్ చేస్తే తప్పా?
- దానిపై బ్యాంకు వడ్డీకన్నా మెరుగైన వడ్డీ వస్తున్నా నిందలు
- వర్సిటీల కోసం జీవోలిచ్చి చేతులు దులుపుకున్న బాబు
- ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళానికి రూపాయి కూడా ఖర్చు చేయని తీరు
- దాని ఇన్‌ఫ్రా కోసం రూ.120 కోట్లు ఖర్చు చేసిన ప్రస్తుత ప్రభుత్వం
- పసుపు కుంకుమ అంటూ ఎన్నికల ముందు బాబు నిధుల మళ్లింపు
- ట్రిపుల్ ఐటీ నుంచి 180 కోట్లు, ఆంధ్రా వర్సిటీ నుంచి రూ.130 కోట్లు
- మహిళల చేత ఓట్లేయించుకుని పప్పుబెల్లాల్లా పంచేసిన చంద్రబాబు
- జనభేరి అంటూ సభకోసం ఆంధ్రా వర్సిటీ నుంచి రూ.10 కోట్ల ఖర్చు
- వీటికి విద్యతో సంబంధమే లేకున్నా... బాబే గొప్ప అంటున్న రామోజీ

విచిత్రమేంటంటే చేతిలో పేపరుంటే ఎలాంటి అబద్ధాలైనా అలవోకగా చెప్పేయొచ్చన్నది నాలుగు దశాబ్దాలుగా 'ఈనాడు' అనుసరిస్తున్న పాలసీ. ఎందుకంటే విశాఖపట్నంలో ఐఐఎం, ఐఐపీఈ విద్యాసంస్థల్ని ఈ ప్రాంతంపై ప్రేమతోనే చంద్రబాబు ఏర్పాటు చేసినట్లు రామోజీ డప్పు కొట్టారు. నిజానికి రాష్ట్రం విడిపోయినప్పుడు చేసిన విభజన హక్కుల చట్టం ప్రకారం కేంద్రం పలు విద్యా సంస్థల్ని రాష్ట్రంలో ఏర్పాటు చెయ్యాల్సి ఉంది. దాని ప్రకారమే తిరుపతిలో ఐఐటీ, ఐఐఎస్ఈఆర్, మంగళగిరిలో ఎయిమ్స్, కర్నూల్లో ఐఐటీడీఎం, అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ, విశాఖ పట్నంలో ఐఐఎం, ఐఐపీఈ సంస్థల్ని కేంద్రం ఏర్పాటు చేస్తోంది. ఘనత వహించిన 'ఈనాడు'... దీన్ని కూడా బాబు డప్పుల్లో కలిపేసింది. ఇక సమీర్ అనేది పరిశోధనల కోసం కేంద్రం విశాఖలో ఏర్పాటు చేసుకున్న సంస్థ.

ఇందులో బాబు గొప్పేముంది?

గిరిజన యూనివర్సిటీ విషయంలో చంద్రబాబు చాలా గొప్పపనిచేస్తే... ఈ ప్రభుత్వం దాని స్థలాన్ని మార్చి తప్పుచేసినట్లుగా రాసిపడేశారు రామోజీ. ఏ కొంచెమూ సిగ్గనేది ఉండదు కాబట్టి ఇలా రాయటంలో విచిత్రమేమీ కనిపించదు. ఎందుకంటే గిరిజన యూనివర్సిటీని గిరిజనేతర ప్రాంతంలో ఏర్పాటు చేయటమన్నదే చంద్రబాబు చేసిన తొలి తప్పు. ఆ తప్పుని సరిచేసి దాన్ని గిరిజనులకు అందుబాటులో ఉండేలా వారి ప్రాంతంలో ఏర్పాటు చేయటమే ఘోరమైనట్లుగా రామోజీ చేసే రాద్ధాంతం చూస్తే ఔరా... అనిపించకమానదు. చంద్రన్న తప్పును కూడా మెళ్లో వేసుకుని ప్రచారం చేసుకోగలిగే అపారమైన ప్రచారపటిమ 'ఈనాడు' సొంతమని తెలిసినా... ఇలాంటివి చూసినపుడు ఇంకాస్త ఆశ్చర్యమేస్తుంది. ఇక గతంలో గిరిజన వర్సిటీని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్ కేంద్రం పాతది... పైపెచ్చు అద్దె భవనం. అందుకే ఈ ప్రభుత్వం దాన్ని విజయనగరంలోని ఆంధ్రా యూనివర్సిటీ పీజీ క్యాంపస్‌లోకి మార్చింది. దీన్ని కొనసాగిస్తూనే... కొత్త వర్సిటీ పనులు పూర్తి స్థాయిలో చేపట్టింది. ఇదీ... ప్రభుత్వానికొ గిరిజనంపై ఉన్న చిత్తశుద్ధి!!.

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Higher Education – Universities – Establishment of new State University in the name of Gurajada Apparao University at Vizainagaram in Vizainagaram District – Amendment to Schedule to the Andhra Pradesh Universities Act, 1991 – Notification – Orders – Issued.
HIGHER EDUCATION (UE.II) DEPARTMENT

G.O.MS.No. 12 — Dated: 13-02-2019. Read the following:-

2019 ఎన్నికల ముందు విజయనగరంలో గురజాడ అప్పారావు యూనివర్సిటీ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో

గిరిజనులకూ టెక్నాలజీ విద్య

పరిస్థితులు మారాయి కనక మామూలు యూనివర్సిటీ బదులు సాంకేతిక విశ్వవిద్యాలయమైతేనే బాగుంటుందన్నది ప్రభుత్వ ఉద్దేశం. అందుకే గిరిజనం సాంకేతిక విద్యనభ్యసించడానికి వీలుగా కురుపాంలో ట్రైబల్ ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేశారు. 50 శాతం సీట్లను పూర్తిగా గిరిజనులకే కేటాయించారు కూడా. 'ఈనాడు' చెప్పిన అబద్ధాల్లో మరొకటి... శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీని చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని పట్టించుకోవటం లేదని!!. ఇదెంత అందమైన అబద్ధమంటే... చంద్రబాబు ఆరంభించిన మాట నిజమే. కానీ... రూపాయి కూడా ఖర్చు చెయ్యకుండా... కాగితంపై ఆరంభించేశారు. అంటే 'పేపర్ క్యాంపస్' అన్న మాట. దీంతో విద్యార్థులు ట్రిపుల్ ఐటీ నూజివీడు, ఇడుపుల పాయ క్యాంపస్‌లలో పాఠాలు వినాల్సి వస్తోంది. కానీ వై.ఎస్.జగన్ దీన్నిలా వదిలేయలేదు. రూ.120 కోట్లకు పైగా మౌలిక సదుపాయాలపై వెచ్చించి క్యాంపస్ తయారు చేశారు. దీంతో శ్రీకాకుళం క్యాంపస్‌లో పాఠాలు మొదలయ్యాయి. 2024 నాటికి అన్ని సౌకర్యాలతో పూర్తిస్థాయి క్యాంపస్ సిద్ధం కాబోతోంది. కాకపోతే ఇలాంటి వాస్తవాలేవీ 'ఈనాడు' చెప్పదు. 2019 వరకూ ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళానికి ఒక్క లెక్చరర్ పోస్టునూ మంజూరు చేయని విషయాన్ని గానీ... 210 టీచింగ్, 89 నాన్–టీచింగ్ పోస్టులను మంజూరు చేసింది ఈ ప్రభుత్వమేనని గానీ రాయనే రాయరు!. మునుపటి ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానం వల్లే ఆంధ్రా యూనివర్సిటీలో బోధన సిబ్బందిని నియమించలేక పోయారని, అందుకే భర్తీ ప్రక్రియకు వ్యతిరేకంగా ఎన్నో కేసులు పడ్డాయని, ఇప్పటికీ హైకోర్టులో వ్యవహారం పెండింగ్‌లోనే ఉందని రామోజీ చెప్పరు. వాటి భర్తీకి ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది కనకే కోర్టు అనుమతి వచ్చిన వెంటనే వివిధ వర్సిటీల్లో మొత్తం 2000 పోస్టులు భర్తీ చేస్తామని స్పష్టం చేసిందనే వాస్తవాన్ని కూడా రాయరు. ఇక సీమెన్స్ అనేది భారీ స్కాం. దాన్లో నిందితులను అరెస్టు కూడా చేశారు. దాన్ని కూడా ఆంధ్రా యూనివర్సిటీలో సీమెన్స్ సెంటర్ ఏర్పాటయిందంటూ రాస్తున్నారంటే మిమ్మల్ని ఏమనాలి రామోజీ?

జీవోలిస్తే వర్సిటీలొస్తాయా?: యూనివర్సిటీ ఏర్పాటు చేయాలంటే ఒక జీవోతో కుదరదు. చట్టం చేయాలి. కానీ 2019 ఫిబ్రవరి 13న... అంటే ఎన్నికలకు కొద్ది రోజుల ముందు విజయనగరంలో 'గురజాడ అప్పారావు వర్సిటీ'ని ఏర్పాటు చేస్తున్నట్లు జీవో ఇచ్చేశారు చంద్రబాబు. ఇక 2018 నవంబర్లో ఒంగోలులో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం యూనివర్సిటీ విషయంలోనూ ఇలాగే జీవో ఇచ్చారు. ఇలాంటి జీవోల వల్ల రాజకీయ ప్రయోజనాలు నెరవేరుతాయేమో కానీ.. యూనివర్సిటీలు వస్తాయా? తెలిసి కూడా ఇలా చేసిన చంద్రబాబును ఏనాడూ నిలదీయరెందుకు రామోజీ? వీటిపై చట్టాలు చేసి గురజాడ సాంకేతిక వర్సిటీని విజయనగరంలోను, ఆంధ్రకేసరి వర్సిటీని ఒంగోలులోను ఏర్పాటు చేసింది ఈ ప్రభుత్వమేనన్న నిజాన్ని చెప్పరెందుకు? అన్ని ప్రక్రియలనూ అనుసరిస్తూ వర్సిటీలను ఏర్పాటు చేయటంలో ప్రభుత్వ చిత్తశుద్ధి మీకు కనిపించటం లేదా? 2020 జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఈపీ) అమలు చేయడంలో రాష్ట్రం ముందున్నదంటూ.. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ద్వారా ప్రభుత్వం తీసుకున్న చర్యలకు యూజీసీ, ఏఐసీటీఈ, నీతీ ఆయోగ్, ఇతర ప్రభుత్వ/ప్రయివేటు సంస్థలు ప్రశంసిస్తుండటం మీకెప్పుడూ కనిపించదా? మీ పాఠకులకు చెప్పాలనిపించదా?

వర్సిటీల నిధులు దోచుకున్నదెవరు రామోజీ?

ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడి ప్రభుత్వం అత్యంత హేయంగా వ్యవహరించిన తీరు మీకెందుకు నేరమనిపించలేదు? ఇతర నిధులతో పాటు ట్రిపుల్ ఐటీ నిధుల నుంచి రూ.180 కోట్లు, ఆంధ్రా యూనివర్సిటీ నుంచి రూ.130 కోట్లు 'పసుపు కుంకుమ' కోసం వాడేసింది. అసలు ఎవరి పసుపు కుంకుమలివి? ఏం పథకమిది? దీనికీ, విద్యకూ సంబంధమేమైనా ఉందా? సిగ్గు లేదూ? ఆలయాల ముందు పందిళ్లు వేసి... మహిళల చేతిలో 'పసుపు కుంకుమ' అంటూ డబ్బులు పెట్టి... వారి చేత ఓటు చంద్రబాబుకే అని ఒట్టేయించుకున్న మీరు... ఇంకా నీతులు చెప్పేటంత స్థాయిలోనే ఉన్నామనుకుంటున్నారా? అన్ని దారుణాలు చేసినా అంతకన్నా దారుణంగా ఓడిపోయారంటే మీ ముఠాపై ప్రజలకెంత విశ్వసనీయత ఉందో తెలియటం లేదా?

డిపాజిట్‌కు... జనభేరికి తేడా లేదా?

వాస్తవమే! స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ దగ్గర ఆంధ్రా యూనివర్సిటీ రూ.10 కోట్లు డిపాజిట్ చేయటం నిజమే. కానీ దానిపై వర్సిటీకి 6.2 శాతం వడ్డీ వస్తోంది. ఇది బ్యాంకు వడ్డీకన్నా ఎక్కువే. ఇక ప్రభుత్వమైతే యూనివర్సిటీ నుంచి పైసా కూడా తీసుకోలేదు. సరికదా... బడ్జెట్ నుంచే కేటాయింపులు చేస్తోంది. సంస్కరణలు తెచ్చి రాష్ట్ర వర్సిటీలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకెళుతోంది. కానీ చంద్రబాబు ఉన్నత విద్యకు ఏమాత్రం సంబంధం లేని 'జనభేరి' కార్యక్రమం కోసం ఏకంగా యూనివర్సిటీ నుంచి రూ.10 కోట్లు వాడేశారు. ఇలాంటి వార్తలను దాచిపెట్టడమే మీ పత్రికకు శ్రీరామ రక్ష!!.



హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ 2012 మొదట్లో సుప్రీం కోర్టు వెలువరించిన ఉత్తర్వులివి. | సుప్రీంకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను అదే సంవత్సరంలో కొట్టివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు. | రివ్యూ పిటిషన్‌ను కొట్టివేయటాన్ని సవాలు చేస్తూ దాఖలైన క్యూరేటివ్ పిటిషన్‌ను కూడా 2014లో సుప్రీం కోర్టు కొట్టివేసిన ఉత్తర్వులివి. | రివ్యూ, క్యూరేటివ్ పిటిషన్లను సైతం సుప్రీంకోర్టు కొట్టివేసిన తరవాత... ఇక హైకోర్టు తీర్పును అమలు చేయటం తప్ప ప్రభుత్వం చేయగలిగిందేమీ లేదని అప్పటి అడ్వకేట్ జనరల్ పి. వేణుగోపాల్ నాటి రాష్ట్ర ప్రభుత్వానికి 2015లో ఇచ్చిన అభిప్రాయమిది.

దసపల్లా... టీడీపీదే రసగుల్లా?

- భూములపై వివాదం ఉండగానే టీడీపీకి కేటాయింపు
- శాశ్వత నిర్మాణాలు వద్దని కలెక్టర్ చెప్పినా బేఖాతరు
- భూమి ప్రయివేటు వ్యక్తులదే అని తీర్పు వచ్చాక టీడీపీకి 2000 గజాలు కేటాయింపు; అందులో శాశ్వత భవనం
- ఇప్పుడు అది పోతుందేమోనని టీడీపీ గుబులు; ఎదురు దాడి
- భూ యజమానుల్లో రామోజీ కుమారుడి వియ్యంకుడు
- డెవలపర్లతో అగ్రిమెంట్‌పై సంతకం కూడా...
- అందులో అన్యాయం ఉంటే ఎందుకు సంతకం చేసినట్లు?
- ఇలాంటి వాస్తవాలు ప్రస్తావించకుండా రామోజీ రాతలు

సిగ్గూఎగ్గూ లేని రాతలు కాకపోతే... అక్కడి భూముల వ్యవహారం కోర్టులో ఉండగానే తాను ముఖ్యమంత్రిగా ఉంటూ... తన పార్టీకే కేటాయించేసుకుని అన్ని తీర్పులనూ బేఖాతరు చేసి పార్టీ కార్యాలయాన్ని నిర్మించేసుకున్న తెలుగుదేశం... దాని అధిపతి చంద్రబాబు నాయుడు మీ దృష్టిలో అత్యుత్తములు!!. ఆ భూములపై వివాదం ఉందని, కోర్టులో వివాదం తేలేదాకా ఎవ్వరూ శాశ్వత నిర్మాణాలు చేపట్టవద్దని గతంలో అప్పటి కలెక్టరు చెప్పటం అబద్ధమా? కలెక్టరు ఈ రకమైన ఉత్తర్వులు ఇచ్చాక... అవన్నీ ప్రయివేటు వ్యక్తులకే చెందుతాయని దిగువ కోర్టు స్పష్టంగా తీర్పు చెప్పటం నిజం కాదా? అలా తీర్పునిచ్చాక తెలుగుదేశం పార్టీ అందులో దాదాపు అర ఎకరం భూమిని తనకు తనే కేటాయించేసుకుని పార్టీ ఆఫీసు పేరిట శాశ్వత నిర్మాణం కట్టేయటం ఎలాంటి న్యాయం రామోజీరావుగారూ? తెలుగుదేశం పార్టీకి భూమిని అప్పగించమంటూ 2001లో నాటి కలెక్టరుకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినప్పటికి 'సాక్షి' లేకపోవచ్చు. కానీ ఒక పత్రికగా ఈ దారుణాన్ని మీరు ప్రశ్నించలేదెందుకు? మీ చంద్రబాబు కాబట్టి ఏం చేసినా చెల్లిపోతుందనేగా?

ఇప్పుడు ప్రభుత్వం ఎలాంటి తప్పూ చేయకున్నా సరే... ప్రజల్లో వ్యతిరేకత పెంచడానికి ప్రభుత్వంపై బురద జల్లేలా కథనాలు రాయగలుగుతున్నారంటే మిమ్మల్ని ఏమనుకోవాలి? ఇక్కడ ప్రజలందరికీ తెలియాల్సిందేమిటంటే... గత్యంతరం లేని పరిస్థితుల్లోనే ప్రభుత్వం అక్కడి భూ యజమానులకు అనుకూలంగా వ్యవహరించాల్సి వస్తోందని. ఎందుకంటే హైకోర్టుతో సహా దిగువ కోర్టులన్నీ ఆ భూములు ప్రయివేటు వ్యక్తులవేనని తీర్పునిచ్చాయి. మునుపటి ప్రభుత్వాలు దీనిపై చివరికి సుప్రీంకోర్టులో అప్పీలు చేశాయి. సుప్రీం కోర్టు కూడా ఆ అప్పీలును కొట్టేసింది. దాన్ని వ్యతిరేకిస్తూ అదే కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలైంది. దాన్ని కూడా కొట్టేయటంతో చిట్ట చివరి అస్త్రంగా ప్రభుత్వం 'క్యూరేటివ్' పిటిషన్‌ను దాఖలు చేసింది. దాన్ని కూడా సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఇలాంటి పరిస్థితుల్లో ఏ ప్రభుత్వమైనా ఏం చేస్తుంది? విధిలేని పరిస్థితుల్లో నాటి చంద్రబాబు ప్రభుత్వం అడ్వకేట్ జనరల్ అభిప్రాయాన్ని కూడా అడిగింది. సుప్రీంకోర్టు క్యూరేటివ్ పిటిషన్‌ను కూడా కొట్టేసిన తరవాత ఆ తీర్పు ప్రకారం నడవటం తప్ప ప్రభుత్వం చేయగలిగిందేమీ లేదని ఏజీ వేణుగోపాల్ కూడా లిఖితపూర్వకంగా చెప్పారు.



2001లో టీడీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖ జిల్లా కలెక్టర్ దసపల్లా భూముల్లో టీడీపీ కార్యాలయ ఏర్పాటుకు అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు

ఈ ప్రభుత్వం వచ్చాక కూడా ఇప్పటిదాకా తీర్పును అమలు చేయలేదు. అలా చేయనందుకు కోర్టు ధిక్కార పిటిషన్లు వేశారు. చివరికి ఇద్దరు అధికారులకు జైలు శిక్ష కూడా పడింది. ఇంకా ఏం చేయాలి? మరింత మంది అధికారులకు కోర్టు ధిక్కార శిక్షలు పడితే మీరు ప్రభుత్వాన్ని విమర్శిస్తూ పండగ చేసుకుంటారా? అధికారులను కాపాడటం లేదని ప్రభుత్వంపై విమర్శలు చేస్తారా? ఎందుకీ దిగజారుడు తనం.

భూ యజమానుల్లో మీ వియ్యంకుడూ ఉన్నారుగా?

అత్యున్నత స్థాయి వరకూ కోర్టు తీర్పులు అనుకూలంగా ఉన్నాయి కనకే భూ యజమానులు డెవలపర్లతో ఒప్పందం చేసుకున్నారు. ఎవరికెంత శాతమన్నది ఆ ఇరుపక్షాల ఇష్టం తప్ప మీ ఇష్టానిష్టాలెవరికీ అవసరం లేదక్కడ. అయినా డెవలపర్లతో ఒప్పందం చేసుకున్న భూ యజమానుల్లో మీ కుమారుడి వియ్యంకుడు కూడా ఉన్నారుగా? ఒకవేళ వాళ్లకు తక్కువ వాటా వచ్చిందని వాళ్లు కూడా మీలా ఆలోచిస్తే మీ వియ్యంకుడెందుకు ఒప్పందం చేసుకున్నట్టు? వాళ్లందరికీ నచ్చుబట్టేగా!!. ఇవన్నీ వదిలేసి ప్రతిరోజూ దసపల్లా అంటూ మీరు చేతికొచ్చినట్లు రాయటం... ఆ పనికి మాలిన అబద్ధాలు పట్టుకుని మిగిలిన ఎల్లో తోకలు రెచ్చిపోవటం!!. వీటినే మళ్లీ చంద్రబాబు వల్లెవేయటం!!. 1983 నుంచీ అమలు చేస్తున్న మీ స్కీమ్ ఇంకా జనానికి అర్థం కాలేదనే అనుకుంటున్నారా?



విశాఖ దసపల్లా భూముల్లో టీడీపీ కార్యాలయం

ప్రశాంతంగా హార్టీసెట్ పరీక్ష


ఉద్యాన వర్సిటీలో హార్టీసెట్ ప్రవేశ పరీక్షను పరిశీలిస్తున్న వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం: ఉద్యాన పాలిటెక్నిక్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు బీఎస్సీ (హార్టీకల్చర్)కోర్సులో ప్రవేశాల కోసం హార్టీసెట్ పరీక్ష పశ్చిమ గోదావరిజిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలో బుధవారం ప్రశాంతంగా జరిగింది. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని 11 ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉత్తీర్ణులైన 380 మంది ఉద్యాన వర్సిటీలోని ఎనిమిది ఉద్యాన కళాశాలల్లో బీఎస్సీ (హార్టీకల్చర్) ప్రవేశాలకు ఈ పరీక్ష రాశారు. హార్టీసెట్ 2022 ర్యాంకు ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా బీఎస్సీ హార్టీకల్చర్‌లో ప్రవేశం ఉంటుంది. మొత్తం 92 సీట్లకు నాలుగు ప్రభుత్వ ఉద్యాన కళాశాలల్లో 52 సీట్లు, ప్రైవేటు ఉద్యాన కళాశాలల్లో 40 సీట్లు ఇస్తారు. వర్సిటీ ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ పరీక్ష తీరును పర్యవేక్షించారు.

లాభాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఎందుకు?

కేంద్రాన్ని ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల్లో కొనసాగుతున్నప్పుడు దాన్ని ప్రైవేటీకరించాల్సిన అవసరం ఏమొచ్చిందని హైకోర్టు బుధవారం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. లాభాల్లో ఉన్న సంస్థను ప్రైవేటీకరించే విషయాన్ని పునఃపరిశీలించాలని సూచించింది. నిర్వాసితులకు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగాల కల్పనపై దాఖలైన వ్యాజ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 9కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మాజీ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై సువర్ణరాజు అనే వ్యక్తి కూడా పిల్ దాఖలు చేశారు. అలాగే ఈ అంశంతోపాటు నిర్వాసితులకు ఉద్యోగాలిచ్చేలా ఆదేశాలివ్వాలంటూ ధనలక్ష్మి, మరికొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ మూడు వ్యాజ్యాలపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారించింది.

ఎంత మేర నష్టాల్లో ఉంది?

ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం ముందుకెళుతూనే ఉందని కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో ధర్మాసనం స్పందిస్తూ.. ఎందుకు ప్రైవేటీకరిస్తున్నారు?.. ఆ సంస్థ నష్టాల్లో ఉందా? అంటూ ప్రశ్నించింది. సొంత అవసరాల నిమిత్తం క్యాప్టివ్ మైనింగ్ లేకపోవడంతో ఆ సంస్థ నష్టాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆదినారాయణరావు తెలిపారు. దీనిని సాకుగా చూపి ఆ సంస్థను ప్రైవేటీకరించాలని



కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు. అయితే ప్రైవేటీకరణకు కారణాలు ఏమిటో కేంద్రం స్పష్టంగా చెప్పడం లేదన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ గత ఐదేళ్ల కాలంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఎంత మేర నష్టాలు వచ్చాయని ప్రశ్నించింది. ఈ విషయంలో కేంద్రం నోరుమెదపడం లేదని ఆదినారాయణరావు చెప్పారు. ధర్మాసనం స్పందిస్తూ.. కోవిడ్ సమయంలో ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల వ్యాపారాలు మందకొడిగా సాగినా, ఒక్క ఉక్కు వ్యాపారం మాత్రం భారీ ఎత్తున సాగిందని తెలిపింది. ఆ సమయంలో చైనా ఉక్కును సరఫరా చేసే పరిస్థితి లేకపోవడంతో అది మన ఉక్కు పరిశ్రమలకు కలిసొచ్చిందని గుర్తు చేసింది.

స్టీల్ ప్లాంట్ లాభాల్లో నడుస్తోంది..

ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ.. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రస్తుతం లాభాల్లో నడుస్తోందని చెప్పారు. వందల కోట్ల రూపాయల మేర లాభాలు ఆర్జించిందన్నారు. ప్రైవేటీకరణకు బదులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ ప్రధాని మోదీకి లేఖ రాశారన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. లాభాల్లో ఉంటే ప్రైవేటీకరణ ఎందుకని ప్రశ్నించింది. కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎస్.హరినాథ్ స్పందిస్తూ.. నిరంతర నష్టాల వల్లే ప్రైవేటీకరణకు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సమయంలో ఆదినారాయణరావు జోక్యం చేసుకుంటూ.. ప్రపంచంలో ధనవంతులుగా చలామణి అవుతున్న కొంతమంది ఈ సంస్థను నడపగలరని కేంద్రం భావిస్తోందని, ఆ వ్యక్తులెవరో అందరికీ తెలుసన్నారు. ఈ నేపథ్యంలో లాభాల్లో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే విషయాన్ని పునఃపరిశీలించాలని కేంద్రానికి ధర్మాసనం సూచించింది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 32 నిండి క్యూలైన్లు ఏటీజీహెచ్ వద్దకు చేరుకున్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 77,956 మంది స్వామి వారిని దర్శించుకోగా.. 33,672 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.3.88 కోట్లు వేశారు. శ్రీవారి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది.

ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, అమరావతి: డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి బుధవారం తీర్పు వెలువరించారు.

ఆక్వా రైతులకు నష్టం కలిగిస్తే చర్యలు తప్పవు

- కౌంట్ ధరలు తగ్గించినా.. ఫీడ్ ధరలు పెంచినా ఉపేక్షించం
- తేల్చిచెప్పిన మంత్రుల బృందం
- ఆక్వా సాధికారిత కమిటీ తొలి భేటీ
- హాజరైన మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స, సీదిరి, కారుమూరి
- ఫీడ్ ధరల నియంత్రణపై సమీక్షించి నివేదిక ఇవ్వాలని మంత్రుల ఆదేశం


మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, చిత్రంలో మంత్రులు బొత్స, కారుమూరి, సీదిరి

సాక్షి, అమరావతి: 'ఆక్వా రంగ బలోపేతం కోసమే ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) చట్టాన్ని ప్రభుత్వం తెచ్చింది. ఆక్వా రంగ కార్యకలాపాలన్నీ ఈ చట్టం పరిధిలోకే వస్తాయి. రొయ్యల ధరలు తగ్గించినా.. ఫీడ్ ధరలు పెంచినా అప్సడా చట్టం ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది' అని మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు స్పష్టం చేశారు. ఆక్వా రైతుల ఫిర్యాదుల నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఆక్వా సాధికారిత కమిటీ బుధవారం విజయవాడలో సమావేశమైంది. తొలుత కమిటీ సభ్యుడైన అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ ఆక్వా రైతుల సమస్యలను మంత్రుల దృష్టికి తెచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌ను సాకుగా చూపి ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు, దళారులు ఇష్టానుసారంగా రొయ్యల కౌంట్ ధరలను తగ్గించేస్తున్నారన్నారు. మూడు నెలల క్రితం రూ.90 వేల నుంచి రూ.97 వేలున్న టన్ను సోయాబీన్ ప్రస్తుతం రూ.45 వేల–రూ.55 వేల మధ్య ఉందని చెప్పారు. అలాగే గత ఆర్నెళ్లుగా ఫిష్ ఆయిల్, వీట్ ధరలు భారీగా తగ్గినప్పటికీ కంపెనీలు ఫీడ్ రేట్లను ఇష్టానుసారంగా పెంచేస్తున్నాయని, దీని వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై చర్చించాక ఫీడ్ ధరల పెంపుపై నిర్ణయం తీసుకుందామని గతంలో అంగీకరించినదానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయన్నారు.

రైతుకు అన్యాయం జరిగితే ఊరుకోం..

మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స మాట్లాడుతూ.. రొయ్యల కౌంట్ ధరలు ఎందుకు పడిపోతున్నాయి? ఫీడ్ ధరలు ఎందుకు పెంచాల్సి వచ్చిందో స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కొనుగోలుదారులు, తయారీదారులపై ఉందన్నారు. ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా ఉందని, వారికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇష్టానుసారంగా ధరలు పెంచడం, తగ్గించడం చేస్తే చర్యలు తప్పవన్నారు. రైతులతోపాటు ఫీడ్ తయారీదారులు, ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులతో గురువారం విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో ఫీడ్ ధరల నియంత్రణ, కౌంట్ ధరల పెంపుపై అనుసరించాల్సిన భవిష్యత్ కార్యాచరణపై నివేదిక రూపొందించాలని సూచించారు. ఈ నివేదికను కమిటీకి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతోపాటు కమిటీ సభ్యులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ, మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, ఇంధన, అటవీ శాఖల ముఖ్య కార్యదర్శి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్‌ను తిట్టించడం హేయం

- అమరావతి విషయంలో జోక్యం లేకపోయినా చంద్రబాబు తిట్టిస్తున్నారు
- గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్



చిలకలపూడి (మచిలీపట్నం): అమరావతి భూముల విషయంలో జూనియర్ ఎన్టీఆర్ ఎటువంటి జోక్యం చేసుకోకపోయినా చంద్రబాబునాయుడు తన మందీ మార్బలంతో తిట్టించటం హేయమైన చర్య అని కృష్ణాజిల్లా గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్ వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జూనియర్ ఎన్టీఆర్ స్వయంకృషితో పైకి వచ్చారని, ఎవరూ ఆయన్ను పైకి తీసుకురాలేదని చెప్పారు. తెలుగుదేశం పార్టీ 2009 ఎన్నికల ప్రచారంలో జూనియర్ ఎన్టీఆర్‌ను వినియోగించుకుని కరివేపాకులా తీసి పాడేశారని, ప్రస్తుతం ఆయన సినిమాలతో బిజీగా ఉన్నారని తెలిపారు. బాబుకు ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఉన్నారని, ఆయన స్పందిస్తున్నారు కాబట్టి ఇక జూనియర్ ఎన్టీఆర్‌తో పనేంటని వంశీ ప్రశ్నించారు. అధికారంలో ఉండగా.. కృష్ణా జిల్లాకుగానీ, గన్నవరం విమానాశ్రయానికిగానీ ఎందుకు ఎన్టీఆర్ పేరు పెట్టలేకపోయారని, భారతరత్న ఎందుకు తీసుకురాలేకపోయారని వంశీ నిలదీశారు. వైద్య విశ్వవిద్యాలయానికి ఎన్టీఆర్ పేరును తొలగించి వైఎస్సార్ పేరు పెట్టడం వల్ల ఇరువురి స్థాయి మారదన్నారు. సీఎం వైఎస్ జగన్ కృష్ణాజిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టినప్పుడు స్పందించని టీడీపీ నాయకులు ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

బాలకృష్ణా.. సిగ్గుందా?

- తండ్రి చావుకు కారణమైన చంద్రబాబుతో షోలు చేస్తారా?
- ఎన్టీఆర్ మరణించి 25 ఏళ్లు దాటినా ఇంకా క్షోభ పెడుతున్నారు
- మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడరూరల్: తండ్రి చావుకు కారణమైన చంద్రబాబు ఫ్యామిలీతో షోలు చేయడానికి నందమూరి బాలకృష్ణకు సిగ్గు ఉండాలని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ధ్వజమెత్తారు. ఆయన బుధవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. మహానటుడు ఎన్టీఆర్ మరణించి 25 ఏళ్లు గడిచినా చంద్రబాబు నేటికీ షోల పేరుతో ఆయనపై అసత్య ప్రచారాలు చేస్తూ క్షోభ పెడుతున్నారని అన్నారు. పార్టీని కాపాడినట్లు షోలు చేస్తున్న చంద్రబాబు కపట నాటక సూత్రధారి అని చెప్పారు. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీని నడపడం చంద్రబాబుకు చేతకాకపోతే బయటకు పోవాలన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజకీయ అజ్ఞాని అని, చిల్లర కోసం ఆశపడి చంద్రబాబు చెప్పినట్లు ఆడుతున్నారని అన్నారు. గాజువాక ప్రజలు పవన్‌ను ఓడించి ఉమ్మేసినా సిగ్గు లేదన్నారు. గాజువాకతోపాటు ఉత్తరాంధ్రపై కక్ష పెట్టుకున్న పవన్ పెయిడ్ అమరావతి రైతులు, టీడీపీ, బీజేపీ, తోక పార్టీలతో కలిసి ఉత్తరాంధ్ర ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు విశాఖ రాజధాని కావాలని కోరుతూ ఈనెల 15న చేపట్టే విశాఖ గర్జనను భగ్నం చేయడానికే పవన్ ఉత్తరాంధ్ర పర్యటన పేరిట నాటకాలాడుతున్నారని దుయ్యబట్టారు.

కులవాదుల బలప్రదర్శన హాస్యాస్పదం

తాడికొండ: అమరావతి పాదయాత్ర పేరుతో ఆర్థిక ఉగ్రవాదులు, కులవాదులు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ.. బల ప్రదర్శనకు దిగి ప్రజలను రెచ్చగొట్టడం హాస్యాస్పదమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. త్వరలో విశాఖలో జరుగనున్న జేఏసీ గర్జన కార్యక్రమానికి బహుజన పరిరక్షణ సమితి సంపూర్ణ మద్దతిస్తుందని స్పష్టం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 745వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ.. పాదయాత్రల పేరుతో డ్రామా కంపెనీ పెట్టి పెయిడ్ ఆర్టిస్టులతో రోడ్ల వెంబడి ప్రదర్శనలు చేయించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, గంగాధర్ పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

14 నుంచి అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవం



విజయవాడ కల్చరల్: ప్రముఖ నాట్యాచార్యులు వెంపటి చిన సత్యం జయంతి సందర్భంగా ఈనెల 14వ తేదీనుంచి మూడు రోజులపాటు అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవం నిర్వహించనున్నట్లు సేవ్ కూచిపూడి వ్యవస్థాపకురాలు పెదప్రోలు భావన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపీ సృజనాత్మక సమితి, సేవ్ కూచిపూడి నృత్య సంస్థ, జయహో భారతీయం ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య కళాశాలలో నిర్వహిస్తామన్నారు. బుధవారం విజయవాడ దుర్గాపురంలోని సంగీత కళాశాలలో విలేకరులకు వివరాలను వెల్లడించారు. కార్యక్రమాల్లో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన మూడువందల కళాబృందాలు, మూడు వేలమంది కళాకారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శిస్తారని తెలిపారు. డాక్టర్ వెంపటి చినసత్యం జీవితకాల పురస్కారాన్ని నాట్యాచారిణి ఏబీ బాలకొండలరావు, లంకా అన్నపూర్ణ పురస్కారాన్ని వనజా ఉదయ్‌కు, శోభానాయుడు పురస్కారాన్ని పద్మజారెడ్డికి వెంపటి వెంకట్ స్మారక పురస్కారాన్ని రఘుపార్థుకి ప్రదానం చేయనున్నట్లు వివరించారు. యువజన సాంస్కృతిక పర్యాటక శాఖామంత్రి ఆర్‌కే రోజా, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ భార్గవ హాజరవుతారని తెలిపారు. సేవ్ కూచిపూడి కో–ఆర్డినేటర్స్ యల్లాజోస్యుల అనూరాధ, రంగమణి, హవీషా చౌదరి, శ్రీనివాసరెడ్డి, ఘంటసాల పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

2019 తర్వాతే శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలో వసతులు

- 2020లో 420 పోస్టులు మంజూరు
- విద్యా సంస్థల విషయంలో రాజకీయ కోణంలో వార్తలు రాయడం సరికాదు
- ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీరెడ్డి

నూజివీడు: 2019 తర్వాతే శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో వసతులు కల్పించినట్టు రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) చాన్సలర్ ఆచార్య కేసీరెడ్డి తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీలను 2016లో ఏర్పాటు చేసినప్పటికీ 2019 వరకు ఒక్క టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టునూ మంజూరు చేయలేదన్నారు. అప్పటి వరకూ పోస్టుల్లేకుండానే విద్యాసంస్థను నిర్వహించినట్టు తెలిపారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా 2020లో 420 టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను మంజూరు చేసినట్టు తెలిపారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీని 2019లో ఆగస్టు 24న సందర్శించినప్పుడు.. ఎచ్చర్లలో వైఎస్సార్ హయాంలో నిర్మించిన గురుకులం క్యాంపస్‌లో నిర్వహించే వారని, అప్పట్లో వెయ్యి మంది విద్యార్థులకు కూడా సరైన సదుపాయాలు లేవని, ఇప్పుడు నాలుగు వేల మంది విద్యార్థులను శ్రీకాకుళం క్యాంపస్‌లో ఉండేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. గతంలో రెండు ఫ్లోర్లుండగా.. ఇప్పుడు వాటిపై మూడు ఫ్లోర్లను నిర్మించినట్టు చెప్పారు. అంతేగాకుండా మేజర్ అకడమిక్ బ్లాక్‌ను నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. శ్రీకాకుళం క్యాంపస్‌ను ప్రభుత్వం గానీ, ఆర్జీయూకేటీ గానీ ఎన్నడూ నిర్లక్ష్యం చేయలేదని స్పష్టం చేశారు. గతంలో ట్రిపుల్ ఐటీలకు సంబంధించిన రూ.185 కోట్ల నిధులను ఏ ప్రభుత్వం మళ్లించిందో కూడా అందరికీ తెలుసన్నారు. విద్యాసంస్థల విషయంలో రాజకీయ కోణంలో, రాజకీయ ప్రయోజనాల కోసం వార్తలు (సాక్షి కాదు) రాయడం మంచి పద్ధతి కాదని ఆయన హితవుపలికారు. సమావేశంలో వీసీ ఆచార్య హేమచంద్రారెడ్డి ఉన్నారు.

హెచ్‌ఐవీ బాధితుల భాగస్వాములకు నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి



సాక్షి, అమరావతి: హెచ్‌ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వ్యక్తి తన జీవిత భాగస్వామికి తప్పనిసరిగా నిర్ధారణ పరీక్ష చేయించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఏపీ శ్యాక్స్ పీడీ జి.ఎస్.నవీన్‌కుమార్ సూచించారు. బుధవారం అన్ని జిల్లాల ఏఆర్‌టీ సెంటర్‌లు, డయాలసిస్ యూనిట్ల అధికారులు, వైద్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అవసరం ఉన్న హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా డయాలసిస్ చేసుకునేలా కౌన్సెలింగ్ చేయాలని ఆదేశించారు. మధ్యలో డయాలసిస్ మానేస్తే హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం మరింత క్షీణిస్తుందన్నారు. భార్య, భర్తలు ఇద్దరిలో ఒకరు నెగిటివ్ మరొకరు పాజిటివ్ అయితే వారిని సీరో డిస్కార్డెంట్ కపుల్ అంటారని తెలిపారు. ఇలాంటి వారు సంసార జీవితంలో జాగ్రత్తలు పాటిస్తే ఒకరి నుంచి మరొకరికి వైరస్ సోకదని పేర్కొన్నారు. అదేవిధంగా నెగిటివ్‌ఉన్న వ్యక్తి డాక్టర్ సలహా మేరకు ప్రెప్ (ప్రి ఎక్స్ పోజర్ ప్రోఫిలాక్సిస్) మందుల్ని వాడడం ద్వారా వైరస్ బారినుంచి రక్షణ పొందొచ్చని వివరించారు. పాజిటివ్ ఉన్న వారు ఏఆర్‌టీ సెంటర్లకు వెళ్లి మందుల్ని సక్రమంగా వాడాలని సూచించారు.

అమరావతిలోని పేదలకు త్వరలో జీవన భృతి పింఛన్

- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్
- ఇకపై సాధారణ పింఛన్లతో పాటే జీవన భృతి పింఛన్ల పంపిణీకి సీఎం హామీ ఇచ్చినట్లు వెల్లడి



తాడికొండ: రాజధాని అమరావతి ప్రాంతంలోని భూమి లేని పేదలకు త్వరలో జీవన భృతి పింఛన్ బకాయిలు విడుదల కానున్నాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. ప్రతినెలా ప్రభుత్వం పంపిణీ చేసే జీవన భృతి పింఛన్లకు సంబంధించిన 3 నెలల బకాయిలు చెల్లించేందుకు గాను సీఎఫ్ఎంఎస్‌కు రూ.14.07 కోట్లు చేరాయని తెలిపారు. త్వరలో లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తారని వెల్లడించారు. ఈ నెల 10న జరిగిన సమీక్షలో ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆర్థిక శాఖకు ఆదేశాలిచ్చారని చెప్పారు. ఇకపై పెండింగ్ లేకుండా సాధారణ పింఛన్లతో పాటే జీవన భృతి పింఛన్లు కూడా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటానని సీఎం హామీ ఇచ్చారని డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా...

సూకీకి మరో ఆరేళ్ల జైలు

బ్యాంకాక్: మయన్మార్ ఉద్యమ నాయకురాలు ఆంగ్ సాన్ సూకీకి బుధవారం మరో ఆరేళ్ల శిక్ష పడింది. దీంతో ఆమెకు మొత్తం 26 ఏళ్ల శిక్ష పడినట్లయింది. ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన సూకీ ప్రభుత్వాన్ని సైనిక పాలకులు కూలదోసి గతేడాది ఆమెను, కీలక నేతలను జైలుపాలు చేయడం తెలిసిందే.

ఇరాన్‌లో ఇంటర్నెట్ బంద్

దుబాయ్: ఇరాన్‌లో ఇంటర్నెట్ సేవలకు బుధవారం భారీగా అంతరాయం ఏర్పడింది. హిజాబ్‌కు వ్యతిరేకంగా దేశంలో నిరసనలు రాజుకుంటున్న తరుణంలో పలుమార్లు ఇంటర్నెట్ సేవలు పని చేయలేదు. హిజాబ్ సరిగా ధరించలేదంటూ ఇటీవల 22 ఏళ్ల యువతి అమినిని ఇరాన్ నైతిక పోలీసులు కస్టడీలోకి తీసుకుని చితకబాదడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. దీంతో దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున నిరసనలు ఎగిసిపడిన విషయం తెలిసిందే.

నేను అధ్యక్షునిగా నెగ్గితే సీడబ్ల్యూసీకి ఎన్నికలు: థరూర్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైతే పార్టీని సంస్కరణల బాట పట్టిస్తానని తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ ప్రకటించారు. ''పార్టీ నియమావళిలోని ప్రతి నిబంధననూ అమలుచేస్తా. కీలకమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ)కి ఎన్నికలు నిర్వహిస్తా. పాతికేళ్లకుపైగా చేష్టలుడిగిన పార్లమెంటరీ బోర్డ్‌కు పునర్వైభవాన్ని తీసుకొస్తా. నిర్ణయాధికారాన్ని వికేంద్రీకరిస్తా. పార్టీకి క్షేత్రస్థాయిలో మూలస్తంభాలైన పదాధికారులకు మరిన్ని అధికారాలు కట్టబెడతా. ఉదయ్‌పూర్ తీర్మానాలను అమల్లోకి తెస్తా' అని బుధవారం పీటీఐ ఇంటర్వ్యూలో చెప్పారు. ''నేను సంస్కరణవాదిని. పార్టీని నడిపే విధానంలో వైవిధ్యం చూపిస్తా. 2024లో బీజేపీని ఢీకొట్టి ఓడించేలా కాంగ్రెస్‌ను పటిష్టపరుస్తా'' అన్నారు.

కుప్పకూలిన మిగ్ ఫైటర్ జెట్

న్యూఢిల్లీ: భారత నావికాదళానికి చెందిన మిగ్–29కే ఫైటర్ జెట్ బుధవారం సాంకేతిక లోపంతో గోవా తీరంలో కుప్పకూలింది. పైలట్ సురక్షితంగా బయటపడినట్లు నావికాదళం వెల్లడించింది. మిగ్–29కే ఫైటర్ జెట్‌ను రష్యా ఏరోస్పేస్ కంపెనీ మికోయాన్ (మిగ్) అభివృద్ధి చేసింది. భారత నేవీ రష్యా నుంచి 45 మిగ్–29కే ఫైటర్ జెట్లను కొనుగోలు చేసింది. విమాన వాహక నౌక 'ఐఎన్ఎస్ విక్రమాదిత్య' నుంచి వీటిని ఆపరేట్ చేస్తున్నారు. గతంలోనూ మూడు మిగ్–29కే జెట్లు కూలిపోయాయి.

ఆంజనేయాలయం కోసం భూదానం చేసిన ముస్లిం

షాజహాన్‌పూర్(యూపీ): ఆంజనేయ ఆలయ నిర్మాణం కోసం ఉత్తరప్రదేశ్‌లో ఒక ముస్లిం వ్యక్తి భూదానం మతసామరస్యాన్ని చాటాడు. ఢిల్లీ–లక్నో 24వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులకు కచియానా ఖేరి గ్రామంలో హనుమాన్ ఆలయం అడ్డంకిగా మారింది. విషయం తెల్సుకున్న స్థానికుడు బాబూ అలీ తన 0.65 హెక్టార్ల భూమిలో కొత్త ఆలయం నిర్మించుకోండంటూ భూమిని దానం చేశాడు. దీంతో రోడ్డపై ఆలయాన్ని పడగొట్టి అలీకి చెందిన స్థలంలో పునర్నిర్మించనున్నారని అదనపు జిల్లా మేజిస్ట్రేట్(పరిపాలన) రామ్‌సేవక్ ద్వివేది బుధవారం చెప్పారు. ఈ మేరకు భూమి బదిలీ ప్రక్రియ పూర్తయిందని తిల్హార్ డెప్యూటీ జిల్లా మహిళా మేజిస్ట్రేట్ రాశీ కృష్ణ వెల్లడించారు. హిందూ – ముస్లిం ఐక్యతను అలీ మరోసారి చాటిచెప్పారని రాశీ పొగిడారు.

'ఔషధాల ఉత్పత్తి ఆపండి'

చండీగఢ్: ఆఫ్రికా ఖండంలోని గాంబియా దేశంలో 66 మంది చిన్నారుల మరణాలకు కారకమైన దగ్గు, జలుబు టానిక్‌లను తయారుచేసిందని తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న హరియాణాలోని మేడిన్ ఫార్మాసూటికల్స్‌లో ఉత్పత్తి నిలిపేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. మేడిన్ ఫార్మాకు చెందిన సోనిపట్ యూనిట్‌లో 12 రకాల నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలో అక్కడ అన్ని రకాల ఔషధాల ఉత్పత్తిని వెంటనే ఆపేయాలని ఆదేశాలిచ్చామని హరియాణా ఆరోగ్య మంత్రి అనిల్ విజ్ బుధవారం చెప్పారు. డజన్లకొద్దీ చిన్నారుల ప్రాణాలు హరించాయన్న నాలుగు బ్రాండ్ల టానిక్‌ల శాంపిళ్లను కోల్‌కతాలోని కేంద్ర ఔషధ పరీక్ష కేంద్రానికి పంపించారు. వీటి నివేదిక ఇంకా రావాల్సి ఉంది. ప్రాణాంతక రసాయనాలు టానిక్‌లలో ఉన్నట్లు తేలితే కఠిన చర్యలకు దిగుతామని మంత్రి అనిల్ చెప్పారు. చిన్నారుల ప్రాణాలను బలిగొన్న ఆ టానిక్‌లు గాంబియాలో మరెంతోమంది చిన్నారుల మూత్రపిండాలు పాడవడానికి కారణమయ్యాయని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది.



రాంచీలో గిరిజనోత్సవం 'ముండా మేళా'లో చెక్క బొమ్మపై జార్ఖండ్ సీఎం సోరెన్

యుద్ధం–శాంతి కింకర్తవ్యం!

రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం తక్షణావసరం

- ఇందుకు పూనుకోవాల్సింది అమెరికా–నాటో కూటమే
- లేదంటే పరిస్థితి పూర్తిగా చేజారే ప్రమాదం

ఎస్.రాజమహేంద్రారెడ్డి



ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరం బాంబుల మోతతో దద్దరిల్లుతోంది. రష్యా సేనలు ప్రతీకారేచ్ఛతో ముందూ వెనకా చూసుకోకుండా వరుసపెట్టి దాడులు చేస్తున్నాయి. కీవ్‌ను హస్తగతం చేసుకుని ఉక్రెయిన్‌ను తమ కబంధ హస్తాలతో ఆక్రమించుకోవాలనేదే రష్యా ఆశగా కనిపిస్తోంది. తలవంచడానికి సిద్ధంగా లేని ఉక్రెయిన్ వీరోచితంగా ఎదురొడ్డి నిలుస్తోంది. ఈ స్థాయి ప్రతిఘటనను ఆర్నెల్ల కింద యుద్ధం మొదలైనప్పుడు ఎవరూ ఊహించలేదు. రష్యా ఒక్క ఉదుటున ఉక్రెయిన్‌లోకి చొరబడి దాడికి దిగగానే కథ రెండు మూడు వారాల్లోనే ముగుస్తుందని భావించారు. ఉక్రెయిన్ పరిస్థితిని చూసి జాలి పడ్డవాళ్లూ ఉన్నారు. అటు నాటో కానీ, ఇటు అమెరికా కానీ తొలినాళ్లలో ఉక్రెయిన్‌కు అండగా నిలిచేందుకు సంశయించాయి. కానీ, ఆర్నెల్లు దాటిపోయినా యుద్ధం కొనసాగుతూనే ఉంది. దాడులు, ప్రతి దాడులు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. అంచనాలను వమ్మచేస్తూ ఉక్రెయిన్ నిలబడి పోరాడుతూనే ఉంది. ఇటు రష్యా అధ్యక్షుడు పుతిన్ మంకుపట్టు వీడటం లేదు. అటు ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ స్థైర్యాన్ని కోల్పోవడం లేదు. మరి యుద్ధం ఎప్పుడు ముగిసేను?! ఉక్రెయిన్ రష్యా నీడలోకి వచ్చేదాకా అని పుతిన్ అంటాడు, వచ్చే ఏడాదిలో తమ విజయంతోనే ముగుస్తుందని అంటాడు!

పెనం నుంచి పొయ్యిలోకి...

ఉక్రెయిన్‌లో యుద్ధం ఇప్పుడు రెండు ప్రాంగణాలుగా విడిపోయింది. తూర్పులో డోన్బాస్ ప్రాంతాన్ని రష్యా దాదాపు పూర్తిగా ఆక్రమించేసుకుంది. మిగతా కొద్ది ప్రాంతాన్ని కాపాడుకుందామని ఉక్రెయిన్ సేనలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు దక్షిణాన చేజారిన ప్రాంతాలను తిరిగి చేజిక్కించుకోవడానికి ఉక్రెయిన్ సంసిద్ధమవుతోంది. ప్రాణనష్టం లెక్కలపై వైరిపక్షాలు ఎంత బింకానికి పోయినా భారీ మూల్యాన్నే చెల్లించాయి. రష్యా దాదాపు 80 వేల మంది సైనికులను కోల్పోయిందని పెంటగాన్ అంచనా. క్షతగాత్రులు ఇంకెంత మందో! రష్యా అమ్ములపొది కూడా ఖాళీ అవుతూ వస్తోంది. ఉక్రెయిన్‌కూ ప్రాణనష్టం భారీగానే ఉంది. అధికారిక లెక్కల ప్రకారం దాడుల తీవ్రతను బట్టి రోజుకు 100 నుంచి వెయ్యి మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటిదాకా కనీసం 12 వేల మంది సామాన్యులు కూడా చనిపోవడమో, తీవ్రంగా గాయపడటమో జరిగిందని ఐరాస అంచనా. నిజానికి పౌర నష్టం అంచనాలకు మించి ఉందనేది నిపుణుల వాదన. మరింత ఆయుధ సాయం చేయాలనడమే కాకుండా నేరుగా కీవ్‌లో అమెరికా రక్షణ దళాలను మోహరించాలని జెలెన్‌స్కీ తాజాగా అభ్యర్థించడం పరిస్థితికి అద్దం పడుతోంది.

తిండికి అల్లాడుతున్న దేశాలు

యుద్ధానికి మరోవైపు చూస్తే ఆహార సంక్షోభం పొంచి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గోధుమలు, మొక్కజొన్నలు, బార్లీ ఉత్పత్తుల్లో రష్యా, ఉక్రెయిన్‌లదే ప్రపంచంలో అగ్ర స్థానం. యుద్ధం వల్ల రవాణా నిలిచిపోవడంతో ఈ రెండు దేశాల దిగుమతులపై ఆధారపడ్డ పలు దేశాలు దాదాపు కరువు పరిస్థితులతో అల్లాడుతున్నాయి. గత నెల రెండు దేశాలు ఒప్పందానికి వచ్చి ఉక్రెయిన్‌లోని ఆహార ధాన్యాల ఎగుమతులకు అంగీకరించాయి. కానీ 45 దేశాల్లోని కోట్లాది మందికి ఇవి సరిపోతాయా అన్నదే ప్రశ్న. మరోవైపు యుద్ధానికి ముగింపు ఎప్పుడన్నది ప్రస్తుతానికి జవాబు లేని ప్రశ్నగానే ఉంది. ఇటీవలే పశ్చిమ దేశాలు సమకూర్చిన అత్యాధునిక ఆయుధాలతో ఉక్రెయిన్ స్థైర్యం కాస్త ఇనుమడించింది. దేశ దక్షిణాది ప్రాంతాల్లో తిష్ట వేసి కూర్చున్న రష్యా సేనలను తరిమికొట్టడమే వ్యూహంగా ఉక్రెయిన్ సాగుతోంది. అత్యంత కీలకమైన ఖెర్సన్‌ను తిరిగి చేజిక్కించుకుంటే ఉక్రెయిన్ ఒక ముందడుగు వేసినట్టేనని నిపుణుల అంచనా. అదే జరిగితే రష్యాకు పెద్ద ఎదురుదెబ్బే అవుతుంది. అసలే అరకొర సైన్యంతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రష్యాను ఇది మరిన్ని కష్టాల్లోకి నెడుతుంది. రిటైరైన సైనికులను సైతం యుద్ధానికి సన్నద్ధం చేయాల్సి వస్తుంది. ఇది పుతిన్‌కు సుతరామూ ఇష్టం లేకున్నా, తప్పేట్టు లేదు. ఒకవేళ రష్యా ఉక్రెయిన్ దక్షిణ ప్రాంతంలో తమ పట్టును కొనసాగిస్తే జెలెన్‌స్కీకి కష్టకాలం మొదలైనట్టే. మరీ మొండితనానికి పోయి యావత్ సైన్యాన్ని దక్షిణంలోనే మోహరించడానికి ఉక్రెయిన్ సిద్ధపడితే తూర్పు ప్రాంతంలో రష్యాకు పూర్తిగా తలొంచక తప్పదని అంచనా. ఇదంతా ఒకెత్తయితే ఇప్పటిదాకా అంటీముట్టనట్టు ఉన్న చైనా బాహాటంగా రష్యాకు తమ మద్దతు ప్రకటించి రంగంలోకి దిగితే యుద్ధ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. యుద్ధం తొలినాళ్లలోనే చైనాను రష్యా సైనిక మద్దతు కోరడం తెలిసిందే.

మరో ప్రచ్ఛన్న యుద్ధం దిశగా...

ఉక్రెయిన్‌కు అమెరికా ఆర్థిక, ఆయుధ సాయం ఒకరకంగా యుద్ధాన్ని ప్రేరేపించినట్టే అయిందన్న వాదన కూడా ఉంది. చినికిచినికి గాలివాన అయినట్టు చివరికిది రెండు అగ్రరాజ్యాల మధ్య పోరుగా మారితే పరిణామాలు భయానకంగా ఉంటాయి. ప్రపంచ శాంతి అల్లకల్లోలం అవుతుంది. అణ్వాయుధ ప్రయోగానికి కూడా వెనకాడనంటూ పుతిన్ ఇప్పటికే బెదిరించడం తెలిసిందే. నాటోకు, రష్యాకు మధ్య ఈ పోరు ప్రచ్ఛన్న యుద్ధానికి దారి తీయకముందే అమెరికా వంటి దేశం సంధికి ప్రయత్నిస్తే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేదంటే మధ్యేమార్గంగా కనీసం యుద్ధ విరామానికన్నా ప్రయత్నించి చర్చలకు తెర తీయాలి. పోనీ, యుద్ధం కొనసాగుతుండగానే చర్చలను మొదలుపెట్టినా బాగానే ఉంటుంది. ఏదో ఒక ముగింపు తప్పక దొరికే అవకాశముంటుంది. రష్యా తన విధ్వంసక దాడులను ఆపకపోతే అటు అమెరికా, ఇటు నాటో ఉక్రెయిన్‌కు ఇలాగే సాయాన్ని కొనసాగించడం తప్పనిసరవుతుంది. కాబట్టి యుద్ధానికి రాజకీయ పరిష్కారం దిశగా రెండు దేశాలు కదిలేలా చేయడానికి ఇదే సరైన సమయం. ఈ బాధ్యతను అమెరికా, నాటో దేశాలే భుజానికెత్తుకోవాలి. లేదంటే దౌత్యం కూడా వీలుపడని స్థాయికి పరిస్థితి చేజారే రోజు ఎంతో దూరం లేదు!

రైల్వే కార్మికులకు 78 రోజుల బోనస్

- 'ఎల్పీజీ' నష్టాలను పూడ్చడానికి చమురు సంస్థలకు రూ.22,000 కోట్లు
- కేంద్ర మంత్రివర్గం ఆమోదం



న్యూఢిల్లీ: రైల్వే శాఖలో పనిచేస్తున్న 11.27 లక్షల మంది నాన్–గెజిటెడ్ ఉద్యోగులు, కార్మికులకు శుభవార్త. 2021–22 ఆర్థిక సంవత్సరంలో వారికి ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్(పీఎల్‌బీ) చెల్లించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. కేబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు. ఏటా దసరా/దీపావళి ముందు రైల్వే ఉద్యోగులు, కార్మికులకు బోనస్ ప్రకటిస్తుంటారు. ఈ ఏడాది 78 రోజుల వేతనానికి సమానమైన బోనస్ చెల్లించనున్నారు. బోనస్ కింద గరిష్టంగా రూ.17,951 పొందే అవకాశముంది. ట్రాక్ మెయింటెయినర్లు, డ్రైవర్లు, గార్డులు, స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నికల్ హెల్పర్లు, కంట్రోలర్లు, పాయింట్స్‌మెన్, మినిస్టీరియల్ స్టాఫ్, ఇతర 'గ్రూప్ సి' సిబ్బంది బోనస్‌కు అర్హులు. దీనివల్ల రైల్వే శాఖపై రూ.1,832.09 కోట్ల భారం పడనుంది.

ప్రభుత్వ రంగ చమురు సంస్థలకు ఊరట

మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే గృహావసరాల ఎల్పీజీ విక్రయంతో నష్టపోతున్న ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఆదుకోవడానికి వన్‌టైమ్ గ్రాంట్ కింద కేంద్రం రూ.22,000 కోట్లు కేటాయించింది. 2020–22 మధ్య అంతర్జాతీయంగా ఎల్పీజీ ధర 300 శాతం పెరిగినా మన దేశంలో ఈ పెంపు 72 శాతమే. అదనపు భారాన్ని చమురు సంస్థలే భరించాయి.

- మల్టీ–స్టేట్ కో–ఆపరేటివ్ సొసైటీస్ చట్టంలో సవరణలకు మంత్రివర్గం అంగీకారం తెలియజేసింది. దీనివల్ల ఈ రంగంలో మరింత పారదర్శకత, ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు సాధ్యమవుతాయని అంచనా.
- గుజరాత్‌లోని దీన్‌దయాళ్ పోర్ట్‌లో రూ.4,243.64 కోట్లతో టునా–టెక్రా వద్ద కంటైనర్ టెర్మినల్ అభివృద్ధి ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది.
- ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి కోసం రూ.6,600 కోట్లతో 'ప్రైమ్ మినిస్టర్స్ డైవలప్‌మెంట్ ఇనిషియేటివ్ ఫర్ నార్త్ ఈస్ట్ రీజియన్(పీఎం–డెవ్ ఇన్)' పథకాన్ని అమలు చేసేందుకు కేంద్ర మంత్రివర్గం అంగీకరించింది. ఈ పథకం కింద 2022–23 నుంచి 2025–26 దాకా ఈశాన్య రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు అభివృద్ధి చేస్తారు. జీవనోపాధికి సంబంధించిన ఇతర ప్రాజెక్టులు చేపడతారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పథకం.

కొనసాగుతున్న దాడులు

- అవిద్వికా మార్కెట్‌పై దాడుల్లో ఏడుగురు మృతి
- యుద్ధం ఎన్నాళ్లు కొనసాగినా అండగా ఉంటామన్న నాటో

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడుల పరంపర కొనసాగుతోంది. నేరుగా జనావాసాలను లక్ష్యంగా చేసుకొని రష్యా మిలటరీ దాడులు చేస్తోంది. అవిద్వికా, నిక్‌పోల్, జపోరిజియా నగరాలపై ఎస్–300 క్షిపణులతో దాడి చేస్తోంది. అవిద్వికా మార్కెట్‌పై జరిగిన క్షిపణి దాడిలో ఏడుగురు మరణించారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. కాగా, యుద్ధం ఎన్నాళ్లు కొనసాగినా ఉక్రెయిన్‌కు అండగా ఉంటామని నాటో స్పష్టం చేసింది. బ్రస్సెల్స్‌లో జరిగిన నాటో 50 దేశాల సమావేశం అనంతరం కూటమి చీఫ్ జెన్స్ స్టోలెన్‌బర్గ్ మీడియాతో మాట్లాడారు. ఉక్రెయిన్‌కు గగనతల రక్షణ వ్యవస్థను అందించడానికి తాము అధిక ప్రాధాన్యం ఇస్తామని స్టోలెన్‌బర్గ్ స్పష్టంచేశారు. మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా అణు దాడికి దిగుతుందని తాను భావించడం లేదని అమెరికా అధ్యక్షుడు బైడెన్ అభిప్రాయపడ్డారు. అయితే అణు దాడికైనా వెనుకాడమని రష్యా అధినేత హెచ్చరించడం ఆయన బాధ్యతారాహిత్యాన్ని బయటపెడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉక్రెయిన్ మిలటరీ సామర్థ్యాన్ని, పశ్చిమ దేశాల అండను పుతిన్ తక్కువగా అంచనా వేశారని వ్యాఖ్యానించారు. మరోవైపు కెర్చ్ వంతెన పేలుడుకు సంబంధించి ఐదుగురు రష్యన్లు, ముగ్గురు ఉక్రెనియన్లను రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ అరెస్ట్ చేసింది.



ఇజియంలో ఆహారం, నిత్యావసర సరుకుల కోసం ఎగబడుతున్న స్థానికులు

మా లక్ష్మణరేఖ తెలుసు

అయినా నోట్ల రద్దుపై పరిశీలన: సుప్రీం

న్యూఢిల్లీ: ప్రభుత్వ విధాన నిర్ణయాలపై న్యాయసమీక్ష పరిమితులకు సంబంధించిన లక్ష్మణరేఖపై తమకు పూర్తిగా అవగాహన ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. అయినా 2016లో మోదీ ప్రభుత్వం ప్రకటించిన నోట్ల రద్దు నిర్ణయాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేసింది. నోట్ల రద్దు వ్యర్థ ప్రయాసగా మిగిలిపోయిందా, ఏమైనా ప్రభావం చూపిందా అన్నదానిపై అన్ని అంశాలనూ కూలంకషంగా పరిశీలించి ఒక నిర్ణయానికి వస్తామని న్యాయమూర్తి ఎస్.ఎ.నజీర్ సారథ్యంలోని ఐదుగురు జడ్జిల ధర్మాసనం బుధవారం వివరించింది. ఇలాంటి అకడమిక్ అంశాలపై కోర్టు తన సమయం వృథా చేసుకోరాదని కేంద్రం తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయపడ్డారు. ఏ అంశమైనా రాజ్యాంగ ధర్మాసనం ముందుకొచ్చినప్పుడు పరిశీలించి తగిన సమాధానమివ్వడం తమ బాధ్యతని ధర్మాసనం పేర్కొంది. నోట్ల రద్దు నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాల్సిందిగా కేంద్రానికి, రిజర్వ్ బ్యాంకుకు సూచించింది. విచారణను నవంబర్ 9కి వాయిదా వేసింది.

ప్రైవేటీకరణకు అడ్డుకట్ట: రాహుల్

సాక్షి, బళ్లారి: ప్రభుత్వ రంగ సంస్థల విచ్చలవిడి ప్రైవేటీకరణకు కాంగ్రెస్ వ్యతిరేకమని ఆ పార్టీ నేత రాహుల్‌గాంధీ అన్నారు. తాము అధికారంలోకి వస్తే దీనికి అడ్డుకట్ట వేస్తామని ప్రకటించారు. ఆయన భారత్ జోడో పాదయాత్ర బుధవారం కర్ణాటకలో కొనసాగింది. చిత్రదుర్గం జిల్లాలో అవయవ దానం చేసిన వారి పిల్లలు, కుటుంబీకులతో రాహుల్ కలిసి నడిచారు. గొప్ప దాతల సంబంధీకులతో కలిసి నడవడం ఎంతో గర్వకారణంగా ఉందంటూ అనంతరం ఆయన ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. కన్నడ నట దిగ్గజం దివంగత రాజ్‌కుమార్, ఇటీవల మరణించిన ఆయన కుమారుడు పునీత్ రాజ్‌కుమార్ నేత్రదానం లక్షలాది మంది కన్నడిగులకు ఆదర్శంగా నిలిచిందంటూ కొనియాడారు. అంతకుముందు గిరియమ్మనహళ్లి వద్ద రాహుల్ నిరుద్యోగ యువతతో, రైతులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు పథకం తీసుకొస్తామన్నారు. విద్య, ఆరోగ్య రంగాల్లో అపారమైన ఉపాధి అవకాశాలున్నాయన్నారు. యువత సొంత వ్యాపారాలు, చిన్న పరిశ్రమలు పెట్టుకునేందుకు ప్రత్యేక ఆర్థిక సాయం అందజేసే వ్యవస్థను తెస్తామని చెప్పారు.



నరమాంసం తిన్నారు!

కేరళ నరబలి ఉదంతంలో దిగ్భ్రాంతికర అంశాలు వెలుగులోకి...

తిరువనంతపురం/కొచ్చి: కేరళలో చోటుచేసుకున్న నరబలి ఘటనలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయి, త్వరగా ధనవంతులు కావాలన్న ఆశతో ఇద్దరు అమాయక మహిళలను బలి ఇచ్చారు. అంతేకాదు వారి మాంసాన్ని వండుకొని ముగ్గురు నిందితులు ఆరగించినట్లు తెలిసింది. పత్తనంతిట్ట జిల్లా ఎలాంథూర్‌లో మసాజ్ థెరపిస్టు భగావల్ సింగ్, ఆయన భార్య లైలా కలిసి ఇద్దరు మహిళలను బలి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ దారుణంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితులను రోజలిన్, పద్మగా గుర్తించారు. వారిద్దరినీ కట్టేసి, దారుణంగా హింసించి, గొంతు కోసి హతమార్చినట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాదు వారి రొమ్ములను కోసేశారు. మహిళల రక్తమంతా బయటకు పారితే తమకు మంచి జరుగుతుందని నిందితుల ఆలోచన. పద్మ శరీరాన్ని 56 ముక్కలుగా నరికారంటే వారి రాక్షసత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. బాధితుల శరీర భాగాలను భగావల్ సింగ్ ఇంట్లో మూడు గోతుల్లో పూడ్చిపెట్టగా, పోలీసులు వెలికితీశారు. ప్రధాన నిందితుడు మొహమ్మద్ షఫీ అలియాస్ రషీద్‌కు గతంలో నేర చరిత్ర ఉంది. 75 ఏళ్ల మహిళపై లైంగిక దాడికి పాల్పడినట్లు 2020లో అతడిపై కేసు నమోదయ్యింది. ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉంటున్నాడు. వీధుల్లో లాటరీ టిక్కెట్లు అమ్ముకునే రోజలిన్, పద్మతో ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా పరిచయం పెంచుకున్నాడు. నగ్న చిత్రాల్లో నటిస్తే డబ్బులు ఇస్తానంటూ నమ్మించాడు. భగావల్ సింగ్, లైలా దంపతుల ఇంటికి తీసుకొచ్చాడు. ధనవంతులు కావాలంటే వారిద్దరిని బలి ఇవ్వాలని సలహా ఇచ్చాడు. రోజలిన్ ఈ ఏడాది జూన్ 6న, పద్మ సెప్టెంబర్ 26న హత్యకు గురైనట్లు దర్యాప్తులో వెల్లడయ్యింది. పద్మ ఫోన్ ఉండడంతో షఫీ వద్ద అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా, దారుణం బయటపడింది. భగావల్ సింగ్‌కు కేరళలోని అధికార సీపీఎంతో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే, ఈ ప్రచారాన్ని సీపీఎం ఖండించింది. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి బుధవారం కోర్టులో ప్రవేశపెట్టారు. వారిని జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది.



ల్యాబ్‌లోని మెదడు కణాలూ

వీడియోగేమ్ ఆడేశాయ్

సిడ్నీ: మానవ మేథోశక్తిని ప్రయోగశాలలో పునఃసృష్టి చేసేందుకు ప్రయత్నిస్తున్న పరిశోధకులు ఆ క్రతువులో స్వల్ప విజయం సాధించారు. 1970ల నాటి టెన్నిస్ క్రీడను తలపించే పోంగ్ కంప్యూటర్ వీడియోగేమ్‌ను ప్రయోగశాలలో అభివృద్ధిచేసిన మెదడు కణాలు అర్థంచేసుకుని, అందుకు అనుగుణంగా స్పందిస్తున్నాయి. కొత్త తరం బయోలాజికల్ కంప్యూటర్ చిప్స్ అభివృద్ధి కోసం ఆస్ట్రేలియాలోని కార్టికల్ ల్యాబ్స్ అంకురసంస్థ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. ఇందులోని న్యూరో శాస్త్రవేత్తల బృందం మానవ, ఎదగని ఎలుక నుంచి మొత్తంగా దాదాపు 8,00,000 మెదడు కణాలను ల్యాబ్‌లో పెంచుతోంది. డిష్‌బ్రెయిన్‌గా పిలుచుకునే ఈ మెదడు కణాల సముదాయం ఎలక్ట్రోడ్ వరసలపై ఉంచినపుడు పోంగ్ వీడియోగేమ్‌కు తగ్గట్లు స్పందించిందని పరిశోధనలో భాగస్వామి అయిన డాక్టర్ బ్రెట్ కగాన్ చెప్పారు. ఈ తరహా ప్రయోగం కృత్రిమ జీవమేథో ప్రయోగాల్లో మొదటిది కావడం గమనార్హం. మూర్ఛ, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం సమస్యలను మరింతగా అర్థంచేసుకునేందుకు, భవిష్యత్‌లో కృత్రిమంగా ప్రయోగశాలలోనే జీవమేథ రూపకల్పనకు ఈ పరిశోధన ఫలితాలు ఉపయోగపడతాయని ఆయన చెప్పారు. తదుపరి పరీక్షల్లో తాము మత్తునిచ్చే ఇథనాల్‌ను వాడి కణాల పనితీరు.. మద్యం తాగిన మనిషి 'పనితీరు'లా ఉందో లేదో సరిచూస్తామన్నారు. ఈ పరిశోధన వివరాలు న్యూరాన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



కాంగ్రెస్ అన్నాచెల్లెళ్ల పార్టీ

బీజేపీయే ఏకైక జాతీయ పార్టీ: నడ్డా

ద్వారక: కాంగ్రెస్ కేవలం అన్నాచెల్లెళ్ల పార్టీగా మిగిలిపోయిందని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఎద్దేవా చేశారు. అసలు దేశంలో బీజేపీ మినహా జాతీయ పార్టీలేవీ లేవన్నారు. డిసెంబర్లో అసెంబ్లీ ఎన్నికలున్న గుజరాత్‌లో ద్వారక నుంచి పోరుబందర్ దాకా బీజేపీ రెండో విడత గుజరాత్ గౌరవ్‌యాత్రను బుధవారం ఆయన ప్రారంభించారు. ''దేశం పేరిట కేవలం ఓ వంశాన్ని ప్రమోట్ చేయడం, ఓ కుటుంబానికి సేవ చేయడమే కాంగ్రెస్ నేతల ఏకసూత్ర కార్యక్రమంగా మారింది. ఇక టీఆర్ఎస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ, అకాలీదళ్, జేఎంఎం, పీడీపీ సహా ప్రాంతీయ పార్టీలన్నీ కుటుంబ పార్టీలే. నమ్మిన సిద్ధాంతానికి నిలువెల్లా కట్టుబడ్డ ఏకైక జాతీయ పార్టీ దేశంలో బీజేపీ మాత్రమే'' అని ఈ సందర్భంగా అన్నారు.

షా ఓ జూనియర్: నితీశ్

పట్నా: కేవలం 20 ఏళ్ల క్రితం రాజకీయాల్లోకి వచ్చిన వారి విమర్శలను పట్టించుకోనని కేంద్ర హోం మంత్రి అమిత్ షానుద్దేశిస్తూ బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ వ్యాఖ్యానించారు. సామాజిక ఉద్యమ నేత జయప్రకాశ్ నారాయణ్ సిద్ధాంతాలు ఆచరిస్తానని చెప్పుకునే నితీశ్.. అధికారం కోసం కాంగ్రెస్ ఒళ్లో కూర్చున్నారంటూ అమిత్ చేసిన ఆరోపణలపై బుధవారం ఆయన ఈ మేరకు స్పందించారు.

ఫేస్‌బుక్‌లో అన్‌ఫాలో కలకలం

- భారీగా పడిపోయిన ఫాలోవర్ల సంఖ్య
- జుకర్‌బర్గ్‌కూ తప్పని తిప్పలు

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లో బుధవారం ఉదయం నుంచి కొన్ని గంటల సేపు గందరగోళం నెలకొంది. ఫేస్‌బుక్ వినియోగదారుల ఫాలోవర్ల సంఖ్య రాత్రికి రాత్రి అమాంతంగా పడిపోవడంతో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అనూహ్యంగా భారీ సంఖ్యలో తమ ఫాలోవర్ల సంఖ్య తగ్గిపోతున్నట్టు చాలా మంది వినియోగదారులు ఆందోళన చెందారు. దీనికి కారణాలు తెలీక గగ్గోలు పెట్టారు. చివరికి మెటా కంపెనీ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్‌కు తిప్పలు తప్పలేదు. జుకర్‌బర్గ్‌కు 11.9 కోట్ల మంది ఫాలోవర్లు ఉంటే ఏకంగా 10 వేలకు పడిపోవడంతో కలకలం నెలకొంది. న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్, యూఎస్ఏ టుడే వంటి అమెరికన్ మీడియా ఖాతాల ఫాలోవర్ల సంఖ్య పడిపోయింది. రచయిత్రి తస్లీమా నస్రీన్ ఫాలోవర్ల సంఖ్యపై ఆందోళన చెందుతూ ట్వీట్ చేశారు. 'ఫేస్‌బుక్ సృష్టించిన సునామీతో తొమ్మిది లక్షల మంది ఉన్న నా ఫాలోవర్ల సంఖ్య కేవలం 9,000కు పడిపోయింది. జుకర్‌బర్గ్ ఫాలోవర్లు తగ్గిపోవడం మరీ విడ్డూరం' అని ఆమె ట్వీట్ చేశారు. ఎందరో ప్రముఖుల ఫాలోవర్ల సంఖ్య పడిపోవడంతో ఫేస్‌బుక్ ప్రతినిధులు వినియోగదారులకు క్షమాపణలు చెప్పారు. సాయంత్రానికి అందరి ఖాతాల ఫాలోవర్లు సాధారణ స్థితికి చేరుకోవడంతో నెటిజన్లు ఊపిరిపీల్చుకున్నారు.

ఎందుకిలా జరిగింది ?

ఫేస్‌బుక్‌లో ఫాలోవర్ల సంఖ్య పడిపోవడానికి మెటా సంస్థ ఎలాంటి వివరణ ఇవ్వనప్పటికీ రకరకాల విశ్లేషణలు చేస్తూ నెటిజన్లు పలు పోస్టులు పెట్టారు. ఫేస్‌బుక్‌లో బాట్ అకౌంట్ల ప్రక్షాళనకు దిగడమే దీనికి కారణమని భావిస్తున్నారు. ఈ బాట్ అకౌంట్ల సాయంతో ఆటోమేటిక్‌గా మెసేజ్‌లు పంపడం, ఫాలోవర్ల సంఖ్యను పెంచుకోవడం వంటివి చేయొచ్చు. వీటిని తొలగించే క్రమంలో సాంకేతిక లోపాలు తలెత్తి భారీ గందరగోళానికి దారి తీసిందని కొందరు అభిప్రాయపడ్డారు. ఫేస్‌బుక్‌లో కొత్త అల్గారిథమ్ ప్రయోగించడంతో ఇలా జరిగిందనే అనుమానాలు కొందరు వ్యక్తంచేశారు.



నాట్య కళా కౌముది కూచిపూడి

విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. -8లో▸



సమాచార కేంద్రం సందర్శన

ఇథియోపియా దేశ వ్యవసాయ మంత్రి మెలెస్ మెకోనెస్ ఐమర్ నేతృత్వంలోని నిపుణుల బృందం గన్నవరంలోని సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని సందర్శించింది. -8లో▸



ఆడపడుచుల సంబరం

సాక్షి నెట్‌వర్క్: గౌరీదేవికి అత్యంత ప్రీతిపాత్రమైన అట్లతద్ది వేడుకలను బుధవారం రెండు జిల్లాల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉయ్యాలలో మహిళలు, చిన్నారులు ఊగుతూ సందడి చేశారు.

న్యూస్‌రీల్

15న రగ్బీ సబ్ జూనియర్స్ జిల్లా జట్లు ఎంపిక

గన్నవరం: ఉమ్మడి కృష్ణాజిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన సబ్ జూనియర్స్ బాలుర, బాలికల రగ్బీ జిల్లా జట్లను స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్ ప్రాంగణంలో ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొరగంజి జగన్, ఎస్. చంద్రకళ బుధవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2009, 2010 సంవత్సరాల్లో జన్మించిన బాలబాలికలు ఈ సెలక్షన్స్‌కు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్‌కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రాలతో శనివారం ఉదయం 10 గంటల లోపు హాజరుకావాలని సూచించారు. ఇతర సమాచారం కోసం ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. రాంబాబు(9948776941)ను సంప్రదించాలని ఆయన కోరారు.

డీపీఎస్‌కు ఉత్తమ పాఠశాల అవార్డు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జాతీయ స్థాయిలో ఉత్తమ పాఠశాల అవార్డును సాధించిందని పాఠశాల ప్రోవైస్ చైర్మన్ పరిమి నరేంద్రబాబు బుధవారం తెలిపారు. పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్‌చంద్ ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం నరేంద్రబాబు మాట్లాడుతూ పాఠశాల స్థాపించిన నాటి నుంచి వరుసగా డే కమ్ బోర్డింగ్ స్కూల్ విభాగంలో అగ్రస్థానాన్ని సాధిస్తుందని తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఉత్తమ పురస్కారాన్ని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎడ్యుకేషన్ వరల్డ్, ది హ్యూమన్ డెవలప్‌మెంట్ మ్యాగజైన్ దేశంలోని అన్ని పాఠశాలలను సర్వే చేసి గుణగణాలను పరిశీలించి డీపీఎస్‌ను ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసినట్లు వివరించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశానికి నాల్గో విడత అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 తేదీలోగా విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోఈ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకున్న కళాశాలకు విద్యార్థులు స్వయంగా వెళ్లి సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకుని, రశీదు పొందాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలో చేరే విద్యార్థులకు ఈ నెల 21, ప్రైవేటు ఐటీఐల్లో చేరే విద్యార్థులకు ఈ నెల 22వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వివరించారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు వెల్డర్, సూయింగ్ టెక్నాలజీ ట్రేడ్‌లలో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 0866–2475575, 94906 39639, 91602 49343లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

కృష్ణా వర్సిటీకి ఐఎస్‌వో రెన్యూవల్



మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీ ఐఎస్‌వో 9001 – 2015 గుర్తింపు రెన్యూవల్ అయ్యిందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కేబీ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు సంస్థ నుంచి గుర్తింపు పత్రం జారీ కాగా బుధవారం దానిని అందుకున్నారు. వీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీన తనిఖీ బృందం వచ్చి వర్సిటీలో ప్రమాణాలను పరిశీలించిందన్నారు. వర్సిటీ కార్యకలాపాలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఐఎస్‌వో ప్రతినిధుల బృందం.. ఈ మేరకు గుర్తింపు పత్రానికి సిపార్సు చేశారన్నారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టర్ దారపురెడ్డి సూర్యచంద్రరావు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్స్ బాబురెడ్డి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలహోసం



- ఏటేటా పైపైకి వస్తున్న పాతాళ గంగ
- అధిక వర్షాలు, తక్కువ భూగర్భ జలాల వినియోగమే కారణం
- ఎన్టీఆర్ జిల్లాలో 17 మండలాలు సురక్షిత కేటగిరీలోకి..
- మెట్ట ప్రాంత రైతులకు సాంత్వన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో భూ గర్భ జలమట్టం తగ్గేదేలే అంటోంది. ఏటేటా పైపైకి ఉబికివస్తోంది. గత మూడేళ్లుగా పుష్కలంగా వర్షాలు కురవడం, నదులు ఉప్పొంగి ప్రవహించడం, జలాశయాలు నిండు కుండలను తలపిస్తుండడంతో భూ గర్భం జలనిధిని సంతరించుకుంది. భూమిలోకి నీరు రీచార్జ్ అవుతూ జలమట్టం స్థాయి అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. ఫలితంగా బోర్లు జలకళను సంతరించుకుంటున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో వర్షాధారం, బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేసే రైతులకు మూడేళ్లుగా పరిస్థితులు అనుకూలిస్తున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జలకళ పథకానికి భూగర్భ జలమట్టం పెరుగుదల ఊతమిచ్చేదిగా ఉంది.

ఇబ్బందులకు చెల్లు..

ఎన్టీఆర్ జిల్లా పూర్తిగా మెట్టప్రాంతం. రైతులు వర్షాధారం, బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. వర్షాలు సక్రమంగా లేకపోతే రైతులు పైర్లు వేసే పరిస్థితి ఉండదు. కొన్నేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ఈ ప్రాంతంలో వర్షాలు లేకపోవడం, భూ గర్భ జలమట్టం పడిపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. వందల అడుగుల లోతులో తవ్విన బోర్లు సైతం ఎండిపోయాయి. గడచిన మూడేళ్లు వర్షాలు పుష్కలంగా కురుస్తున్నాయి. భౌగోళికంగా జిల్లాకు ఓ వైపు కృష్ణానది, రెండు వైపులా కట్టలేరు, వైరాయేరు, మున్నేరుతో పాటు పలు వాగులు ప్రవహిస్తుండడంతో భూ గర్భ జలమట్టం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది రుతుపవనాలకు ముందు జిల్లాలో సగటు జలమట్టం 7.11 మీటర్ల నుంచి 4.30 మీటర్లకు చేరింది. జిల్లా సగటు జల మట్టం పెరుగుదల 2.31 మీటర్లుగా నమోదైంది.

అన్నీ సురక్షిత మండలాలే..

భూగర్భ జల అంచనాల కమిటీ(జీఈసీ) ప్రతి రెండేళ్ల కోసారి అంచనాలు రూపొందిస్తుంది. భూమిలోకి ఎంత నీరు రీచార్జ్ అవుతోంది? ఎంత వినియోగిస్తున్నారు? అనే అంచనాలను రూపొందించి స్టేట్ లెవల్ కమిటీకి నివేదిస్తుంది. రీచార్జ్ అవుతున్న నీటిలో 70 శాతం కన్నా తక్కువగా వినియోగించే మండలాలను సురక్షిత కేటగిరీ కింద పరిగణిస్తారు. 70–90 శాతం వినియోగించే మండలాలను సెమీ క్రిటికల్, 90–100 శాతం వినియోగించే మండలాలను క్రిటికల్ కేటగిరీగాను, 100 శాతానికి పైన వినియోగించే వాటిని ఓవర్ ఎక్స్‌ప్లాయిటెడ్ కేటగిరీ మండలాలుగా పరిగణిస్తారు. రీచార్జి అయ్యే మొత్తం కంటే మించి వినియోగించే మండలాలలో భూ గర్భ జల మట్టం పడిపోకుండా పలు చర్యలు తీసుకుంటారు. ఈ వాటర్ ఇయర్‌లో ఇటీవలే ఆ శాఖ అధికారులు అంచనాలు రూపొందించి కమిటీకి పంపారు. ఆ అంచనాల ప్రకారం జిల్లాలోని 17 మండలాలు రీచార్జి అయ్యే నీటిలో 70శాతం కంటే తక్కువ వినియోగించి సురక్షిత కేటగిరీలో ఉన్నాయి. జిల్లాలో చందర్లపాడు మండలంలో అత్యధికంగా భూ గర్భ జలాలను తోడేస్తున్నారు. ఇక్కడ భూ గర్భంలోకి రీచార్జ్ అయ్యే మొత్తంలో 54 శాతం తోడేస్తున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో వత్సవాయి 37 శాతం, ఏ. కొండూరు మండలంలో 36 శాతం వినియోగిస్తున్నారు.

విస్సన్నపేటలో అధికం

జిల్లాలోని 17 మండలాలలో మొత్తం భూగర్భ జల శాఖ 71 పీజోమీటర్లు ఏర్పాటు చేసింది. భూగర్భ జలమట్టం కొలిచేందుకు 2020 నాటికి జిల్లాలో 54 పీజోమీటర్లు ఉండగా, వాటి సంఖ్య ప్రస్తుతం 71 చేరింది. ప్రతి సంవత్సరం మే నుంచి నవంబర్ వరకు రుతుపవనాలకు ముందు, రుతు పవనాల తర్వాత జలమట్టం కొలుస్తారు. అయితే ఈ మూడేళ్ల కాలంలో ప్రతి మండలంలోనూ భూ గర్భ జల మట్టం పెరుగుతుందే తప్ప ఏ మాత్రం తగ్గడం లేదు. జిల్లాలో గరిష్ఠంగా విస్సన్నపేట మండలంలో భూ గర్భజలమట్టం ఈ ఏడాది 5.04 మీటర్లుగా నమోదైంది. తర్వాతి స్థానాల్లో వీరులపాడు 2.97 మీటర్లు, రెడ్డిగూడెం మండలంలో 2.93 మీటర్లు ఉంది.



జాగ్రత్తలు తీసుకోవాలి..

ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో భూ గర్భ జలాలు ఆశాజనకంగా ఉన్నాయి. సగటు భూ గర్భ జలమట్టం పెరిగింది. నిర్దేశించిన శాతం కంటే తక్కువ నీటిని తోడడం ద్వారా జిల్లాలోని అన్ని మండలాలు సురక్షిత కేటగిరీలో ఉన్నాయి. భూ గర్భ జలమట్టం తక్కువగా ఉన్న మండలాల్లో మరింత దిగజారిపోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి.

– బి. నాగరాజు, డీడీ, భూగర్భ జలశాఖ



పుష్కలంగా నీరు వస్తోంది..

వైఎస్సార్ జలకళ పథకంలో బోరు వెల్ మంజూరైంది. 110 అడుగుల నుంచే నీళ్లు పడ్డాయి. మోటార్ 2.5 అంగుళాలు ధారవస్తోంది. పైరుకు సరిపోతుంది. గతంలో ఎక్కడా బోర్‌వెల్ వేసినా లోతుకు రిగ్ వేయాల్సి ఉండేది. బావుల్లో ఎక్కడో అడుగున నీళ్లు ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. మోటార్లు బాగా ఆడుతున్నాయి. బావుల్లోనూ నీరు చేతికందేలా పైకి వచ్చాయి.

– నరెడ్ల శ్రీనివాసరెడ్డి, రైతు, జయంతి, వీరులపాడు మండలం.

కొనసాగుతున్న కానుకల లెక్కింపు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దసరా మహోత్సవాలలో అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు బుధవారం కొనసాగింది. బుధవారం జరిగిన లెక్కింపులో రూ. 1.96 కోట్ల మేర ఆదాయం సమకూరింది. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన కానుకల లెక్కింపులో రెండో విడత రూ. 1,96,61,317 నగదుతో పాటు 245 గ్రాముల బంగారం, 8.375 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో భ్రమరాంబ తెలిపారు. తొలి రోజైన మంగళవారం రూ. 3.95 కోట్ల ఆదాయం లభించగా.. ఇప్పటి వరకు జరిగిన లెక్కింపులో మొత్తం రూ. 5,91,67,817 ఆదాయం సమకూరింది. గురువారం కూడా కానుకల లెక్కింపు కొనసాగుతుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

ఆర్టీసీకి రూ.2.11 కోట్ల అదనపు ఆదాయం

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): దసరా ఉత్సవాలు, సెలవుల సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ఎన్టీఆర్ జిల్లా నుంచి నడిపిన బస్సు సర్వీసుల ద్వారా రూ. 2.11 కోట్ల అదనపు ఆదాయం సమకూరినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. ఏసుదానం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు మొత్తం 919 ప్రత్యేక బస్సులను నడపగా.. వీటిద్వారా పై ఆదాయం వచ్చిందన్నారు.

రైతు కోసం ఎందాకైనా

- నిషేధిత భూముల సమస్య పరిష్కారం చారిత్రాత్మకం
- గత పాలకులు చేయలేని పనిని చేసి చూపిస్తున్న సీఎం జగన్
- అధికారులతో సమీక్షలో రాష్ట్ర మంత్రి జోగి రమేష్
- 20వ తేదీన సీఎం అవనిగడ్డ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, చిత్రంలో కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్సీ తలశిల, ఎస్పీ జాషువా, ఎమ్మెల్యేలు సింహాద్రి, కైలే, తదితరులు

అవనిగడ్డ: ఎన్నో ఉద్యమాలు, పాదయాత్రలు చేసినా గత పాలకులు చేయలేని నిషేధిత భూముల సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించి మరోసారి రైతుల పక్షపాతిగా రుజువు చేసుకున్నారని మంత్రి జోగి రమేష్ అన్నారు. ఈనెల 20వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవనిగడ్డ పర్యటనను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మనటీవీ భవనంలో మంత్రి జోగి రమేష్, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, అవనిగడ్డ, పామర్రు ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్‌కుమార్‌తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఇచ్చిన హామీ మేరకు..

ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ నిషేధిత భూముల సమస్యను పరిష్కరించాలని గతంలో ఆందోళనలు, ఉద్యమాలు చేసినా ఏ ముఖ్యమంత్రి సమస్యను పరిష్కరించే సాహసం చేయలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 21ఏ (1) కింద ఉన్న నిషేధిత భూముల సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. దీనివల్ల 25వేల ఎకరాల భూములకు మోక్షం కలుగుతుందని అన్నారు. సీఎం జగన్ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని వేలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 20వ తేదీన జరిగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీఎంకు కృతజ్ఞతలు..

కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ మొత్తం 25వేల ఎకరాల్లో నిషేధిత భూముల సమస్యను పరిష్కరిస్తుండగా, మన జిల్లాలో 18వేల ఎకరాలు ఉన్నాయని చెప్పారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ రైతులు పడుతున్న ఇబ్బందులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేయగా హామీ ఇచ్చిన విధంగా సమస్యను పరిష్కరించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమస్య పరిష్కారం వల్ల గతంలో ఈ జాబితాలో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

హెలిప్యాడ్‌కు స్థలాల పరిశీలన

హెలిప్యాడ్ కోసం మొత్తం మూడుచోట్ల స్థలాలను పరిశీలించినట్లు కలెక్టర్ చెప్పారు. తొలుత సీఎం సభ జరగనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. జేసీ మహేష్‌కుమార్ రావిరాల, ఎస్పీ జాషువా, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవో కిశోర్‌తో పాటు పలుశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సీఎం సభా వేదిక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

డిసెంబర్ 21న సామూహిక గృహ ప్రవేశాలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): జగనన్న కాలనీల్లోని 5,790 ఇళ్లలో డిసెంబర్ 21న సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించనున్నామని, అందుకనుగుణంగా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాలు, నాడు– నేడు పనుల ప్రగతి, గ్రామ వార్డు సచివాలయ నిర్మాణాలు, స్పందన గ్రీవెన్స్ తదితర అంశాలపై బుధవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాకు సంబంధించిన స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్, హౌసింగ్ ఈఈలు, డీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి డిసెంబర్ 21వ తేదీన సామూహిక గృహ ప్రవేశాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పెద్ద ఎత్తున నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు పాల్గొని సొంత ఇంటి కల నేరవేర్చుకున్న పేదలతో కలిసి ఆనందాన్ని పంచుకోవాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు, హౌసింగ్ అధికారులు, మండల స్థాయి అధికారులు సంయుక్తంగా ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నిరంతర పర్యవేక్షణతో పనులను వేగవంతం చేస్తే సామూహిక గృహ నిర్మాణాల కార్యక్రమాన్ని విజయవంతం చేయగలుగుతామన్నారు. నిర్మాణాల్లో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. లబ్ధిదారులు సంతృప్తి చెందేలా వారి సమక్షంలోనే పనులను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. లేఅవుట్లలో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. ముఖ్యంగా రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నాడు–నేడు, గ్రామ, వార్డు సచివాలయ నిర్మాణ పనులను నిర్దేశించిన గడువులో పూర్తి చేసి ప్రగతి నివేదికలను సమర్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్, డీఆర్వో కె. మోహన్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీదేవి, డీఈఓ సీవీ రేణుక తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో జేసీ, డీఆర్వో

22న న్యాయసేవా సదస్సు



మాట్లాడుతున్న జేసీ శ్రీవాస్ నుపూర్, చిత్రంలో జడ్జి పద్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 22న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక న్యాయ సేవా సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ అన్నారు. ఈ సదస్సు ఏర్పాట్లపై బుధవారం నగరంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జేసీ శ్రీవాస్ నుపూర్, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎ. పద్మ అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ న్యాయ సేవా సదస్సులో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, మాదక ద్రవ్యాల నిరోధకం వంటి పలు అంశాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చిస్తారన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందేలా చూస్తారన్నారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి, చట్టపరమైన సమస్యలను పరిష్కరించడంతో పాటు తగిన న్యాయ సలహాలు అందిస్తారన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఏ. పద్మ మాట్లాడుతూ సదస్సులో మాదకద్రవ్యాల నిర్మూలన, బాధితులకు చట్టపరమైన సేవలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో కె. మోహన్ కుమార్, డీసీపీ మేరీ ప్రశాంతి, డీఈఓ సీవీ రేణుక, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రామకుమార్ పాల్గొన్నారు.

యువ ఆర్కిటెక్ట్‌లకు ఆహ్వానం

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అర్బన్ స్ట్రీట్ ఆర్ట్ కాంపిటీషన్ కోసం యువ ఆర్కిటెక్ట్‌లను ఆహ్వానిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అర్బన్ స్ట్రీట్ ఆర్ట్ పోటీకి దేశవ్యాప్తంగా ఉన్న ఆర్కిటెక్ట్‌ల నుంచి ఈ నెల 30 వరకు దరఖాస్తుల స్వీకరిస్తోందన్నారు. ఇందులో రాష్ట్రం గొప్ప చారిత్రాత్మక, సాంస్కృతిక వారసత్వం, శాస్త్రీయ విజయాలు, భిన్నత్వంలో ఏకత్వం, అభివృద్ధి చెందుతున్న కొత్త ఆంధ్రప్రదేశ్ ఆకాంక్షలను ప్రతిబింబించేలా డిజైన్లు ఉండాలన్నారు. 26 జిల్లాల మేళవింపుతో రూపొందించిన డిజైన్‌కు అత్యుత్తమ బహుమతి అందిస్తామని చెప్పారు. అలాగే ప్రతి డిజైన్‌కు రూ. 50 వేలు కాన్సులేషన్ నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. వివరాలకు అవర్ వీఎంసీ డాట్ ఓఆర్‌జీలో సంప్రదించాలన్నారు.

నేడు బీఎస్ఎన్ఎల్ మెగా మేళా

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లాలో గురువారం బీఎస్ఎన్ఎల్ మెగా మేళా నిర్వహించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ విజయవాడ బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ వై. రవీంద్రనాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మేళాలో బీఎస్ఎన్ఎల్ కొత్త ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బ్యాండ్, ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్‌లతో పాటు ఉచిత సిమ్‌కార్డులు లభిస్తాయన్నారు. బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీలు, ఉచితంగా బీఎస్ఎన్ఎల్ సిమ్‌ను ఇవ్వటంతోపాటు ఆకర్షణీయమైన ఫస్ట్ రీచార్జ్ సదుపాయం కల్పిస్తారన్నారు. ఈ సదవకాశాన్ని ఉమ్మడి కృష్ణా జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. మరింత సమాచారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల్లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

రైల్వేస్టేషన్ టు మంగళగిరి వయా ఉండవల్లి సెంటర్

రేపటి నుంచి ఆర్టీసీ కొత్త సర్వీసు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి మంగళగిరికి వయా ఉండవల్లి సెంటర్ బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం. ఏసుదానం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

- రూట్ నంబర్ 20/47 రైల్వే స్టేషన్ నుంచి బయలు దేరి పండిట్ నెహ్రూ బస్టేషన్, వారధి, ఉండవల్లి సెంటర్, తాడేపల్లి, నులకపేట, డోలస్ నగర్, మంగళగిరి, ఎన్ఆర్ఐ ఆస్పత్రి, వడ్డేశ్వరం మీదుగా తిరిగి వారధి, పండిట్‌నెహ్రూ బస్టేషన్, కాళేశ్వరరావు మార్కెట్ నుంచి రైల్వేస్టేషన్ చేరుతుందన్నారు.
- రూట్ నంబర్ 47/20 రైల్వేస్టేషన్ నుంచి బయలు దేరి పండిట్ నెహ్రూ బస్టేషన్, వారధి, వడ్డేశ్వరం, ఎన్ఆర్ఐ ఆస్పత్రి, మంగళగిరి, డోలస్‌నగర్, నులకపేట, తాడేపల్లి, ఉండవల్లి సెంటర్, వారధి, పీఎన్‌బీఎస్, కేఆర్ మార్కెట్ మీదుగా రైల్వే స్టేషన్ చేరుతుందన్నారు.

సమయాలు ఇలా..

బస్సులు ఈ నెల 14వ తేదీ నుంచి రైల్వేస్టేషన్ వద్ద ఉదయం 5.28, 5.49, 6.03, 6.17 నుంచి ప్రతి 7 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందన్నారు. అలాగే రాత్రి 8.15, 8.36, 9.00, 10.00 గంటలకు చివరి బస్సు బయలు దేరుతుందన్నారు. అదేవిధంగా మంగళగిరిలో ఉదయం 4.45, 5.30, 6.18, 6.39, 6.53, 7.07 నుంచి ప్రతి 7 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందన్నారు. రాత్రి 8.00, 9.05, 9.26లకు చివరి సర్వీసు బయలుదేరుతుందన్నారు. ప్రతిరోజు ప్రయాణించే ప్రయాణికులు రూ.1010తో జనరల్ బస్ పాస్‌ను తీసుకుంటే మంగళగిరి, ఎన్ఆర్ఐ ఆస్పత్రి నుంచి రోజులో ఎన్ని సార్లయిన ప్రయాణించవచ్చన్నారు.

తీరిన మూడు దశాబ్దాల కల

- నివేశన స్థలాలపై హక్కు కల్పిస్తూ డి-ఫామ్ పట్టాలు అందజేత
- నెప్పల్లిలో తొమ్మిది కుటుంబాల్లో ఆనందోత్సాహాలు

కంకిపాడు: మూడు దశాబ్దాలకు పైగా అక్కడి పేదలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. తాము నివాసం ఉంటున్న స్థలంపై సంపూర్ణ హక్కు కల్పిస్తూ డి-ఫామ్ పట్టాలను ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేసింది. ఎమ్మెల్యే పార్థసారథి చొరవతో రెవెన్యూ అధికారులు అవరోధాలను అధిగమించి లబ్ధిదారులకు పట్టాలను అందించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నెప్పల్లి గ్రామంలోని హైస్కూల్ సమీపంలో 13 సెంట్ల పోరంబోకు స్థలం ఉంది. ఈ స్థలంలో పేదలు మూడు దశాబ్దాలకు పైగా నివాసాలను ఏర్పాటుచేసుకుని జీవిస్తున్నారు. తాము నివాసం ఉంటున్న స్థలాలను అప్పగిస్తూ పట్టాలను అందించాలని వారు ఏళ్ల తరబడి ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు స్థలం అవసరమైతే ఎక్కడ తమ స్థలం ఖాళీ చేయిస్తారో...ఎప్పుడు తాము రోడ్డున పడాల్సి వస్తుందోనన్న ఆందోళనతో వారు నిత్యం భయాందోళనల మధ్య జీవించాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న పేదలు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. తమ స్థలాలపై హక్కు కల్పిస్తూ పట్టాలు అందించాలని విజ్ఞప్తిచేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. తహసీల్దార్ టీవీ సతీష్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి నివేదికను ఉన్నతాధికారులకు నివేదించారు. పేదలు నివాసం ఉంటున్న స్థలాలను పక్కాగా సర్వే చేసి డి-ఫామ్ పట్టాలను తయారు చేసి బుధవారం ఎమ్మెల్యే పార్థసారథి చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యే పార్థసారథి, తహసీల్దార్ టీవీ సతీష్ చొరవను ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.


నెప్పల్లిలో లబ్ధిదారులకు డి-ఫామ్ పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

30 ఏళ్ల నాటి కల ఫలించింది



ఒకటి కాదు రెండు కాదు. ముప్పై ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఇప్పటికి మా కల నెరవేరింది. మా స్థలంపై మాకు హక్కు రావటం ఆనందంగా ఉంది. జగనన్న ప్రభుత్వంలో మాకు సంపూర్ణ న్యాయం జరిగింది. మా గోడు విని మా సమస్యకు ఓ పరిష్కారం చూపారు. ఎమ్మెల్యే పార్థసారథి కృషి మర్చిపోలేనిది.

– కొడాలి సావిత్రి, లబ్ధిదారురాలు

చాలా ఆనందంగా ఉంది



ఎన్నాళ్ల నుంచో పట్టాల కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ఇప్పటికి పట్టాలు వచ్చాయి. చాలా ఆనందంగా ఉంది. మేము పడుతున్న ఇబ్బందులను గుర్తించి సమస్యను పూర్తిగా పరిష్కరించారు. ప్రభుత్వానికి మా కృతజ్ఞతలు. మాకు జరిగిన మేలు మర్చిపోలేము.

– వల్లభనేని నాగేశ్వరరావు, లబ్ధిదారు

నాట్య కళా కౌముది కూచిపూడి

రేపటి నుంచి నగరంలో అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవం

విజయవాడ కల్చరల్: కృష్ణాజిల్లాలోని ఒక మారుమూల గ్రామం నేడు అంతర్జాతీయ కీర్తినార్జించిందంటే దానికి కారణం ఆ గ్రామంలో ఉద్భవించిన ఒక కళా ప్రక్రియ. ఆ కళా ప్రక్రియే సంప్రదాయబద్ధమైన కళా రూపమైన కూచిపూడి నాట్యం. స్వతంత్ర భారతావని ఉనికిని నాట్యం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా తెలియపరిచిన విశిష్ట కళారూపం కూచిపూడి నాట్యం. తొలి దశలో యక్షగాన ప్రదర్శనతో ప్రారంభించి తదనంతరం నృత్య నాటికలుగా పరిణామం చెందిన కూచిపూడి నాట్యం నేడు అంతర్జాతీయ స్థాయిలో వెలుగొందుతోంది.

కూచిపూడి నాట్యం నేపథ్యం
ఆంధ్రప్రదేశ్ కళల కాణాచి. సంస్కృతీ సంప్రదాయాలకు పుట్టినిల్లు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కృష్ణా జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. వేదం, అవధానం, సంగీతం, సాహిత్యం, నృత్యం, సినిమారంగం ఒకటేమిటి, సర్వకళల నిలయం. కూచిపూడి గ్రామానికి అనేక పేర్లు ఉన్నాయని చరిత్ర చెబుతోంది. కుశలవపురి, కుచెన్నపూడి, కుచేల పూరిగా పిలువబడిందని అంటారు. 1506 వ సంవత్సరంలో మాచేపల్లి కైఫీయతులోనూ దీని ప్రస్తావన కనిపిస్తుంది.

కూచిపూడి నృత్యరీతికి ఆద్యుడు....
భరతముని నాట్యశాస్త్రంలోని శాస్త్రీయతను ఆధారంగా సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్యానికి రూపకల్పన చేశారు. ఆదిలో కూచిపూడి నాట్యంలో స్త్రీ పాత్రకు సైతం మగవారే నర్తించినా కాలానుగుణమైన మార్పులతో మహిళలు కూడా ఈ రంగంలో ప్రవేశించారు. వీరిలో శోభానాయుడు, మంజుభార్గవి, రాధికారెడ్డి లాంటి వారు కూచిపూడి నాట్యానికి విశేష ప్రాధాన్యత కల్పించారు. 1959 వ సంవత్సరంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ కూచిపూడి నాట్యాన్ని శాస్త్రీయ నృత్యంగా గుర్తించింది. 1963లో ప్రభుత్వం కూచిపూడిలో సిద్ధేంద్రయోగి కళాక్షేత్రం ప్రారంభించి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు.


కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు(ఫైల్)

కూచిపూడి నాట్య కళాకోవిదులు...
వెంపటి చినసత్యం, నటరాజ రామకృష్ణ, వెంపటి పెద సత్యం, వేదాంతం రాఘవయ్య, చింతా వెంకటరామయ్య, వెంపటి లక్ష్మీనారాయణ, భాగవతుల యజ్ఞనారాయణ శర్మ, వేదాంతం రామలింగ శాస్త్రి, భాగవతుల వెంకట్రామ శర్మ, పసుమర్తి వేణుగోపాల శర్మ, వేదాంతం సత్యనారాయణ శర్మ, యామినీ కృష్ణ మూర్తి తదాదిగా ఎందరో నాట్యాచార్యులు కూచిపూడి నృత్య సంప్రదాయానికి ప్రాణప్రతిష్ఠ చేశారు.

అంతర్జాతీయ వేదికపై కూచిపూడి నృత్యం
రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో స్థిరపడిన కళాకారులతో పాటు దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన కళాకారులు, నాట్యాచార్యులు ప్రపంచంలోని అనేక దేశాలలో కూచిపూడి నృత్యాలను ప్రదర్శించి ఈ నాట్యానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తున్నారు.

వెంపటి చినసత్యంకు నివాళిగా...
సేవ్ కూచిపూడి సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యాచార్యుడు వెంపటి చిన సత్యం జన్మదినం (అక్టోబరు 15) పురస్కరించుకుని ఈ నెల 14 వ తేదీ నుంచి మూడు రోజుల పాటు విజయవాడ దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో అంతర్జాతీయ కూచిపూడి నృత్య వేడుకలు నిర్వహిస్తున్నారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కూచిపూడి నాట్యాచార్యులు, శిష్య ప్రశిష్యులు కూచిపూడి నృత్య సంప్రదాయంలో నృత్యాలను ప్రదర్శిస్తారు.


కళాక్షేత్రంలో సిద్ధేంద్రయోగి విగ్రహం

మన సంప్రదాయం కాపాడుకోవాలి



కూచిపూడి సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చాను. మాతామహులు, పితామహులు కూచిపూడి నాట్య సంప్రదాయంలో భాగస్వాములుగా ఉన్నారు. ఉన్నత చదువులు చదువుకున్నా మనదైన జీవకళను రక్షించుకోవడం మన బాధ్యత. భావి తరాలకు కూడా నృత్య సంప్రదాయం అందించాలనే కోరికతో అన్ని తరగతుల వారికి ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు.

– భాగవతుల సౌమ్య(నృత్య కళాకారిణి)

ఏటా నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నాం



కూచిపూడి నాట్య సంప్రదాయం శాస్త్రీయమైనది ఎన్నో కుటుంబాలు తమ జీవితాలను సంప్రదాయ పరిరక్షణ కోసం త్యాగం చేశాయి. ఒకరు కాదు ఇద్దరు కాదు వేలాదిమంది కళాకారులు ఈ పుణ్యభూమిలో తరించారు. దేశంలో ప్రముఖ కళాకారులు ఇక్కడ నాట్యం చేయడానికి ఆసక్తి చూపుతారు. ప్రతి ఏటా నాట్యోత్సవాలు నిర్వహిస్తున్నాం.

– వేదాంతం రాధేశ్యాం కూచిపూడి నాట్యాచార్యులు

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): డబ్బుల వ్యవహారంలో భార్యభర్తలిద్దరి మధ్య వివాదం చోటు చేసుకున్న నేపథ్యంలో వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట గణపతిరావు రోడ్డులో రాధమ్ ఉమామహేశ్వరరావు, మహాలక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. ఉమామహేశ్వరరావు సామారంగం చౌక్‌లోని ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో పనిచేస్తుంటాడు. ఈ నెల బ్యాంక్‌కు చెల్లించాల్సిన డ్వాక్రా డబ్బుల నుంచి ఉమామహేశ్వరరావు కొంత తీసి వాడుకున్నాడు. ఈనెల 8వ తేదీ మహాలక్ష్మి తన తల్లి దేవికి ఫోన్ చేసి లక్ష అప్పు కావాలని అడిగింది. డబ్బులు ఎందుకని ప్రశ్నించగా, తన భర్త డ్వాక్రా డబ్బులు వాడుకుని తిరిగి ఇవ్వలేదని దీంతో ఆందోళనగా ఉందని చెప్పింది. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఉమామహేశ్వరరావు తన అత్త దేవికి ఫోన్ చేసి మహాలక్ష్మి ఇంట్లో ఉరి వేసుకుందని, హాస్పిటల్‌కు తీసుకువెళుతున్నానని చెప్పాడు. ఆసుపత్రికి తీసుకువెళ్లేసరికి మహాలక్ష్మి మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. పిల్లలను బయటకు పంపి మహాలక్ష్మి ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకున్నట్టు స్థానికులు చెబుతున్నారని, మృతురాలి తల్లి దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సమాచార కేంద్రాన్ని సందర్శించిన ఇథియోపియా బృందం

గన్నవరం: ఇథియోపియా దేశ వ్యవసాయ మంత్రి మెలెస్ మెకోనెస్ ఐమర్ నేతృత్వంలోని నిపుణుల బృందం బుధవారం స్థానిక సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని సందర్శించారు. సమాచార కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ ద్వారా రైతులకు అందిస్తున్న సలహాలు, సూచనలు, వాట్సాప్ ఫొటోలు పరిశీలించి ఇస్తున్న సాంకేతిక సలహాలను స్వయంగా పర్యవేక్షించారు. ఆర్బీకే స్టూడియో పనితీరును కూడా పరిశీలించారు. కాల్ సెంటర్‌లోని వివిధ శాఖల శాస్త్రవేత్తలతో సంభాషించారు. సమీకృత రైతు సమాచార కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరి హరికిరణ్, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వి.శ్రీధర్ వివరించారు. ఈ సందర్భంగా ఇథియోపియా దేశ వ్యవసాయ మంత్రి మాట్లాడుతూ సమీకృత సమాచార కేంద్రం పనితీరు చాలా అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఇక్కడి రైతు భరోసా కేంద్రాలతో దృఢమైన అనుబంధం ఏర్పాటు చేసుకోవాలని అభిలషించారు. ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ శేఖర్‌బాబు, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు మునిరెడ్డి, సమాచార కేంద్రం నోడల్ ఆఫీసర్ వై.అనూరాధ, గన్నవరం వ్యవసాయాధికారి ఎస్ఎల్ తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్‌లైన్ల మరమ్మతులు కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఈఈ పి. హరిబాబు తెలిపారు. రామచంద్రానగర్, గణేష్‌నగర్, కరెన్సీనగర్, కనకదుర్గానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

దుర్గగుడికి నాలుగు వీల్‌చైర్లు వితరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే వికలాంగుల కోసం విజయవాడకు చెందిన టాప్‌స్టార్స్ కంపెనీ పేరిట నాలుగు వీల్‌చైర్లను దేవస్థానానికి విరాళంగా అందచేశారు. టాప్‌స్టార్స్‌కు చెందిన తాతినేని శ్రీనివాస్ దంపతులు బుధవారం ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి నాలుగు వీల్‌చైర్లను అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలను అందచేశారు.

ట్రస్టు ద్వారా సాయం

పటమట(విజయవాడ తూర్పు): దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విస్తృతంగా సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్టు ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పేర్కొన్నారు. పటమట 12వ డివిజన్ అయ్యప్ప నగర్‌లో పక్షవాతంతో బాధపడుతున్న మిండ నాగేశ్వరరావుకి ట్రస్ట్ ద్వారా అవినాష్ రూ.10 వేలు విలువ చేసే వీల్ చైర్ అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ భవిష్యత్ లో ఈ కుటుంబానికి ఎలాంటి అవసరం ఉన్న ట్రస్ట్ ద్వారా, ప్రభుత్వం ద్వారా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాగంటి నవీన్ కుమార్, మహమ్మద్ రిజ్వాన్, ధనేకుల రామ కాశేశ్వర రావు, అత్తలూరి బ్రహ్మయ్య, మహమ్మద్ కలీం, శేషారెడ్డి , అబ్దుల్ రహీం, ఎండి పర్వేజ్, త్రిపురనేని చందు, మరియు అయ్యప్ప నగర్ అభివద్ధి సంఘం అధ్యక్షులు గొల్లపల్లి వెంకటేశ్వరరావు, అనుమోలు గిరి పాలొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

పటమట(విజయవాడ తూర్పు): సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని వీఎంసీ అదనపు కమిషనర్ (జనరల్) శ్యామల అన్నారు. వన్‌టౌన్‌లోని గాంధీ మున్సిపల్ హైస్కూల్లో సమాచార హక్కు చట్టం-2005 17వ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎంసీ సిబ్బందికి, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాది సి. వెంకటేశ్వరరావు సమాచార హక్కు చట్టం ఉపయోగాలు వివరించారు. డెప్యూటీ కమిషనర్, సమాచార చట్టం అప్పీలేట్ అధికారి డి. వెంకటలక్ష్మీ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి బడ్డీకొట్టు అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు):నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు చిరు వ్యాపారంతో స్వయం ఉపాధి పొందేలా వైఎస్సార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బడ్డీ కొట్టు అందచేశారు. తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ 8వ డివిజన్ పిటింగెల్ పేట ప్రాంతంలో పర్యటించిన సమయంలో స్వయం ఉపాధికి సాయం చేయమని ఆ ప్రాంతానికి చెందిన పాల్వాయి శ్యామ్ కోరాడు. అవినాష్ ఆదేశాల మేరకు ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్ బుధవారం రూ.15 వేలు విలువ గల బడ్డీకొట్టును శ్యామ్‌కు అందచేశారు.

అడిగిన డబ్బులు ఇవ్వలేదని దాడి

చిట్టినగర్:అడిగిన డబ్బులు ఇవ్వలేదని దాడి చేసి గాయపరచడమే కాకుండా రేకుతో చేతిపై గాయం చేసిన ఇద్దరిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని బ్లాక్ నెం 137లో చెన్నైనాయుడు ప్రభాకర్ కుటుంబం నివాసం ఉంటుంది. ప్రభాకర్ మార్బుల్ పని చేస్తుంటాడు. మంగళవారం రాత్రి కాలనీలో నివాసం ఉండే నాని, దుర్గారావులు ప్రభాకర్‌ను ఆపి డబ్బులు ఇవ్వాలని అడిగారు. అయితే పని డబ్బులు రాలేదని చెప్పగా చెంపపై కొట్టి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం ప్రభాకర్ టీ తాగేందుకు కాలనీలోని గ్రౌండ్ వద్దకు చేరుకోగా, అక్కడ కనిపించిన నానిని రాత్రి ఎందుకు కొట్టారని అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరగగా, అక్కడి నుంచి వెళ్లిపోయిన నాని, దుర్గారావును తీసుకుని వచ్చి ప్రభాకర్‌పై కర్రతో దాడి చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో దేవినేని అవినాష్



వృద్ధురాలికి సంక్షేమ కరపత్రం అందించి మాట్లాడుతున్న అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు):ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని గుణదల ఈఎస్‌ఐ ఆసుపత్రి ప్రాంతంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలు తీరు, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పాలన అందించే దిశగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందించడానికి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని చెప్పారు. వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు సక్రమంగా చేరుతున్నాయని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా 3వ డివిజన్ లో పర్యటిస్తున్నామని, ఎక్కడా ఎంటువంటి ఫిర్యాదులు రాలేదన్నారు. ఒకవేళ అర్హులైన వారికి పథకాలు అమలు కాని పక్షంలో తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని వివరించారు.

తూర్పు ఎమ్మెల్యే కనబడరే..

ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులను తామే చేస్తున్నట్లు ఆర్భాటంగా చెప్పుకుని తిరిగే తూర్పు ఎమ్మెల్యే ఇంటికే పరిమితమయ్యారని విమర్శించారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులతో మౌలిక వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, యూజీడీ వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ ఈ అభివృద్ధి పనులు తామే చేయిస్తున్నట్లు డాబుసరి మాటలు పలుకుతున్నారని దుయ్యబట్టారు. గద్దే రామ్మోహన్ చిల్లర రాజకీయాలు మాని ప్రజా సమస్యల పై దృష్టి పెట్టలని కోరారు. ప్రజా క్షేత్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ కు పెరుగుతున్న ఆదరణకు ఓర్వలేక గద్దే ఇంటికే పరిమితమయ్యారని తెలిపారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైఎస్సార్ సీపీ నాయకులు ఏలూరి శివాజీ, భీమిశెట్టి బాబురావు, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా మెరుగైన సేవలు

కలెక్టర్ ఢిల్లీరావు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక(విజయవాడ తూర్పు):ప్రజలకు మెరుగైన సేవలందించి సచివాలయ వ్యవస్థకు మరింత వన్నె తెచ్చేలా పనిచేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సిబ్బందిని ఆదేశించారు. రాణిగారితోట, 18వ డివిజన్, సిమెంట్ గౌడౌన్స్‌లోని 82, 83 వార్డు సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను ఉంచాలని లక్ష్యంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థపై ప్రజలు ఎంతో నమ్మకం ఉంచారన్నారు. వారి నమ్మకాన్ని మరింత పెంచేలా సిబ్బంది పనితీరు ఉండాలని సూచించారు. స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు సచివాలయ సెక్రటరీలు చర్యలు తీసుకోవాలని కోరారు. 82వ వార్డు సచివాలయం పరిధిలో 405 మంది లబ్ధిదారులకు అమ్మఒడి పథకం మంజూరు కాగా వీరిలో ఇంకా 76 మందికి అమ్మఒడి నగదు జమ చేయకపోవడం సరికాదన్నారు. నగదు జమ చేయకపోవడానికి గల కారణాలతో తక్షణమే నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. చిరువ్యాపారుల పేర్లను సేకరించి జాబితాను సిద్ధం చేయాలన్నారు. బ్యాంకుల ద్వారా జగనన్న తోడు పథకం కింద రుణాలు మంజూరు చేసేలా కృషి చేయాలని సూచించారు. సచివాలయ పరిధిలోని వలంటీర్లతో సమన్వయంతో పనిచేసి ప్రజలకు సేవలందించాలని కోరారు. ప్రజలకు సరైన సమాచారం సచివాలయ సేవలందించడంలో అలసత్వం వహించే వలంటీర్లను తొలగించేందుకు వెనకాడబోమన్నారు. సచివాలయ భవనం ముందు వరద నీరు చేరడాన్ని గమనించి మెరక చేయాలని, పరిసర ప్రాంతంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సెంట్రల్ తహసీల్దార్ వెన్నెల శ్రీను తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని రైల్వే కార్మికుల దీక్ష



డీఆర్‌ఎమ్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న ఆర్‌ఎమ్‌యూ నాయకులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ):ఆలిండియా రైల్వే మెన్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు ఆర్‌ఎంయూ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో రైల్వే కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం డివిజన్ వ్యాప్తంగా అన్ని బ్రాంచ్ కార్యాలయాల ఎదుట నిరాహార దీక్షలు చేపట్టారు. అందులో భాగంగా ఆర్‌ఎంయూ విజయవాడ డివిజనల్ సెక్రటరీ జీఎస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్మికులు డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టి తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మిలిటరీ విభాగం తరువాత అహోరాత్రులు ఎండనక వాననక 24 గంటలూ పని చేస్తూ రైల్వేను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరారు. 40 సంవత్సరాలపాటు రైల్వేకి సేవ చేసి పదవీ విరమణ తరువాత ఎటువంటి కనీస పెన్షన్ గ్యారంటీ ఇవ్వని నూతన పెన్షన్ విధానంతో కార్మికులు నష్టపోతున్నారని వాపోయారు. 2004 తరువాత నుంచి రైల్వేలో చేరిన రైల్వే కార్మికులందరికీ భేషరతుగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రైల్వేలో లక్షల సంఖ్యలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని తెలిపారు. పెరుగుతున్న ట్రాక్‌లు, రైళ్లకు తగ్గట్టుగా సిబ్బందిని నియమించాలని, సరైన పదోన్నతి అవకాశాలు లేని సీనియర్ సూపర్‌వైజర్లకు గ్రేడ్ పే ఇవ్వాలని, సేఫ్టీ విభాగంలోని కార్మికులకు రిస్క్ అలవెన్సును చెల్లించాలని, కరోనా కాలములో నిలిపివేసిన 18 నెలల డీఏ, నైట్ డ్యూటీ అలవెన్స్ బకాయిలు చెల్లించాలని , రైల్వే లో ప్రైవేటీకరణ, రైల్వే ఆస్తుల అమ్మకం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే దేశవ్యాప్తంగా పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఆర్‌ఎమ్‌యూ జోనల్ వైస్ ప్రెసిడెంట్ లీలా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్‌ఎం లక్ష్మీ, డివిజనల్ నాయకులు రామగుప్తా, శ్రీనివాస్, బ్రాంచ్ నాయకులు వెంకటేశ్వరరావు, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ):తన భర్త కనిపించడం లేదంటూ భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదు చేశారు. కొత్తూరు తాడేపల్లికి చెందిన సోమిశెట్టి వెంకట నాగ మల్లికార్జునరావు, నీరజ భార్యాభర్తలు. వీరికి వివాహమై 11 సంవత్సరాలు అవుతుంది. నాగమల్లికార్జునరావు హోటల్‌లో పని చేస్తుంటాడు. ఈ నెల 1వ తేదీన తన ఫ్రెండ్‌ని రైలు ఎక్కించి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన నాగ మల్లికార్జునరావు తిరిగి రాలేదు. దీంతో భార్య నీరజ బంధువులు, స్నేహితుల ఇంట విచారించినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

బాలికా వికాస ప్రాధాన్యంపై ర్యాలీ

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలికల వికాసానికి ప్రాధాన్యత నివ్వాలని కాకరపర్తి భావనారాయణ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ అన్నారు. ఆ కళాశాల జాతీయ సేవా పథకం, ఉమెన్స్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహనా ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన పీఎల్ రమేష్ మాట్లాడుతూ సమాజంలో నేటికీ బాలికల పట్ల వివక్షత కొనసాగుతుందని చెప్పారు. ఆడపిల్ల పుట్టడం వలన ఏదో నష్టం జరిగిపోతుందనే భావజాలం ఇంకా సమాజంలో బలంగా ఉందన్నారు. ఆ అనుమానాల నుంచి సమాజం బయటకు రావాలన్నారు. బాలలైన, బాలికలైనా ఒకటేనని తెలిపారు. బాలికల వికాసానికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపడుతుందని పేర్కొన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మారుతున్న కాలానుగుణంగా ప్రజల ఆలోచనల్లోనూ మార్పు రావాలన్నారు. బాలికలు సమాజంలో మరింత అభివృద్ధిని సాధించేందుకు అందరూ తోడ్పాటునందించాలన్నారు. కళాశాల ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల కొనసాగుతున్న వివక్షతపై మరింత చర్చ జరగాలన్నారు. అందులో భాగంగానే బాలికా దినోత్సవం వంటి కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. అనంతరం పాతబస్తీ వీధుల మీదుగా విద్యార్థినుల ర్యాలీ ముందుకు సాగింది. మరో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు వీఏస్రావు, డి.పవన్‌కుమార్ తదితరులున్నారు.

విద్యా వ్యవస్థకు ప్రాణం పోస్తున్న సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న మారేష్

పటమట(విజయవాడ తూర్పు): నాడు నేడు ద్వారా విద్యా వ్యవస్థకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రాణం పోస్తున్నారని, దీని ద్వారా పాఠశాలల స్వరూపం పూర్తిగా మారిపోయిందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ అన్నారు. పటమట ఆర్టీసీ కాలనీలోని సంస్థ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మారేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల స్థాయిని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పెంచిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టి బలహీనవర్గాల విద్యాపరంగా ముందుకెళ్లాలని సంకల్పంతో పాలన సాగిస్తున్నారన్నారు. వైద్య రంగానికి ప్రాధాన్యం ఇస్తూ 16 మెడికల్ కళాశాలలకు అనుమతులు తీసుకురావడమే కాకుండా శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. విద్యావ్యవస్థకు ప్రాణం పోస్తున్న పరిస్థితులను జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని, ప్రజలందరూ దీనిని గమనించాలని కోరారు.

కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేములు బేబీ రాణి, బీసీ సంఘం ప్రచార విభాగం చైర్మన్ జక్కా శ్రీనివాసరావు, ఆంజనేయులు, సుబ్బారావు, అశోక్‌కుమార్, చైతన్య, రాము తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌డీఆర్‌ఎఫ్ సౌత్ సెంట్రల్ జోన్ యోగా పోటీలు



నృత్య యోగా పోటీల్లో పాల్గొన్న ఎన్‌డీఆర్‌ఎఫ్ జవాన్లు



యోగాసనాల పోటీల్లో పాల్గొన్న జవాన్లు

గన్నవరం రూరల్: జాతీయ విపత్తుల స్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో గన్నవరం మండలం కొండపావులూరులో రెండు రోజులపాటు జరిగిన సౌత్, సౌత్ సెంట్రల్ జోన్‌ల యోగాసనాలు, వన్ మినిట్ డ్రిల్ పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలకు కమాండెంట్ జాహిద్ ఖాన్ బహుమతులు ప్రదానం చేశారు. యోగా పోటీల్లో నాలుగు టీమ్‌లు పాల్గొన్నాయి. ఐదు రకాలైన యోగాసనాల్లో పోటీలు జరిగాయి. మొదటి బహుమతి పదో బెటాలియన్(విజయవాడ) సాధించింది. రెండో బహుమతి నాలుగవ బెటాలియన్(తమిళనాడు) సాధించింది. వన్ మినిట్ డ్రిల్‌లో పదో బెటాలియన్(విజయవాడ) ప్రథమ బహుమతి సాధించగా మూడవ బెటాలియన్(ఒడిస్సా) రెండో స్థానంలో నిలిచింది. క్రీడాకారుల స్ఫూర్తిని కమాండెంట్ అభినందించారు. క్రీడాకారులందరూ భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. యోగాసన, కళాత్మక, కళాత్మక జంట, రిథమిక్, యోగా నృత్య యోగా పోటీలు జరిగాయి. ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు సెకండ్ కమాండెంట్ నిరంజన్ సింగ్, డిప్యూటీ కమాండెంట్‌లు జప్రుల్ ఇస్లాం, సుభేందు దత్తా, అఖిలేష్ చౌబే, అసిస్టెంట్ కమాండెంట్‌లు పవన్ కుమార్ యాదవ్, మహ్మద్ అస్లాం, ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



రైల్వేట్రాక్ వద్ద ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. 30 వ డివిజన్ కార్పొరేటర్ భీమిరెడ్డి శివ వెంకట జానారెడ్డితో కలిసి రామకృష్ణాపురం, దేవినగర్ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పూడుకుపోయిన డ్రెయిన్ పైపులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. రైల్వే శాఖ ఈ ప్రాంతంలో పైపుల ఏర్పాటుకు అనుమతించనందున పరిసర ప్రాంతాల వారంతా వర్షం నీటితో ముంపుకు గురవుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ మరోమారు రైల్వే అధికారులను సంప్రదించి చర్యలు తిసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

అనంతరం ఆయన దేవినగర్, బుడమేరు కట్ట పై ఇంకా తొలగించాల్సిన ఆక్రమణలు గుర్తించి వాటిపై చర్యలు తీసుకోనవాల్సిందిగా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి డోర్ టు డోర్ చెత్త సేకరణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రధాన వీధుల్లో రోడ్ ఊడ్చిన వెంటనే అంతర్గత రోడ్లు శుభ్ర పరచి 100 శాతం నివాసాల నుంచి చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య సిబ్బంది ఆదేశించారు. సైడ్ డ్రెయిన్లలో మురుగునీటి పారుదలకు అవరోధకరంగా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. ఈఈ శ్రీనివాస్, శానిటేషన్ సిబ్బంది , అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గోడ కూలిన ప్రదేశం పరిశీలన



గోడ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్

గుణదల (విజయవాడ తూర్పు): కొండ ప్రాంత ప్రజలకు వసతులు కల్పించే దిశగా చర్యలు చేపడతామని 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్ అన్నారు. డివిజన్ పరిధిలోని క్రీస్తురాజపురం కొండ ప్రాంతంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆర్సీఎం చర్చి ఎగువ భాగంలో అడ్డ రోడ్డు కుంగిపోయిందన్నారు. ఈ కారణంగా ఓ ఇల్లు పాక్షికంగా దెబ్బతిందని తెలిపారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం గానీ, ఆస్తి నష్టం గానీ కలగలేదని తెలిపారు. వర్షాకాలం కొండ ప్రాంతాల్లో కొండ చరియలు పడటం, గోడలు కూలిపోవడ సాధారణంగా జరుగుతాయని పేర్కొన్నారు. కానీ భవిష్యత్ లో ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా కొండ పై భాగంలో కాలిబాటలు, మెట్ల మార్గాలు అభివృద్ధి చేస్తామని చెప్పారు. డివిజన్ అధ్యక్షుడు మట్టా ప్రసాద్, స్థానిక నాయకులు లామ్ కిరణ్, ఒగ్గు విఠల్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి



డాక్టర్ లింగయ్యను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సునీత, రమణ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫార్మసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని జాతీయ పరిశోధనా సంస్థ సీఎస్ఐఆర్ ల్యాబ్స్ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ లింగయ్య అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్, కెరీర్ అవకాశాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లింగయ్య ప్రభుత్వం ఏ అంశాల్లో పరిశోధనలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందో విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థి దశలోనే పరిశోధనలపై పట్టు సాధించాలని సూచించారు. మరో అతిథి విజయవాడలోని స్వస్థిక్ ఫార్మలేషన్స్ ఎండీ డి.తరుణ్‌శివకుమార్ మాట్లాడుతూ విద్య పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా నూతన ఆలోచనలతో కంపెనీలు స్థాపించి ఇతరులకు అవకాశాలు కల్పించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత, ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి.రమణ, ఇతర అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థరైటీస్‌పై అవగాహన అవసరం



రోగులకు పరీక్ష చేస్తున్న డాక్టర్ నిహారిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆర్థరైటీస్‌పై అవగాహనతో తొలిదశలో గుర్తిస్తే సరైన చికిత్సతో అదుపులో ఉంచడం సాధ్యమేనని రుమటాలజిస్టు డాక్టర్ డి.నిహారిక అన్నారు. ప్రపంచ ఆర్థరైటీస్ డేను పురస్కరించుకుని సూర్యారావుపేటలోని అను ఆస్పత్రిలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిహారిక మాట్లాడుతూ ఒకటి, అంతకంటే ఎక్కువ కీళ్ల దగ్గర నొప్పి, వాపు, అవి గట్టిగా మారడాన్ని, కీళ్లలో కదలిక తగ్గడాన్ని ఆర్థరైటీస్ లక్షణాలుగా తెలిపారు. తగిన సమయంలో చికిత్స తీసుకోవడం ద్వారా సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ఆర్థరైటీస్ కారణంగా కొందరిలో చూపుపోవడం, గుండెపోటు, పక్షవాతం, మూత్రపిండాలు దెబ్బతినే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ దుర్గా నాగరాజు, డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

బాలుర జువైనల్ హోంలో సౌకర్యాల పరిశీలన



రామమోహన్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న పద్మ

భవానీపురం(విజయవాడ పశ్చిమ):విద్యాధరపురం కబేళారోడ్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం (జువైనల్ హోమ్)లోని బాలురకు కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి (సీనియర్ సివిల్ జడ్జి, మచిలీపట్నం) పద్మ వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. హోమ్‌ను బుధవారం సందర్శించిన ఆమె బాలురకు అందుతున్న న్యాయ సేవలు, వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి పర్యవేక్షణాధికారి రామమోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. బాలురతో మాట్లాడి వారి రికార్డులను పరిశీలించారు. హోమ్‌లోని లైబ్రరీలోగల పుస్తకాలను పిల్లలతో చదివించారు. ఈ సందర్భంగా బాలురు తయారు చేసిన క్రాఫ్ట్ వర్క్స్‌ను ఆసక్తిగా తిలకించి వారిని ప్రశంసించారు. ప్రొహిబిషన్ అధికారి హసన్ అలీ బేగ్, హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జోనల్ వర్క్‌షాప్‌లో జనతా గ్యారేజీ సదస్సు

భవానీపురం:ఏపీఎస్‌ఆర్టీసీ విజయవాడ జోన్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు విద్యాధరపురం ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లో జనతా గ్యారేజీ సదస్సు నిర్వహించనున్నట్లు జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐ యాజమాన్యాలు, హైర్ బస్ యజమానులు, గ్యారేజి మెకానిక్‌లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొనాలని కోరారు.

చెత్త వేస్తే జరిమానా

పటమట(విజయవాడ తూర్పు): వ్యర్థాలను కాల్వల్లో వేస్తున్న పలువురికి వీఎంసీ అధికారులు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. బుధవారం దుర్గాపురం, అల్లూరిసీతరామ రాజు, సాంబమూర్తి రోడ్డులో రైవస్ కాల్వలో చెత్త, వ్యర్థ పదార్థాలు వేస్తున్న వారిని వీఎంసీ ప్రజారోగ్య విభాగం సిబ్బంది గుర్తించి అడ్డుకున్నారు. కొంతమందికి జరిమానా విధించారు.



శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం జేఆర్‌పురంలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



చిత్తూరు జిల్లా సామిరెడ్డిపల్లెలో సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప

మీ వెంటే మేమంతా

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తోన్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ప్రజా సంక్షేమానికై అహర్నిశలూ శ్రమిస్తున్న జగనన్న వెంటే తామంతా నడుస్తామని నాయకులతో ప్రజలు చెబుతున్నారు. అన్ని జిల్లాల్లో బుధవారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించారు.



తూర్పుగోదావరి జిల్లా చిన్నాయగూడెంలో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

సీఎస్‌కు అమరావతి జేఏసీ నేతల వినతి

సాక్షి, అమరావతి: పెండింగ్ ఉన్న డీఏలు, రెండు కొత్త డీఏలు, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని అమరావతి జేఏసీ చైర్మన్, ప్రధాన కార్యదర్శి బొప్పరాజు వెంకటేశ్వర్లు, వైవీ రావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మను కోరారు. సచివాలయంలో బుధవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన పాత మూడు డీఏల చెల్లింపునకు ఉత్తర్వులు ఇచ్చినా చెల్లించలేదని చెప్పారు.

ధాన్యం సేకరణకు సమాయత్తం చేయాలి

పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి: ఖరీఫ్ ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో సిబ్బందిని సమాయత్తం చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్‌తో కలిసి 26 జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవంబర్ మొదటి వారంలో ధాన్యం సేకరణ చేపడతామన్నారు. ముందుగానే రైతులు ఈ క్రాప్ చేసుకోవాలని, కొనుగోళ్లు ప్రారంభమైన తర్వాత నమోదుకు అవకాశం ఉండదనే విషయంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్బీకేల పరిధిలోని సేకరణ లక్ష్యం ప్రకారం ముందుగానే గోనె సంచులు, హమాలీలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మధ్యవర్తులు, దళారీలను నియంత్రిస్తూ.. పంట పొలం నుంచి మిల్లు వరకు తరలించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. దీనిని ఆర్బీకేలోని సిబ్బంది, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) సమర్థవంతంగా నిర్వహించేలా జేసీలు దిశానిర్దేశం చేయాలని సూచించారు.

ఆగని వానలు

▶ మొదటి పేజీ తరువాయి

కురుస్తూనే ఉండటంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చాలావరకు చెరువులు నిండిపోయాయి. అనంతపురం నగరాన్ని వరద చుట్టుముట్టింది. వందలాది ఇళ్లలోకి మోకాళ్ల లోతు నీళ్లు రావడంతో లోతట్టు ప్రాంతాల జనం విలవిల్లాడుతున్నారు. నగరంలో మూడు పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి బాధితులను వాటిలోకి తరలిస్తున్నారు. అనంతపురం, రాప్తాడు ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, కలెక్టర్ నాగలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు అనంతపురంలో సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. వరద బాధితులకు రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు భోజనం, మంచినీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. అగ్నిమాపక సిబ్బంది రబ్బర్ బోట్ల ద్వారా వరదల్లో చిక్కుకున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు.



అనంతపురంలోని గౌరవ గార్డెన్ వెనుక ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టిన వరద

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ఉద్ధృతి రోజురోజుకు పెరుగుతోంది. బుధవారం సాయంత్రం సమయానికి జూరాల, సుంకేసుల నుంచి 1,57,051 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. జలాశయం రెండు గేట్ల ద్వారా 55,966 క్యూసెక్కులు, కుడి, ఎడమగట్టు కేంద్రాల్లో విద్యుదుత్పాదన అనంతరం 66,120 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 6,333 క్యూసెక్కులు, హంద్రీ-నీవా సుజల స్రవంతికి 338 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 600 క్యూసెక్కులు వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 884.80 అడుగుల మట్టంలో 214.8450 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నాన్‌వర్కింగ్ లీజుల్లో నెలరోజుల్లో మైనింగ్ మొదలవ్వాలి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నాన్‌వర్కింగ్ లీజుల్లో నెలరోజుల్లో మైనింగ్ పనులు ప్రారంభం కావాలని రాష్ట్ర గనులు, అటవీ, పర్యావరణ, ఇంధన, శాస్త్ర-సాంకేతిక శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం సచివాలయంలో గనులు, పర్యావరణ శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ ఖనిజాలకు సంబంధించి చాలాచోట్ల లీజుదారులు మైనింగ్ కోసం దరఖాస్తు చేసుకుని, వాటిని ఆపరేషన్‌లోకి తీసుకురాకుండా జాప్యం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 2,819 మైనింగ్ లీజులు వర్కింగ్‌లో, 2,724 మైనింగ్ లీజులు నాన్ వర్కింగ్‌గా ఉన్నాయని తెలిపారు. అన్ని లీజుల్లో ఆపరేషన్స్ ప్రారంభించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా 534 నాన్ వర్కింగ్ లీజుల్లో మైనింగ్ ప్రారంభమైందని చెప్పారు. పర్యావరణ అనుమతులు రాకపోవడం వల్లే మైనింగ్ ప్రారంభించలేకపోతున్నామని లీజుదారులు చెబుతున్నారన్నారు. పర్యావరణ, అటవీ శాఖాధికారులు ఆ దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న అన్ని లీజులకు నిర్దిష్ట కాలపరిధిలో అనుమతులు జారీచేయాలని ఆదేశించారు. ఇందుకోసం మైనింగ్, పర్యావరణ, అటవీ శాఖలు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. పర్యావరణ అనుమతుల కోసం ఎక్కడెక్కడ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలో గుర్తించి, రెవెన్యూ అధికారుల సమన్వయంతో వెంటనే ఆ ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. అన్ని మైనింగ్ క్వారీల్లో ఆపరేషన్స్ ప్రారంభమైతే పరిశ్రమలకు అవసరమైన ఖనిజాలు అందుబాటులోకి వస్తాయని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, ప్రభుత్వానికి మైనింగ్ రెవెన్యూ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (పర్యావరణం) నీరబ్‌కుమార్‌ప్రసాద్, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, డైరెక్టర్ వి.జి.వెంకటరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ సామాజిక న్యాయం

- సంక్షేమ పథకాలతో బీసీలకు అత్యధికంగా లబ్ధి: సజ్జల
- మాట ప్రకారం బీసీ డిక్లరేషన్ అమలు చేసిన సీఎం జగన్
- బీసీ వెల్ఫేర్ జేఏసీ ఆధ్వర్యంలో తాడేపల్లిలో రౌండ్ టేబుల్ భేటీ



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సజ్జల

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సామాజిక న్యాయం సంపూర్ణంగా అమలవుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. సామాజిక న్యాయానికి కట్టుబడి అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బీసీలను ఎన్నికల ఓటు బ్యాంకుగా మాత్రమే చూసి కులవృత్తులకే పరిమితం చేశారని విమర్శించారు. బుధవారం తాడేపల్లిలోని సీఎస్ఆర్ హోటల్‌లో బీసీ వెల్ఫేర్ జేఏసీ అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీల సాధికారత, సంక్షేమంపై విద్యావేత్తలు, మేధావులు, బీసీ నాయకులు చర్చించారు. ఏ పార్టీలోనూ లేనివిధంగా నలుగురు బీసీలకు సీఎం జగన్ రాజ్యసభ సభ్యులుగా అవకాశం కల్పించటాన్ని అభినందించారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, జేఏసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, బీసీ సంఘాల నేతలు ఇందులో పాల్గొన్నారు. కాటికాపరి, కుమ్మరి, రజక, ముదిరాజ్, నాయీబ్రాహ్మణ తదితర బీసీ కులాలకు సంబంధించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రాలు అందించారు. వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు చిల్లపల్లి మోహన్‌రావు, నవరత్నాల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి, బీపీమండల్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సజ్జల మాట్లాడారు.

మూడేళ్లలోనే సాధికారత..

బీసీల సాధికారతకు వైఎస్సార్ హయాంలో తొలి అడుగు పడింది. అదేబాటలో సీఎం జగన్ నడుస్తున్నారు. ఈ రోజు మా పార్టీ సభల వేదికలపై సగానికిపైగా బీసీ నేతలే ఉంటున్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ డిక్లరేషన్ ప్రకటించినప్పుడు ఎన్నికల జిమ్మిక్కులంటూ కొన్ని పార్టీలు విమర్శించాయి. రిజర్వేషన్లు అమలు చేయడం పెద్ద పరీక్ష. అనుకున్న దానికంటే ఎక్కువ శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కింది. బీసీల సాధికారతకు నాడు వైఎస్సార్, నేడు సీఎం వైఎస్ జగన్ న్యాయం చేకూర్చారు. వెనుకబాటుకు గురైన ఎంబీసీలు ఈరోజు ఉనికి చాటుకుంటూ సొంత కాళ్లపై నిలబడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం జగన్ చేపట్టిన సంస్కరణలు, పథకాలు, ఆలోచన విధానాలతో సాధికారతను పదేళ్లకు బదులుగా మూడేళ్లలోనే సాధించారు. మంత్రివర్గంలో సీఎం జగన్ బీసీలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. తిరుపతి, విజయవాడ, విశాఖ మేయర్లుగా బీసీ మహిళలే ఉన్నారు. బీసీలలో 139 కులాలకు సంబంధించి దాదాపు 56కిపైగా బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేశారు. అమ్మఒడి, చేయూత, నేతన్న నేస్తం, ఆసరా, విద్యాదీవెన, విదేశీవిద్య తదితర పథకాల ద్వారా బీసీ వర్గాలకు అత్యధికంగా లబ్ధి చేకూరుతోంది.

బీసీలకు ఎనలేని ప్రోత్సాహం:

జంగా కృష్ణమూర్తి, శాసనమండలి విప్

బీసీలను దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం జగన్ ప్రోత్సహిస్తున్నారు. రాజకీయంగా, సామాజికంగా, విద్యాపరంగా, పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహిస్తున్న సీఎం జగన్‌కు బీసీలంతా అండగా ఉంటారు.

టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ అరెస్ట్

సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన కేసులో అరెస్టు చేసిన సీఐడీ

సాక్షి, అమరావతి: సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తూ పోస్టులు పెట్టిన కేసులో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోని మీడియా కో ఆర్డినేటర్ దారపునేని నరేంద్రను సీఐడీ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. దుబాయి నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తున్న ఒక మహిళను గన్నవరం విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు సెప్టెంబరు 9న అరెస్టు చేశారు. ఆమె ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారి భార్య అంటూ కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారు. 'సీఎంవోలోని ఓ కీలక అధికారి భార్య దుబాయి నుంచి అక్రమంగా బంగారం తీసుకువస్తూ గన్నవరం విమానాశ్రయంలో పట్టుబడ్డారు. ఆమెతోపాటు ఎయిర్ ఇండియా సిబ్బందిని కస్టమ్స్ అధికారులు విచారిస్తున్నారు..' అంటూ ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారు. వాస్తవానికి ఆ మహిళ ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఏ అధికారి కుటుంబసభ్యురాలు కాదు. కానీ ముఖ్యమంత్రి కార్యాలయ ప్రతిష్టను దెబ్బతీసేందుకే సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారు. దీనిపై సీఐడీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియా కో ఆర్డినేటర్ దారపునేని నరేంద్ర కూడా ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసినట్టు సీఐడీ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. నరేంద్ర స్వయంగా దుష్ప్రచార పోస్టులు పెట్టడమే గాక ఆ పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యేలా సూపర్ స్ప్రెడర్‌గా వ్యవహరించారని, కుట్రపూరితంగానే ఇదంతా చేశారని తేలింది. దీంతో అతడిపై క్రైమ్ నంబర్ 61/22 కింద సీఐడీ అధికారులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇదే అంశంపై సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేసినందుకు జర్నలిస్ట్ అంకబాబును సీఐడీ అధికారులు ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

రేపటిలోగా ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో రైతులు పంట బీమా పథకం ద్వారా నష్ట పరిహారం పొందేందుకు తాము సాగుచేస్తున్న పంటలకు సంబంధించి ఈనెల 14వ తేదీలోగా ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ-క్రాప్ నమోదు ప్రక్రియపై కలెక్టర్ జిల్లాకు చెందిన వ్యవసాయ అధికారులతో బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతాంగం పండించే పంటలకు సంబంధించి ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల వలన ఎదురయ్యే పంట నష్టాలకు నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం రైతు పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. వ్యవసాయ అధికారులు రైతు భరోసా కేంద్రాల పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు చేపట్టిన పంటలను ఈ-క్రాప్ విధానంలో నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత అనుభావాలను దృష్టిలో పెట్టుకుని ఏ రైతు తనకు పంటల బీమా పథకం ద్వారా పరిహారం పొందలేకపోయాననే ఫిర్యాదులు లేకుండా ఈ-క్రాప్ నమోదు చేయాలన్నారు. రైతులు కూడా వారు చేపట్టిన పంటకు సంబంధించి పంట వివరాలను రైతు భరోసా కేంద్రాలలో.. బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా నమోదు చేసుకుని రశీదు పొందాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి సుమారు 3,53,306 ఎకరాలలో రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు కేవలం 60 శాతం మంది రైతులు మాత్రమే ఈ-క్రాప్ విధానంలో పంటలను నమోదు చేసుకుని బయోమెట్రిక్ ధ్రువీకరణ పొందారన్నారు. మిగిలిన రైతులు ఈనెల 14వ తేదిలోపు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాలలో వారి పంటల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు.పరిహారం పొందేందుకు, రైతులు పండించిన పంటలను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసేందుకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి చేయడం జరిగిందన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసిన ప్రతి రైతు నుంచి ప్రభుత్వం పంటలను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించడం జరుగుతుందన్నారు. ఈనెల 17వ తేదిన ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులు, పంటల వివరాల జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వ్యవసాయశాఖ అధికారి ఎం.విజయభారతిని ఆదేశించారు.

అసమానత్వం తొలగిపోతేనే హింస తగ్గుతుంది

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అసమానత్వం తొలిగిపోతేనే హింస తగ్గుతుందని మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ లెనిన్ సెంటర్‌లోని అంబేద్కర్ భవన్‌లో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో లీగల్ క్లినిక్ పబ్లిక్ హియరింగ్ నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ అజయ్ ప్రేమ్ కుమార్, పీసీఆర్ సెల్ నుంచి మోహనరావు పాల్గొన్న ఈ క్లీనిక్‌లో దళిత, ఆదివాసీ మహిళలు, బాలికలపై జరిగిన హింసా సంఘటనలకు సంబంధించి 30 కేసులను బహిరంగ విచారణలో వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం మాట్లాడుతూ క్లినిక్‌కు హాజరైన వారిలో హత్యలు, అత్యాచారాలు, మైనర్ బాలికల కిడ్నాప్, ప్రేమ పేరుతో మోసగించబడిన దళిత, ఆదివాసీ మహిళలు పాల్గొన్నారన్నారు. ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టానికి సవరణలు చేసినా, పటిష్టమైన అంశాలు చేర్చి, నిర్దిష్ట కాల పరిమితి విధించినా చట్టం అమలు కావడం లేదన్నారు. ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేసినా న్యాయం జరగడం లేదన్నారు. అనంతరం ముఖ్యఅతిథి పద్మ మాట్లాడుతూ దళిత, ఆదివాసీ బాలికలు చదువుతోనే హక్కులు సాధించుకోవచ్చన్నారు. విద్య ద్వారా ఆత్మ స్థైర్యం పెరుగుతుందన్నారు. దళిత, ఆదివాసీల కోసం దళిత స్త్రీ శక్తి చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ హేమలత, వివిధ సంఘాల నేతలు అనుపమ, శ్రీదేవి, కొమర్ బేగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ

పరిహారం చెల్లింపులో రైతులకు న్యాయం చేస్తాం

జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హైటెన్షన్ అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ ఏర్పాటులో విద్యుత్ సంస్థ నుంచి రైతులకు నష్ట పరిహారం చెల్లింపులో తగు న్యాయం చేస్తామని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్‌నుపూర్ అజయ్ అన్నారు. విజయవాడ నుంచి గుండుగొలను వరకు జాతీయ రహదారి-16లో విద్యుత్ సంస్థ హైటెన్షన్ అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ ఏర్పాటుకు సంబంధించి రైతులకు నష్ట పరిహారం చెల్లింపులపై బుధవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గొల్లపూడి, జక్కంపూడి రైతులు, విద్యుత్ అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జేసీ మాట్లాడుతూ హైటెన్షన్ అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ ఏర్పాటుకు సంబంధించి రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పరిహారం చెల్లింపులో తగు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో విజయవాడ రూరల్ మండల తహశీల్దార్ శ్రీనివాసనాయక్, విద్యుత్ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర నకిలీ పోలీసు అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ బండారు సురేష్‌బాబు
- వాచీలు, బైక్, ఆటో, నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బండారు సురేష్‌బాబు, వెనుక వరుసలో నిందితులు(ముసుగులో ఉన్న వారు)

పెదకాకాని: అంతర్ రాష్ట్ర నకిలీ పోలీసును, పాసింజర్ ఆటో ముసుగులో ప్రయాణికులను దోచుకుంటున్న కేసులో ఇద్దరిని పెదకాకాని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బండారు సురేష్‌బాబు వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్, బండ్లగూడ జాగిర్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన మరాటి సృజన్‌కుమార్ మద్యం తాగడం, పేకాటలు, వ్యభిచారం వంటి దుర్వ్యసనాలకు బానిసగా మారాడు. జల్సాలకు అక్రమంగా డబ్బులు సంపాదించేందుకు నకిలీ పోలీసు అవతారమెత్తాడు. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్, వరంగల్ జిల్లాతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో పోలీసు అని చెప్పుకుంటూ అమాయకులను బెదిరించి డబ్బులు వసూలు చేసేవాడు. ఇతనిపై 13 కేసులు నమోదు కాగా వాటిలో 7 కేసులు నకిలీ పోలీసుగా దోచుకున్న కేసులు, ఆరు కేసులు బెదిరించి నగదు వసూలు చేసినట్లు ఆయా పోలీసుస్టేషన్‌లలో నమోదయ్యాయి. 2022 సెప్టెంబరు 26వ తేదీన పెదకాకాని తోటకు ప్రార్థనల నిమిత్తం దుగ్గిరాలకు చెందిన శ్రీకాంత్ హాజరయ్యాడు. సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద నిలబడి ఉండగా అక్కడకు మారాటి సృజన్‌కుమార్ చేరుకుని పోలీసు అని చెప్పి బెదిరించాడు. నీ వద్ద ఉన్న డబ్బులు ఇవ్వకపోతే గంజాయి కేసు పెడతానని భయపెట్టి అతని జేబులో ఉన్న రూ.5000 లాక్కుని వెళ్లిపోయాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నకిలీ పోలీసును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి పల్సర్ బైక్, ఐదు వాచ్‌లు, ఐదు కళ్ల జోళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు స్వగ్రామం వరంగల్ జిల్లా, ఖిలా వరంగల్ మండలం, మాములూరుగా గుర్తించారు. మారాటి సృజన్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు.

ప్రయాణికులను దోచుకుంటున్న ఇద్దరు అరెస్టు

పాసింబర్ ఆటో నడుపుతూ మద్యం, చెడువ్యసనాలకు బానిసలుగా మారి ఆటో ఎక్కిన ప్రయాణికులను దోచుకుంటున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు నల్లచెరువుకు చెందిన మందా సెల్వరాజ్, మంచాల శ్రీనివాస్, వెంకటప్పయ్యకాలనీకి చెందిన షేక్ నాగూర్‌లు స్నేహితులు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జల్సాలకు అలవాటు పడి అక్రమంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో ఆటో ఎక్కిన ప్రయాణికులను ముఖ్యంగా అడ్రస్ తెలియకుండా ఆటో ఎక్కేవారిని, రాత్రి వేళల్లో ఆటోలు ఎక్కేవారిని నిర్మానుష్య ప్రదేశాలకు తీసుకు వెళ్లి బెదిరించి, కొట్టి వారి వద్ద ఉన్న నగదు సెల్‌ఫోన్‌ల దొంగిలించి పరారీ అవుతున్నారు. సెప్టెంబరు 10వ తేది రాత్రి ప్రయాణికుడిని ఆటో ఎక్కించుకుని గడ్డిపాడు రిలయన్స్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న నిర్మానుష ప్రాంతానికి తీసుకు వచ్చి కొట్టి అతని వద్ద ఉన్న రూ.200 నగదు, ఏటీఎం కార్డు, సెల్‌ఫోన్ దొంగిలించి పారిపోయారు. బాధితుడు టొక్కిలి రామశివప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను గుర్తించి వారిలో మందా సెల్వరాజ్, మంచాల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్, ఏటీఎం కార్డు, నేరానికి ఉపయోగించిన ఆటో స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో చొరవ, ప్రతిభ కనపరచిన పోలీసు సిబ్బందిని నగదు బహుమతులతో అభినందించారు. ఈ సమావేశంలో ఎస్ఐ కె గీతాంజలి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

పాత గుంటూరు: నవంబరు 8న పౌర్ణమి పురస్కరించుకొని అరుణాచలంలోని అరుణాచలేశ్వరుని గిరి ప్రదక్షిణకు గుంటూరు నుంచి ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవబంరు 6న రాత్రి 10 గంటలకు బస్సులు బయలుదేరతాయని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా బస్ టికెట్లు తీసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 7382896403, 9959225421 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

దసరాకు రూ.24.95 లక్షల ఆదాయం

దసరా సందర్భంగా గుంటూరు-2 డిపో నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, ఒంగోలు తదితర ప్రాంతాలకు ప్రత్యేకంగా 82 బస్సులు నడుపగా రూ. 24,95, 399 ఆదాయం వచ్చిందని మేనేజర్ సలామ్ తెలిపారు. గత ఏడాది 42 బస్సుల ద్వారా రూ. 11 లక్షలు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

ప్రతిభకు పురస్కారాలు శోభనిస్తాయి

నేషనల్ మెడికల్ కమిషన్ డైరక్టర్ డాక్టర్ జేబీ రావు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): ప్రతిభకు పురస్కారాలు శోభనిస్తాయని న్యూఢిల్లీ నేషనల్ మెడికల్ కమిషన్ డైరక్టర్ డాక్టర్ జేబీ రావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, జాషువా సాంస్కృతిక వేదిక, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ అంతర్జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిచారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేబీ రావు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ఫొటోగ్రఫీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. మాజీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మన రాష్ట్రానికి చెందిన ఎందరో ఫొటోగ్రాఫర్‌లు తమ ప్రతిభను చాటుకుంటున్నారన్నారు. సామాజిక అంశలతో పాటు చరిత్రకు అద్దం పట్టే ఛాయా చిత్రాలు, మనసును కదిలించే చిత్రాలకు మన కళ్ల ముందు చూపిస్తున్నారని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించిన ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన విజేతలకు పురస్కారాలను అందజేశారు. విజయం సాధించిన ఫొటోలను నిర్వాహకులు ప్రదర్శించారు. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ళ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందజేస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, చిత్రంలో డైరెక్టర్ నేషనల్ మెడికల్ కమిషనర్ డాక్టర్ జె.బి.రావు

పే జల్ సర్వేక్షణ్ శిక్షణపై వర్క్ షాప్

పటమట(విజయవాడ తూర్పు): నగరాల్లో తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, సీవేజ్ నిర్వహణ, పునర్వినియోగం, నీటి వనరుల సంరక్షణపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పే జల్ సర్వేక్షణ్‌పై బుధవారం వర్క్‌షాప్ జరిగింది. ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ జి.లక్ష్మీషా, పే జల్ సర్వేక్షణ్ కో-ఆర్డినేటర్ అరిత్రదాస్, రిసోర్స్ ట్రైనర్ పాము సాయితేజ పట్టణాలు, నగరాలుకు చీఫ్ ఇంజనీర్లు, సూపరిండెంట్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుకు అవగాహన నిర్వహించారు. పే జల్ సర్వేక్షణ్-2022 డేటా ఎంట్రీ పోర్టల్ ఈ నెల 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని, ఇందులో దేశంలోని 485 అమృత నగరాల్లో నీటి సరఫరా, మురుగునీటి పారుదల, రీసైకిల్, తదితర అంశాలు ఉంటాయని, సర్వీస్ లెవల్ బెంచ్ మార్క్(ఎస్ఎల్‌బీ)లో ఆరు అంశాలు ఉంటాయన్నారు. నీటి సరఫరా, మురుగునీటి కనెక్షన్, సిటిజన్ ఔట్రీచ్ ప్రాంతాలు-పరిష్కార వ్యవస్థ, పట్టణాలు అనుసరించే కార్యాచరణ, నీటి నిల్వలు, నీటి వనరుల నిర్వాహణ, ఆర్థిక స్థిరత్వం, నీటి సరఫరా సేవలు, రికవరీలు, సామర్థ్యం అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారని, వీటికి గరిష్టంగా 2100 మార్కులు నిర్ణయించారని, సంబంధిత పట్టణాలు సాధించిన మార్కుల ఆధారంగా ర్యాంకింగ్ నిర్ణయిస్తారని తెలిపారు. పేజల్ సర్వేక్షణ్ ఈ నెల 11వ తేదీ నుంచి అధికారికంగా ప్రారంభమయ్యిందని, ఇందులో నగరాలు, పట్టణాలు ఈ నెల 30వ తేదీలోపు తమ డేటాను సమర్పించాలని, నవంబర్1వ తేదీ కేంద్ర ప్రభుత్వం ఎంట్రీలను ధ్రువీకరిస్తుందని, అనంతరం ఫీల్డ్ సర్వే, విశ్లేషణ బట్టి నగరాలు, పట్టణాలకు ర్యాంకింగ్ కేటాయిస్తారన్నారు. దీనికి సాంకేతిక సహకారాన్ని తాము అందిస్తామని డాక్టర్ జి.లక్ష్మీషా చెప్పారు.

స్త్రీలు తమ జీవితంలో మాతృత్వాన్ని వరంగా భావిస్తుంటారు.
అయితే, మారుతున్న సమాజం, జీవన పరిస్థితులు
వీటితో పాటు విభిన్న రంగాలలో.. వివిధ వృత్తులలో రాణిస్తున్న మహిళలు
పనుల దృష్ట్యానో, స్థిరపడలేదనో.. బిడ్డలను కనే సమయాన్ని వాయిదా వేస్తూ ఉంటారు.
కొన్నిసార్లు వృత్తికి - అందానికి ముడిపెట్టే సందర్భాలూ తలెత్తుతుంటాయి.
ఇలాంటప్పుడు వైద్యపరంగా వస్తున్న అవకాశాలను
అందిపుచ్చుకుంటూ కొత్త వివాదాలకు దారులు తీస్తుంటారు.
సమస్యలు తెచ్చుకుంటూ ఉంటారు.
వీటిలో మంచీ చెడులు ఎలా ఉన్నా ప్రసవం తర్వాత స్త్రీ శారీరక స్థితిని
తిరిగి తమ స్వాధీనంలోకి తెచ్చుకోగలిగే పరిస్థితుల పట్ల
అవగాహన కలిగి ఉండటం మంచిది అంటున్నారు నిపుణులు.

అమ్మ.. అందం..



ఇటీవల సినీనటి నయనతార సరోగసి విధానం ద్వారా ఇద్దరు బిడ్డలకు తల్లి అయ్యిందనే వార్త వైరల్ అవుతోంది. అందం ప్రధానాంశంగా ఈ వార్త చర్చనీయాంశం అయ్యింది. పిల్లలు పుట్టిన తర్వాత శరీరంలో మార్పులు చోటు చేసుకోవడం సహజంగా జరుగుతుంటుంది. అయితే, వాటి గురించి అంతగా ఆందోళన అవసరం లేదని గ్లామర్ ఫీల్డ్‌లో ఉండి తల్లి అయినవారు తమ జీవన శైలి గురించి ఎప్పటికప్పుడు మనకు తెలియ జేస్తుంటారు. ఇందులో భాగంగా ఇటీవల



కాజల్ అగర్వాల్

సినీనటి కాజల్ అగర్వాల్ బిడ్డను కన్నాక తన శరీరంలో వచ్చిన మార్పులు, వాటిని అనుకూలంగా మార్చుకునే పద్ధతుల మీద రిలీజ్ చేసిన నోట్ కూడా వైరల్ అవుతోంది. ఇలాంటప్పుడు కుటుంబ, సామాజిక, ఆరోగ్యకరమైన జీవనశైలికి స్వయంగా తీసు కోదగిన నిర్ణయాల్లో అవగాహన ప్రధాన అంశం అవు తుంది..

■ నాలుగు నెలల నుంచి..

మాతృత్వపు ఆనందాన్ని పొందుతూనే వృత్తిపరంగా తనను తాను మలుచుకుంటున్న కాజల్ అగర్వాల్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్న స్వీయఅనుభవాలలో 'మాతృత్వం అంటే కెరీర్‌కు ముగింపు కాదు. కెరీర్ గురించి ఆలోచిస్తున్నామంటే బిడ్డను నిర్లక్ష్యం చేయడం కాదు. ఒకటి కావాలంటే ఒకటి కోల్పోతాం అనే భావన కానీ, గిల్టీగా ఫీలవ్వాల్సిన అవసరమే లేదు. ప్రసవం తర్వాత వర్క్‌లోకి వెళ్లడానికి కొంత సమయం పట్టచ్చు. కానీ, మన ప్రాధాన్యతలను సెట్ చేసుకుంటే ప్రతీది సరిగ్గా, సులభంగా చేయచ్చు. నేను ప్రసవం అయ్యాక నాలుగు నెలల నుంచి తిరిగి పని చేయడం మొదలుపెట్టాను. ముందు నా శరీరం ఎలా ఉండేదో.. తర్వాత ఎలా ఉంటుందో అనే ఆలోచన నాకు లేదు. బిడ్డ పుట్టడం అనుభూతిని నేను పొంద గలిగాను. శారీరక శ్రమ ద్వారా నా బాడీని నేను కాపాడుకోగలనన్న నమ్మకం నాకుంది. అందుకు జిమ్‌కు వెళుతున్నాను. గుర్రపు స్వారీ మునుపటి కన్నా కష్టంగా ఉన్నట్టు మొదట్లో అనిపించింది. మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ కూడా అలాగే అనిపించింది. నా శక్తిస్థాయిలను తిరిగి పొందడానికి చేసే ప్రక్రియ మునుపటి కన్నా కొంత కష్టమైనదే. కానీ, తిరిగి నైపుణ్యాల సాధనను ఒక హాబీగా కొనసాగించేందుకు ప్రయత్నించాను. ఇప్పుడు ఈ ప్రక్రియ నాకు ఎంతో ఆనందాన్నిస్తుంది' అని రాసిన ఈ నోట్ ఎంతో మంది తల్లులకు స్ఫూర్తినిస్తుంది.

అపోహలకు దూరం

ప్రసవం తర్వాత మూడు నెలల నుంచి వ్యాయామాలు తప్పనిసరిగా చేయాలి. పోస్ట్ నేటెల్ ఎక్సర్‌సైజులు అని ఉంటాయి. ఈ వ్యాయామం వల్ల చర్మం, కండరాలు తిరిగి వాటి సాధారణ స్థితికి వచ్చే స్థాయి. తల్లిపాలు ఇవ్వడం వల్ల అందం పోతుందని కూడా చాలా అపోహలు ఉన్నాయి. ఎక్కువ సేపు ఫీడింగ్ ఇవ్వకుండా ఉన్నా సమస్యలు తలెత్తుతాయి. ప్రతి రెండు గంటలకు ఒకసారి బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలి. మన జీవన శైలి సరిగ్గా ఉంటే శరీరాకృతిలో పెద్ద మార్పులు రావు.

- డాక్టర్ శిరీషారెడ్డి, గైనకాలజిస్ట్



■ రెండు నెలల నుంచి ..

ఇరవై ఏళ్లుగా హెల్త్ అండ్ ఫిట్‌నెస్ మోటివేటర్‌గా ఉన్న అనుప్రసాద్ ఈ విషయం గురించి ప్రస్తావిస్తూ- 'నార్మల్ డెలివరీ అయినవాళ్ల రెండు నెలల నుంచీ, సిజేరియన్ అయితే ఆరు నెలల నుంచి జిమ్‌లో వ్యాయామాలు చేయచ్చు. ముందుగా వారి వివరాలను జిమ్ ట్రైనర్‌కి చెప్పి, తగిన వ్యాయామాలు చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇరవై ఏళ్లుగా ఈ రంగంలో ఉన్నాను, ఎంతో మంది మహిళలకు ఫిట్‌నెస్‌లో శిక్షణ ఇచ్చాను. బాడీఫిట్‌నెస్‌కు కృషి చేసేవారిలో అమ్మాయిలే కాదు, అమ్మలూ ఉన్నారు. ప్రసవం తర్వాత కొన్నాళ్ల పాటు పిల్లల పనులు, ఇంటి పనులతో తీరికలేదని.. వ్యాయామం అనే ఆలోచన చేయరు. దీంతో పాటు వీరు తీసుకునే ఆహారం సరైనదిగా ఉండకపోవడంతో శరీరంలో మరిన్ని మార్పులు వస్తాయి. అందుకే, చాలా మందిలో 'పిల్లలు పుట్టాక శరీరం లావు అవుతుంది లేదంటే, షేప్ ఉండదు..' అనుకుంటారు. కానీ, నిజానికి తగినంత శారీరక శ్రమ లేకపోవడం వల్లే ఇలా జరుగుతుంది' అని వివరించారు.

తగినంత సాధన

జిమ్‌లో వ్యాయామాలు చేయాలనుకున్నవారు ముందు డాక్టర్ సలహా తీసుకోవాలి. వారి ఇతరత్రా ఆరోగ్య సమస్యలను బట్టి నెమ్మదిగా వ్యాయామాలు మొదలుపెట్టవచ్చు. ఒకేసారి వర్కౌట్స్ కాకుండా లైట్‌వెయిట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నుంచి రోజూ కొద్దిగా టైమ్‌ను పెంచుకుంటూ శరీరానికి వ్యాయామం అలవాటు చేస్తూ ప్రాక్టీస్ చేయాలి. దీంతో వారి పూర్వపు శరీరాకృతి వచ్చేస్తుంది. వాకింగ్ వంటి ఫిజికల్ యాక్టివిటీ రోజూ గంట సేపు చేసినా మంచి ప్రయోజనం ఉంటుంది. దీంతో పాటు నూనె, చక్కెర, జంక్ పదార్థాలు కాకుండా మంచి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చేసుకుంటే ఆరోగ్యంగానూ, యాక్టివ్‌గానూ ఉంటారు.

- అనుప్రసాద్, హెల్త్ అండ్ ఫిట్‌నెస్ మోటివేటర్



■ ఆరు వారాల నుంచి..

ప్రసవం తర్వాత తల్లులకు చెప్పే జాగ్రత్తలలో వ్యాయామం తప్పనిసరిగా ఉంటుందంటున్నారు గైనకాలజిస్ట్ డాక్టర్ శిరీష. 'ప్రీ ప్రెగెన్సీలో ఉన్న ప్రతి సిస్టమ్ ప్రసవం తర్వాత ఆరు వారాల సమయంలో సాధారణ స్థితికి వచ్చేస్తుంది. ఈ సమయంలో ఎలాంటి ఇన్ఫెక్షన్స్ రాకుండా జాగ్రత్తపడమని చెబుతాం. అలాగే, కొద్ది రోజులు బరువులు ఎత్తకుండా సాధారణ పనులు చేసుకోవచ్చు. మంచి ప్రొటీన్స్ ఉన్న పోషకాహారం తీసుకోవాలి. సిజేరియన్ అయితే గాయం మానడానికి జాగ్రత్తలు తీసుకోవాలి. దీంతో పాటు ఇంటి వద్ద చేయదగిన వ్యాయామాల గురించి వివరిస్తాం' అని తెలిపారు.

అందం మాతృత్వానికి ఎప్పుడూ కొలమానం కాదు. జీవన విధానంలో వచ్చే ఆనందాలను పొందుతూనే, ఎంచుకున్న రంగంలో విజయశిఖరాలను అంతే హుందాగా పొందవచ్చు.

– నిర్మలారెడ్డి

'వొదినా... ఇది విన్నావా... దిండు కింద కరక్కాయ
పెట్టుకుంటే మంచిరోజులొస్తాయట'
'అక్కా.. ఈ సంగతి తెలుసా? నల్లకోడితో
దిష్టి తీస్తే జ్వరం తగ్గుతుందట'
'వ్రతం చేసి నెల రోజులు ఉపవాసం పాటిస్తే
ఇక సంపదే సంపద'
'బాబాగారి దగ్గరికెళ్లి తాయెత్తు కట్టుకొస్తే
కష్టాలన్నీ పోతాయి'...
ఇరుగమ్మలు పొరుగమ్మలు ఏమేమో చెబుతుంటారు.
వాటిని గడప దాటి లోపలికి రానిస్తే ఇంటికే ప్రమాదం.
కష్టాలు అందరికీ ఉంటాయి.
సరైన దిశ లేనప్పుడు మూఢవిశ్వాసాలు పాటించైనా
బయటపడాలనుకుని ప్రమాదాలు తెచ్చుకుంటారు.
స్త్రీ చదువు, స్త్రీ చైతన్యం మూఢ విశ్వాసాల నుంచి
కుటుంబాన్ని కాపాడగలదు.
అప్పుడే కేరళలో జరిగిన ఉదంతాల వంటివి
పునరావృత్తం కాకుండా ఉంటాయి.
మేలుకో మహిళా.. మేలుకో.

సందర్భం



ఇరుగమ్మ... పొరుగమ్మ మూఢ విశ్వాసాలు

ఆ మధ్య యూ ట్యూబ్‌లో ఒక ఇరుగమ్మ పర్సులో లవంగాలు పెట్టుకుంటే డబ్బు నిలుస్తుంది అని చెప్పింది. యూ ట్యూబ్‌లో కాబట్టి అందరూ వేళాకోళం చేశారు. జోకులేశారు. కాని అదేమాట ఆ ఇరుగమ్మ కేవలం తన పక్కింటామెతో చెప్పి ఉంటే? ఆ పక్కింటామె అమాయకంగా దానిని నమ్మి ఉంటే? భర్త పర్సులో లవంగాలు పెట్టి డబ్బు కోసం ఎదురు చూసి ఉంటే?

దేవుణ్ణి పూజించడం, మొక్కులు మొక్కుకోవడం, కష్టాల నుంచి బయట పడేయమని గుడిలో అర్చనలు చేయడం ఇవి ఆధ్యాత్మిక సంప్రదాయాలు. కాని సంప్రదాయానికి ఆవల అంగీకారం లేని పుకార్లుగా మూఢవిశ్వాసాలు వ్యాపిస్తూ ఉంటాయి. ఫలానా లాకెట్ ధరిస్తే మేలు, ఉంగరం ధరిస్తే వశీకరణం, ఫలానా వ్యక్తిని సంప్రదిస్తే చేతబడి, ఫలానా మందును భర్తకు అన్నంలో పెట్టి తినిపిస్తే అతడిక కొంగు పట్టుకు తిరుగుతాడని... ఇలాంటివి లక్ష.

అనారోగ్యాలు, ఆర్థిక కష్టాలు వస్తే మనిషి మానసిక స్థయిర్యం దెబ్బ తింటుంది. ఎలాగైనా వాటి నుంచి గట్టెక్కాలని చూస్తాడు. ఆ సమయంలోకి ఇరుగువారు, పొరుగువారు తోచిన మూఢ సలహాలు ఇస్తారు. వాటిని పాటించడం వల్ల ఇంకా ప్రమాదంలోకి వెళ్లడం తప్ప మరో ఉపయోగం లేదు. అనారోగ్యం వస్తే తగిన వైద్యం చేయించుకుని ఆత్మస్థయిర్యంతో ఆ జబ్బు మీద పోరాడాలి. దేవుని మీద విశ్వాసం ఉంటే ప్రార్థన మేలు చేస్తుంది. అంతే తప్ప మంత్రగాళ్లు మేలు చేయరు. ఆర్థిక కష్టాలు వస్తే విజ్ఞుల సలహా తీసుకుని అయినవారి మద్దతుతో వాటి నుంచి బయటపడాలి తప్ప మంత్రాలకు కాసులు రాలవు. అయినా సరే మూఢవిశ్వాసాలు గట్టిగా లాగుతాయి. వాటిని స్త్రీలు నమ్మడం మొదలెడితే చాలా ప్రమాదం. మగవాడికి కనీసం బజారులో అలాంటి పనులు ఖండించేవారు తారసపడతారు. ఇరుగమ్మలు, పొరుగమ్మలు కలిసి తమ లోకంలో తాము ఉంటూ ఇలాంటివి నమ్ముతూ పోతే ఇంటి మీదకే ప్రమాదం వస్తుంది.

ఒకప్పుడు సమాజంలో నాస్తికవాదం, హేతువాదం, అభ్యుదయ వాదం మూఢవిశ్వాసాలకు జవాబు చెప్పేవి. బాబాల, స్వామిజీల ట్రిక్కులను తిప్పి కొట్టేవి. అతీంద్రియ శక్తుల మీద కంటే మనిషికి తన మీద తనకు విశ్వాసం కల్పించేవి. కాని ఇవాళ ఎటు చూసిన చిట్కాలు, కిటుకులు చెప్పేవారు తయారయ్యారు. మంగళవారం ఫలానా రంగు బట్ట కట్టమని, బుధవారం ఫలానా పని చేయొద్దని, శుక్రవారం ఫలానా ప్రయాణం చేయొద్దని... ఇలా ఉంటే సమాజం ఎలా ముందుకు వెళుతుంది?

ఎవరికీ హాని చేయని మూఢ విశ్వాసాలనైనా క్షమించవచ్చు. కాని ఎవరికైనా హాని చేస్తే తప్ప తాము బాగు పడము అనే మూఢవిశ్వాసం వ్యాపింప చేసేవారిని వెంటనే పోలీసులకు పట్టించాలి. అలాంటి ఆలోచనలో ఉన్నవారు ఆ మత్తు నుంచి తక్షణమే బయటపడి స్పృహలోకి రావాలి. హైదరాబాద్‌లో ఆ మధ్య ఒక రియల్టర్ ముక్కుముఖం తెలియని స్వామిని పూజకు పిలిస్తే అతడు ప్రసాదంలో మత్తు మందు కలిపి ప్రాణం మీదకు తెచ్చాడు. ఇవాళ కేరళలో నరబలి ఇస్తే తప్ప ఆర్థిక కష్టాలు పోవు అని ఎవరో నూరిపోస్తే ఒక దంపతులు అంతకూ తెగించారు. అదీ అక్షరాస్యతలో మొదటిగా ఉండే కేరళలో జరిగిందంటే ఇరుగు పొరుగువారు నూరిపోసే మూఢ విశ్వాసాల శక్తిని అంచనా వేయొచ్చు.

చీకటిలో దారి ఎప్పటికీ తెలియదు. అంధ విశ్వాసం అనేది కారు నలుపు చీకటి. వెలుతురు ఉన్నట్టు భ్రమ కల్పిస్తుంది. లేనిపోని ఆశలు రేకెత్తిస్తుంది. హేతువును నాశనం చేస్తుంది. ఆలోచనకు ముసుగేస్తుంది. ఏదైనా చేసి సులభంగా గట్టెక్కడానికి తెగించమంటుంది.

జ్వరం వచ్చిన పిల్లవాడికి దిష్టి తీయడం సంప్రదాయమే కావచ్చు. డాక్టరుకు చూపించి మందులు వాడుతూ సంప్రదాయం ప్రకారం దిష్టి తీసి తృప్తి పడితే దానికో అర్థం ఉంటుంది. ఆ మాత్రపు ఇంగితంతో లేకపోతే ఎంతో ప్రమాదం. ఎంతెంతో ప్రమాదం.

సైబర్ టాక్

మోసాలను లాక్ చేద్దాం!



ప్రతీకాత్మక చిత్రం

సోషల్ మీడియా వేదికగా బ్లూటిక్ మేనియా గురించి మనకు తెలిసిందే. దీని ఆధారంగానే మన సందేశం లేదా ఫొటో అవతలి వారు చూశారు అన్నది తెలిసిపోతుంది. మన ఆలోచనలను ప్రదర్శించడానికి, షేర్ చేయడానికి ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన వేదిక ఇన్‌స్టాగ్రామ్. ఇది ఒక బిలియన్ కంటే ఎక్కువ ఉన్న వినియోగదారులతో కూడిన భారీ ప్లాట్‌ఫారమ్. అలాగే స్కామ్‌లు కూడా అంతే స్థాయిలో జరుగుతుంటాయి. అందులో ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్స్‌ని పెంచుకోవడానికి, ఇన్వెస్ట్‌మెంట్స్‌ను రాబట్టడానికి, గివ్ అవే, రొమాన్స్ వంటి స్కామ్‌లకు పాల్పడటానికి స్కామర్‌లు రకరకాల మోసాలకు పాల్పడుతుంటారు. ఇన్‌స్టాగ్రామ్‌లో బ్లూటిక్ పొందిన ప్రొఫైల్స్ అధికంగా ఉంటాయి. వాటికి ఉన్న ఆదరణను బట్టి సైబర్ నేరగాళ్లు రకరకాల మోసాలకు పాల్పడుతున్నారు.

వారు మిమ్మల్ని ఆపరేట్ చేసేలా మారవచ్చు. మిమ్మల్ని మోసగించడానికి, మీ డబ్బును దొంగిలించడానికి, కొత్త మోసపూరిత మార్గాలను ఆలోచించడానికి అనువైన అవకాశాల కోసం పొంచి ఉంటారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ యూజర్ల ఆసక్తి, ఆశను ఉపయోగించుకుని చేసే ఈ మోసాలను అడ్డుకోవడానికి ఎవరికి వారు తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

స్కామర్ల అంతిమ లక్ష్యం మీ ఖాతా నుంచి డబ్బు కోసం మిమ్మల్ని బ్లాక్ మెయిల్ చేయడం లేదా మీ పరువు తీయడం.

కొన్ని సాధారణ మోసాలు :

(ఎ) మీ పాస్‌వర్డ్‌ను మార్చడం, మీ స్వంత అకౌండ్ నుండి మిమ్మల్ని లాక్ చేయడం (బి) వ్యక్తిగత డేటాను దొంగిలించడం (అనగా, ఫోన్ నంబర్, ఇ-మెయిల్, అనుచరుల వివరాలు మొదలైనవి). (సి) స్కామ్ ప్రకటనలను పోస్ట్ చేయడం. (డి) మీలా నటించి, మీ అనుచరులకు మాల్వేర్ ప్రభావిత లింక్‌లను పంపడం. (ఇ) మీలా నటించి, డబ్బు కోసం మీ అనుచరులకు సందేశాలు పంపడం.

ఇన్‌స్టాగ్రామ్ మోసాలలో కొన్ని:

ఫిషింగ్ స్కామ్‌లు: స్కామర్‌లు మీకు అనుమానాస్పద లింక్‌లను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా డైరెక్ట్ మెసేజ్ లేదా ఇ-మెయిల్ ద్వారా పంపుతారు. దీని ద్వారా మీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు అనుమతి పొందడానికి ప్రయత్నిస్తారు. అక్కడ బాధితులు నకిలీ ఇన్‌స్టాగ్రామ్ లాగిన్ పేజీలో యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌ను ఇవ్వడం ద్వారా మోసపోతారు. స్కామర్‌లు మీ లాగిన్ వివరాలను తెలుసుకుని ఉంటే, వారు మీ వ్యక్తిగత సమాచారాన్ని (అంటే ఫోన్, ఇ-మెయిల్ మొదలైనవి) యాక్సెస్ చేయవచ్చు లేదా మార్చవచ్చు. మీ సొంత ఖాతా నుండి మిమ్మల్ని లాక్ చేయడానికి మీ పాస్‌వర్డ్‌ను కూడా మార్చవచ్చు.

కొన్ని ఫిషింగ్ వ్యూహాలు:

(ఎ) ఇన్‌స్టాగ్రామ్ నుండి అధికారిక కాపీరైట్ ఉల్లంఘన హెచ్చరికలుగా పేర్కొంటున్న సందేశాలను పంపడం (బి) నకిలీ ఇన్‌ఫ్లుయెన్సర్ స్పాన్సర్‌లు, స్కామర్‌లు ఒక బ్రాండ్‌గా నటిస్తారు. ఇన్‌ఫ్లుయెన్సర్‌లకు ప్రకటనల ఒప్పందాన్ని అందిస్తారు. (సి) ఇన్‌స్టాగ్రామ్ నుండి బ్లూ టిక్ నిర్ధారణకు కేవైసీ ఉపయోగిస్తారు. పైన పేర్కొన్న అన్ని సందర్భాల్లో, మీకు చిన్న లింక్‌లు పంపి, మీ వివరాల యాక్సెప్టెన్సీ కోరుతారు.

రొమాన్స్ స్కామ్‌లు:

స్కామర్‌లు నకిలీ ఆన్‌లైన్ ఖాతా నుంచి మీతో సంభాషణను కొనసాగిస్తారు. కాలక్రమేణా బాధితుడితో నమ్మకాన్ని పెంచుకుంటారు. ఆపై వారి నమ్మకాన్ని దుర్వినియోగం చేయడం ప్రారంభిస్తారు. అనుకున్న లక్ష్యం చేరాక స్కామర్ వీసాలు, విమానాలు, ప్రయాణ ఖర్చులు, ఆసుపత్రి ఖర్చులు.. ఇలా అన్నింటి కోసం డబ్బు అడగడం ప్రారంభిస్తాడు.

బహుమతుల స్కామ్‌లు :

ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు తరచుగా బహుమతులను ఇస్తారు. కొంత మంది అదృష్ట విజేతలకు ఉచిత ఉత్పత్తులు లేదా సేవలను అందిస్తారు. ఫాలోవర్లు డిజైనర్ దుస్తులు, ఖరీదైన ల్యాప్‌టాప్‌లు, ఎయిర్ పాడ్‌లు మొదలైనవాటిని గెలుచుకునే అవకాశం ఉంది. (బహుమతులను స్వీకరించడానికి, బాధితుడు షిప్పింగ్ రుసుము చెల్లించాలి లేదా చట్టవిరుద్ధ ప్రయోజనాల కోసం ఉపయోగించగల వ్యక్తిగత సమాచారాన్ని అందించాలి)

స్కామర్‌ని ఇలా గుర్తించండి

- స్కామర్‌లు నకిలీ ఖాతా ఉన్నవారై, మీ ఫ్రెండ్స్ జాబితాలో ఉన్నట్టు చూపుతారు.
- వీరి లిస్ట్‌లో చాలా తక్కువ మంది అనుచరుల సంఖ్య ఉంటుంది.
- అకౌంట్ లేదా లింక్‌లో సాధారణ వ్యాకరణం లేదా భాషా లోపాలను ఉంటాయి.
- చాలా ప్రొఫైల్‌లు ఇటీవల కొత్తగా క్రియేట్ చేసినవై ఉంటాయి.
- బహుమతిని అందుకోవడానికి డబ్బు (అడ్వాన్స్ ఫీజు లేదా రిజిస్ట్రేషన్ ఫీజు) పంపమని అడుగుతారు.
- ప్రొఫైల్స్ ఫీడ్ క్వాలిటీ చాలా తక్కువగా ఉంటుంది.
- వారి ఇ-మెయిల్ ఖాతాతో మిమ్మల్ని కమ్యూనికేట్ చేస్తారు.
- కొన్నిసార్లు ఇ-మెయిల్ ఖాతాల నుండి కాకుండా టెక్స్ట్ మెసేజ్‌ల ద్వారా వివరాలను అడుగుతారు.

సురక్షితంగా ఉండటానికి...

- బలమైన సంక్లిష్ట పాస్‌వర్డ్‌ను (సంఖ్య , పెద్ద అక్షరాలు, ప్రత్యేక అక్షరాలతో) సెట్ చేయండి.
- ధ్రువీకరించబడిన బ్రాండ్ అకౌంట్‌ల నుండి మాత్రమే షాపింగ్ చేయండి.
- మీ లాగిన్ కార్యకలాపాలను తరచుగా పర్యవేక్షించండి.
- మీరు ఇచ్చిన థర్డ్ పర్సన్ యాక్సెస్‌ను తరచుగా సమీక్షించండి.
- ఇన్‌స్టాగ్రామ్‌లో నేరుగా లాగిన్ అవ్వండి. ధ్రువీకరించని థర్డ్ పార్టీ యాప్‌లను ఎప్పుడూ ఉపయోగించవద్దు.
- వచ్చిన షార్ట్ లింక్స్‌ను https://isitphishing.org/, https://www.urlvoid.com/ లో చెక్ చేయండి.
- మీ గోప్యతా సెట్టింగ్‌లను కాన్ఫిగర్ చేయండి. సరిగా లేని కంటెంట్ ఏదైనా ఉంటే దానిని https://help.instagram.com/116024195217477 కి రిపోర్ట్ చేయండి.
- https://help.instagram.com/192435014247952 తెలియజేయండి.
- పేజీ హ్యాక్ అయితే, దానికి సంబంధించిన సాయం కోసం https://help.instagram.com/368191326593075 https://help.instagram.com/44666317538

నకిలీ అమ్మకాలు:

ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ/రెప్లికా వస్తువులను అమ్మడం అనేది ఒక భారీ స్కామ్. ఇది వినియోగదారు ఖాతాలు, ప్రకటనలలో బలంగా ఉంటుంది. కొనుగోలుదారులు త్వరగా పని చేయడానికి వారు అత్యవసరాన్ని (అంటే పరిమిత కాలపు ఆఫర్‌లు) సృష్టిస్తారు. స్కామర్‌లు ఎక్కువగా సురక్షితంగా లేని పద్ధతుల ద్వారా చెల్లింపును అభ్యర్థిస్తారు.

ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు:

కేవలం చిన్న పెట్టుబడికి గొప్ప రాబడిని ఇస్తామని మీకు వాగ్దానం చేస్తారు. డబ్బు చెల్లించేంతవరకూ అందించిన యాక్సెస్ (అంటే, వెబ్ సైట్ లేదా యాప్) వాస్తవికంగా కనిపిస్తుంది, బాగా పని చేస్తుంది కూడా. అయితే ఇది పూర్తిగా నకిలీ, మీ పెట్టుబడులు బాగా పని చేస్తున్నాయని, మీరు వదులుకోలేని విధంగా నకిలీ డేటాను ప్రాజెక్ట్ చేస్తుంది. వీటిలో ఎక్కువ భాగం పోంజీ పథకాలు, ఎగ్జిట్ స్కామ్‌లు ఉంటాయి.

మన సామాజిక ప్రొఫైల్‌లలో మనకు ఎంత మంది అనుచరులు ఉన్నారు, వారి ఇష్టాలు ఏంటి అనే విషయాలను తరచూ చూస్తుంటాం. దీని ఆధారంగా స్కామర్‌లు వారి నుంచి ప్రయోజనాన్ని పొందే విధంగా తమ ఉత్పత్తులు లేదా ప్రకటనలను విడుదల చేస్తుంటారు. ఎక్కువ లైక్‌లు, ఫాలోవర్లను పొందేందుకు నామ మాత్రపు ధరలకు వస్తువుల్ని, సేవలను ఆఫర్ చేస్తుంటారు. ఈ వాగ్దానాలు చాలా వరకు నిజం కావని నమ్మాలి.



ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



దక్షిణాఫ్రికా జట్టులో జాన్సెన్

టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే దక్షిణాఫ్రికా జట్టులో ఎడంచేతి వాటం పేస్ బౌలర్ మార్కో జాన్సెన్‌కు చోటు దక్కింది. టీమ్‌లోకి ఎంపికైన తర్వాత గాయంతో ఈ మెగా టోర్నీకి దూరమైన ఆల్‌రౌండర్ ప్రిటోరియస్ స్థానంలో అతడిని ఎంపిక చేశారు. 22 ఏళ్ల జాన్సెన్ సఫారీ టీమ్ తరఫున ఇప్పటి వరకు ఒకే ఒక టి20 మ్యాచ్ ఆడి ఒక వికెట్ పడగొట్టాడు. మరో 7 టెస్టుల్లో, 6 వన్డేల్లో కూడా అతను జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.



ఫైనల్ బెర్త్ లక్ష్యంగా...

మహిళల ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో నేడు భారత్, థాయ్‌లాండ్ జట్ల మధ్య బంగ్లాదేశ్‌లోని సిల్హెట్‌లో సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో టీమిండియా ఈ టోర్నీ లీగ్ దశలో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. చివరి లీగ్ పోరులో థాయ్‌లాండ్‌ను 37 పరుగులకే ఆలౌట్ చేసిన భారత సెమీఫైనల్లోనూ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. ఉదయం గం. 8:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్-2లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. పాకిస్తాన్, శ్రీలంక జట్ల మధ్య రెండో సెమీఫైనల్ జరుగుతుంది.

సర్వీసెస్‌కు అగ్రస్థానం

- ముగిసిన జాతీయ క్రీడలు
- గోవాలో తదుపరి గేమ్స్
- సర్వీసెస్ తరఫున స్వర్ణం సాధించిన తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్

అహ్మదాబాద్: జాతీయ క్రీడల్లో మళ్లీ సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్ఎస్‌సీబీ) జట్టే సత్తా చాటుకుంది. 'సెంచరీ'ని మించిన పతకాలతో 'టాప్' లేపింది. సర్వీసెస్ క్రీడాకారులు మొత్తం 128 పతకాలతో అగ్రస్థానంలో నిలిచారు. ఇందులో 61 స్వర్ణాలు, 35 రజతాలు, 32 కాంస్యాలున్నాయి. అట్టహాసంగా ఆరంభమైన 36వ జాతీయ క్రీడలకు బుధవారం తెరపడింది. 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 8000 పైచిలుకు అథ్లెట్లు ఈ పోటీల్లో సందడి చేశారు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో 38, అక్వాటిక్స్‌లో 36 జాతీయ క్రీడల రికార్డులు నమోదయ్యాయి. ఆఖరి రోజు వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రభాయ్ పటేల్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తదితరులు పాల్గొన్నారు. తదుపరి జాతీయ క్రీడలకు వచ్చే ఏడాది గోవా ఆతిథ్యమిస్తుంది.

➡ వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం ఈ జాతీయ క్రీడలు గోవాలో జరగాలి. కానీ అనూహ్యంగా గుజరాత్‌కు కేటాయించగా... నిర్వాహకులు వంద రోజుల్లోపే వేదికల్ని సిద్ధం చేయడం విశేషం. పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ఇండోర్ స్టేడియంలో ముగింపు వేడుకలు జరిగాయి.

➡ పురుషుల విభాగంలో ఎనిమిది పతకాలు సాధించిన కేరళ స్విమ్మర్ సజన్ ప్రకాశ్ (5 స్వర్ణాలు, 2 రజతాలు, 1 కాంస్యం) 'ఉత్తమ క్రీడాకారుడు'గా... మహిళల విభాగంలో ఏడు పతకాలు సాధించిన కర్ణాటకకు చెందిన 14 ఏళ్ల స్విమ్మర్ హాషిక (6 స్వర్ణాలు, 1 కాంస్యం) 'ఉత్తమ క్రీడాకారిణి'గా పురస్కారాలు గెల్చుకున్నారు. గత జాతీయ క్రీడల్లోనూ (2015లో కేరళ) సజన్ ప్రకాశ్ 'ఉత్తమ క్రీడాకారుడు' అవార్డు అందుకోవడం విశేషం.



సజన్ ప్రకాశ్‌కు ట్రోఫీ అందజేస్తున్న గుజరాత్ సీఎం భూపేంద్రభాయ్ పటేల్

➡ చివరిరోజు తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ 'పసిడి పంచ్'తో అలరించాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన హుసాముద్దీన్ సర్వీసెస్ తరఫున ఈ క్రీడల్లో పాల్గొన్నాడు. 57 కేజీల ఫైనల్లో హుసాముద్దీన్ 3–1తో సచిన్ సివాచ్ (హరియాణా)పై గెలిచాడు.

➡ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఓవరాల్ చాంప్ సర్వీసెస్‌కు 'రాజా భళీంద్ర సింగ్' ట్రోఫీని అందజేశారు. సర్వీసెస్ నాలుగోసారి ఈ ట్రోఫీ చేజిక్కించుకుంది. 39 స్వర్ణాలు, 38 రజతాలు, 63 కాంస్యాలతో కలిపి మొత్తం 140 పతకాలు సాధించి రెండో స్థానంలో నిలిచిన మహారాష్ట్రకు 'బెస్ట్ స్టేట్' ట్రోఫీ లభించింది. ఓవరాల్‌గా సర్వీసెస్‌కంటే మహా రాష్ట్ర ఎక్కువ పతకాలు సాధించినా స్వర్ణాల సంఖ్య ఆధారంగా సర్వీసెస్‌కు టాప్ ర్యాంక్ దక్కింది.



హాషికకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా


➡ తెలంగాణ 8 స్వర్ణాలు, 7 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి మొత్తం 23 పతకాలతో 15వ స్థానంలో... ఆంధ్రప్రదేశ్ 2 స్వర్ణాలు, 9 రజతాలు, 5 కాంస్యాలతో కలిపి మొత్తం 16 పతకాలతో 21వ స్థానంలో నిలిచాయి. 2015 కేరళ జాతీయ క్రీడల్లో తెలంగాణ 8 స్వర్ణాలు, 14 రజతాలు, 11 కాంస్యాలతో కలిపి మొత్తం 33 పతకాలతో 12వ స్థానంలో... ఆంధ్రప్రదేశ్ 6 స్వర్ణా లు, 3 రజతాలు, 7 కాంస్యాలతో కలిపి మొత్తం 16 పతకాలతో 18వ స్థానంలో నిలిచాయి.



స్వర్ణంతో హుసాముద్దీన్

ఆస్ట్రేలియాకు షమీ, సిరాజ్, శార్దుల్

ముగ్గురు రిజర్వ్‌లకు దక్కని అవకాశం







న్యూఢిల్లీ: టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టులో 15వ ఆటగాడు ఎవరనేది ఇంకా ఖాయం కాలేదు! గాయపడిన బుమ్రా స్థానంలో ఎవరిని ఎంచుకోవాలనే విషయంపై సెలక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. అయితే ప్రత్యామ్నాయ ఆటగాళ్లను మాత్రం ఆస్ట్రేలియాకు పంపించింది. పేస్ బౌలర్లు మొహమ్మద్ షమీ, మొహమ్మద్ సిరాజ్‌లతో పాటు పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ కూడా ఆస్ట్రేలియా వెళ్లారు. ఈ ముగ్గురు పెర్త్‌లో భారత జట్టుతో చేరతారని బోర్డు ప్రకటించింది. గాయం నుంచి కోలుకున్నా... కోవిడ్ కారణంగా స్వదేశంలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సిరీస్‌లకు షమీ దూరమయ్యాడు. మరోవైపు సిరాజ్ మాత్రం దక్షిణాఫ్రికాతో వన్డేల్లో సత్తా చాటి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. బుమ్రా స్థానంలో ఎంపికయ్యే అవకాశం ఉందని భావించిన దీపక్ చహర్‌ను దురదృష్టం వెంటాడింది. వెన్ను గాయంతో దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు దూరమైన అతను ఇంకా కోలుకోలేదు. దాంతో అతను వరల్డ్‌కప్ అవకాశాన్ని కోల్పోయాడు. ఈ మెగా టోర్నీ కోసం 'రిజర్వ్'లుగా ప్రకటించిన మరో ఇద్దరు ఆటగాళ్ల శ్రేయస్ అయ్యర్, రవి బిష్ణోయ్ కూడా ఆస్ట్రేలియాకు వెళ్లడం లేదని బీసీసీఐ అధికారులు వెల్లడించారు. ఐసీసీ నిబంధనల ప్రకారం బుమ్రా స్థానంలో ఆటగాడిని ఎంచుకునేందుకు భారత్‌కు శనివారం వరకు అవకాశం ఉంది. శార్దుల్ ప్రధాన జట్టులోకి ఎంపికయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ప్రధానంగా పోటీ షమీ, సిరాజ్ మధ్యే ఉంది. వీరు ఆస్ట్రేలియాకు వెళ్లిన తర్వాత వారి బౌలింగ్, ఫిట్‌నెస్‌ను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అందుకే ఆటగాడి పేరును ఇప్పటి వరకు ప్రకటించలేదు. షమీ, సిరాజ్ ఇద్దరికీ ఆస్ట్రేలియాలోని బౌన్సీ వికెట్లపై రాణించగల సామర్థ్యం ఉంది. అనుభవం, బౌలింగ్ పదునును బట్టి చూస్తే షమీకే మొదటి ప్రాధాన్యత కనిపిస్తోంది. ఈ ఏడాది ఐపీఎల్‌లో అద్భుత బౌలింగ్‌తో అతను గుజరాత్ టైటాన్స్ టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. అయితే తన చివరి అంతర్జాతీయ టి20ని అతను దాదాపు ఏడాది క్రితం వరల్డ్‌కప్‌లోనే ఆడాడు. మరోవైపు అంతర్జాతీయ టి20ల్లో సిరాజ్‌కు పేలవమైన రికార్డు ఉన్నా... వన్డేల్లో ఇటీవలి ఫామ్, డెత్ ఓవర్లలో చక్కటి బౌలింగ్‌తో అతను ఒక్కసారిగా వరల్డ్‌కప్‌నకు ఎంపికయ్యే అవకాశాలను మెరుగుపర్చుకున్నాడు. ఈ నేపథ్యంలో ఎవరిని ఎంచుకుంటారనేది ఆసక్తికరం. ఆసీస్ గడ్డపై అడుగు పెట్టిన తర్వాత వెస్టర్న్ ఆస్ట్రేలియాతో తొలి ప్రాక్టీస్ మ్యాచ్‌లో గెలిచిన భారత్ నేడు అదే జట్టుతో రెండో ప్రాక్టీస్ మ్యాచ్ కూడా ఆడనుంది.

హైదరాబాద్ గెలుపు

తిలక్ వర్మ రెండో అర్ధ సెంచరీ



జైపూర్: ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ తొలి విజయం నమోదు చేసింది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా పాండిచ్చేరితో బుధవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ నాలుగు పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 147 పరుగులు చేసింది. తిలక్‌వర్మ (41 బంతుల్లో 57; 1 ఫోర్, 4 సిక్స్‌లు) వరుసగా రెండో అర్ధ సెంచరీ చేశాడు. మికిల్ జైస్వాల్ (25 బంతుల్లో 44 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా రాణించాడు. అనంతరం 148 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాండిచ్చేరి 20 ఓవర్లలో 4 వికెట్లకు 143 పరుగులు చేసి ఓడిపోయింది. హైదరాబాద్ తరఫున భగత్ వర్మ, తిలక్ వర్మ, సీవీ మిలింద్ ఒక్కో వికెట్ పడగొట్టారు. మరోవైపు ఇండోర్‌లో ఆంధ్ర, హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

ఫైనల్లో న్యూజిలాండ్



ఫిలిప్స్

క్రైస్ట్‌చర్చ్: ముక్కోణపు టి20 క్రికెట్ టోర్నీలో న్యూజిలాండ్ ఫైనల్ చేరింది. బంగ్లాదేశ్‌తో బుధవారం జరిగిన నాలుగో లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 48 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 208 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (24 బంతుల్లో 60; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), డెవాన్ కాన్వే (40 బంతుల్లో 64; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధ సెంచరీలు చేశారు. 209 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు చేసి ఓడిపోయింది. షకీబ్ అల్ హసన్ (44 బంతుల్లో 70; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించాడు. బంగ్లాదేశ్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోవడంతో ఈ టోర్నీలోని మూడో జట్టు పాకిస్తాన్ కూడా ఫైనల్ చేరింది. నేడు పాకిస్తాన్, బంగ్లాదేశ్ మధ్య చివరి లీగ్ మ్యాచ్ ఉంది. ఫైనల్ శుక్రవారం జరుగుతుంది.

ఇంగ్లండ్‌దే సిరీస్



మలాన్

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఇంగ్లండ్ 2–0తో సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఎనిమిది పరుగుల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 178 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డేవిడ్ మలాన్ (49 బంతుల్లో 82; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మొయిన్ అలీ (27 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి మలాన్ ఐదో వికెట్‌కు 92 పరుగులు జోడించాడు. 179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 6 వికెట్లకు 170 పరుగులు చేసి ఓటమి చవిచూసింది. మిచెల్ మార్ష్ (45; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (40; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా కీలకదశలో అవుటయ్యారు. ఇంగ్లండ్ బౌలర్ సామ్ కరన్ 25 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు.

'చార్జ్‌షీట్'లో సుశీల్ పేరు



న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్, రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత సుశీల్ కుమార్‌ను మరింతగా ఇబ్బందుల్లోకి నెట్టే పరిణామం! దాదాపు ఏడాదిన్నర క్రితం రెజ్లర్ సాగర్ ధన్కర్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న సుశీల్ పేరును ఢిల్లీ పోలీసులు తాజాగా చార్జ్ షీట్‌లో చేర్చారు. సుశీల్‌తో పాటు మరో 17 మంది పేర్లు ఇందులో ఉన్నాయి. ఇకపై చార్జ్‌షీట్‌కు అనుగుణంగా పూర్తి స్థాయిలో కేసుకు సంబంధించి కోర్టులో విచారణ సాగనుంది. 2021 మే 4 ఛత్రశాల్ స్టేడియంలో సాగర్‌పై దాడి జరగ్గా, తీవ్రంగా గాయపడిన అతను ఆ తర్వాత మృతి చెందాడు. గత ఏడాది మే 23న అరెస్టయిన సుశీల్ ఇంకా తీహార్ జైలులోనే ఉన్నాడు.

డిస్కస్ త్రోయర్ కమల్‌ప్రీత్‌పై మూడేళ్ల నిషేధం



న్యూఢిల్లీ: భారత మహిళా డిస్కస్ త్రోయర్ కమల్‌ప్రీత్ కౌర్‌పై ప్రపంచ అథ్లెటిక్స్ (డబ్ల్యూఏ) మూడేళ్ల నిషేధం విధించింది. ఆమె నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు తేలడంతో ఇదివరకే తాత్కాలిక సస్పెన్షన్ వేటు పడింది. తాజాగా డబ్ల్యూఏకి చెందిన అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ) తుది విచారణ అనంతరం శిక్ష ఖరారు చేసింది. ఆమెకు నాలుగేళ్ల నిషేధం విధించాల్సి ఉండగా, నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లు విచారణలో అంగీకరించడంతో ఏడాది మినహాయించారు. మార్చిలో ఏఐయూ కమల్‌ప్రీత్ రక్తమూత్ర నమూనాలు సేకరించి పరీక్షించగా 'పాజిటివ్' అని తేలడంతో అదే నెల 29న సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో ఆమె భారత ప్రభుత్వ పురస్కారాలు, ప్రోత్సాహకాలకు దూరం కానుంది. గతేడాది టోక్యోలో జరిగిన ఒలింపిక్స్‌లో ఆమె ఆరో స్థానంలో నిలిచింది.

దబంగ్ ఢిల్లీ హ్యాట్రిక్

బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్‌లో దబంగ్ ఢిల్లీ వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' సాధించింది. యూపీ యోధాస్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 44–42తో గెలిచింది. ఢిల్లీ తరఫున నవీన్ 13 పాయింట్లు, మంజీత్ 12 పాయింట్లు స్కోరు చేశారు. యూపీ తరఫున సురేందర్ గిల్ 21 పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 42–33తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. నేడు విశ్రాంతి దినం. శుక్రవారం మూడు మ్యాచ్‌లు జరుగుతాయి.

సినిమా

ఫ్లాష్‌బ్యాక్‌లో...!



• రామ్‌చరణ్

ఫ్లాష్‌బ్యాక్ మోడ్‌లో ఉన్నారట రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, అంజలి, జయరామ్, ఎస్‌జే సూర్య, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. ప్రస్తుతం రామ్‌చరణ్, అంజలిపై కీలక సన్నివేశాలను తీస్తున్నారని తెలిసింది. ఈ షెడ్యూల్ మరో వారం పాటు అక్కడి లొకేషన్స్‌లోనే సాగుతుందట. అయితే ప్రస్తుతం చిత్రీకరిస్తున్న సన్నివేశాలు సినిమాలో ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో వస్తాయని, 1930 కాలం నేపథ్యంలో ఈ సీన్స్‌లో రామ్‌చరణ్, అంజలి భార్యాభర్తలుగా కనిపిస్తారనే ప్రచారం వినిపిస్తోంది. అంతేకాదు.. ఈ సినిమాలో రామ్ చరణ్ డ్యూయల్ రోల్ చేస్తున్నారని టాక్. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నారని సమాచారం.

ఇప్పుడు అదే పెద్ద సవాల్

– కేకే రాధామోహన్



"నేను కాంబినేషన్‌ని కాదు.. కథని బలంగా నమ్ముతాను. 'క్రేజీ ఫెలో' బలమైన కథ. ఫణికృష్ణ కొత్తవాడైనా సినిమాని చక్కగా తీశాడు. యూత్, ఫ్యామిలీ.. ఇలా అన్ని వర్గాల ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేసే క్లీన్ సినిమా ఇది'' అని నిర్మాత కేకే రాధామోహన్ అన్నారు. ఆది సాయికుమార్ హీరోగా, దిగంగనా సూర్యవన్షీ, మిర్నా మీనన్ కథానాయికలుగా నటించిన చిత్రం 'క్రేజీ ఫెలో'. ఫణికృష్ణ సిరికి దర్శకత్వం వహించారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా కేకే రాధామోహన్ మాట్లాడుతూ– ''క్రేజీ ఫెలో' కథని ముందు ఆదికి వినిపించాడు ఫణికృష్ణ. ఆ తర్వాత నేను విన్నాను, నచ్చింది. ఈ సినిమాలో ఆది క్యారెక్టర్ క్రేజీగా, కొత్తగా ఉంటుంది. కోవిడ్ తర్వాత ప్రేక్షకులు ఓటీటీకి అలవాటుపడ్డారు. అంతర్జాతీయ స్థాయి కంటెంట్ దొరుకుతుండటంతో వారి అంచనాలు పెరిగాయి. ఆ అంచనాలు అందుకోవడంతో పాటు వారిని ఆకట్టుకునే కంటెంట్ ఇవ్వడం దర్శక–నిర్మాతలకు ఒక సవాల్‌గా మారింది. 'క్రేజీ ఫెలో' మంచి కంటెంట్ ఉన్న వినోదాత్మక చిత్రం.. ప్రేక్షకులు థియేటర్‌కి వస్తారనే నమ్మకం ఉంది. నిర్మాతలకు ప్రస్తుతం రెవెన్యూ ఆప్షన్స్ పెరిగినప్పటికీ మిగిలేది ఏమీ లేదు. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషికంతో పాటు సినిమా నిర్మాణ ఖర్చులు పెరగడమే కారణం. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఇండస్ట్రీ కార్పొరేట్ స్టయిల్‌లో ఉంది.. నేను కూడా ఇలానే సినిమాలు చేయడానికే ఇష్టపడతాను. ప్రస్తుతం ఆయుష్ శర్మ హీరోగా హిందీ సినిమా నిర్మిస్తున్నాను'' అన్నారు.

వసూళ్ల విషయంలో మేం హ్యాపీ

– ఎన్వీ ప్రసాద్



"మలయాళ హిట్ మూవీ 'లూసిఫర్'ని రీమేక్ చేయడం సాహసం. అలాంటిది తెలుగులో 'గాడ్ ఫాదర్'గా రీమేక్ చేసి సక్సెస్ అందుకోవడం గర్వంగా ఉంది. మా బ్యానర్‌కి ఈ సినిమా ఓ మైలురాయిలా నిలుస్తుంది'' అని నిర్మాత ఎన్వీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి హీరోగా మోహన్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గాడ్ ఫాదర్'. సల్మాన్ ఖాన్, నయనతార, సత్యదేవ్ కీలక పాత్రల్లో నటించారు. కొణిదెల సురేఖ సమర్పణలో ఆర్బీ చౌదరి, ఎన్వీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదలైంది. ఈ సందర్భంగా ఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ– ''గాడ్ ఫాదర్' చిత్రాన్ని మేమే రిలీజ్ చేశాం.. ఏ ఎగ్జిబిటర్‌కి కూడా అమ్మలేదు. మా సినిమా నైజాంలో 4 రోజుల్లోనే 11 కోట్లు వసూలు చేసిందంటే మంచి రెవెన్యూనే కదా?. పైగా అదనపు షోలు వేయలేదు.. టికెట్ ధరలు పెంచలేదు. తెలుగులో ఇప్పటి వరకూ దాదాపు 60 కోట్లు షేర్ వచ్చింది. సమయం లేక హిందీలో మేం ఎక్కువ ప్రచారం చేయలేకపోయాం.. అయినా బాలీవుడ్‌లో తొలి వారంలోనే 10 కోట్లు వసూళ్లు వచ్చాయంటే మామూలు విషయం కాదు. ఓవర్సీస్‌లోనూ కలెక్షన్స్ బలంగా ఉన్నాయి. ఈ సినిమా విడుదల తర్వాత రామ్ చరణ్ చాలా ఆనందపడ్డారు. ఓ కొత్త మార్పు కోసం 'గాడ్ ఫాదర్'లో పాటలు, డ్యాన్స్ లేకుండా చేశాం. దీన్ని ప్రేక్షకులు ఆశీర్వదించారు.. ఇది పెద్ద మార్పుకు సంకేతం. 'గాడ్ ఫాదర్' లాంటి విజయం ఇండస్ట్రీకి అవసరం. ఇలాంటి విజయాలు వచ్చినప్పుడే ఎగ్జిబిటర్ వ్యవస్థ ఉంటుంది. తమిళుల కల్చర్ మూవీ అయిన 'పొన్నియిన్ సెల్వన్' (పీఎస్ 1)కి గౌరవం ఇచ్చి 'గాడ్ ఫాదర్'ని తమిళ్‌లో రిలీజ్ చేయలేదు.. ఈ నెల 14న తమిళనాడులో రిలీజ్ చేస్తున్నాం. మొత్తంగా 'గాడ్ ఫాదర్'కి మా అంచనాలు మించిన వసూళ్లు రావడంతో చాలా సంతోషంగా ఉన్నాం. అయితే కలెక్షన్స్ విషయంలో సోషల్ మీడియాలో వస్తున్న వార్తల గురించి నేను మాట్లాడను. కోవిడ్ నుండి ఇండస్ట్రీ దాదాపు బయటపడింది. ప్రేక్షకుల అభిరుచికి తగ్గ కథలు ఎంపిక చేసుకోవాలి.. అప్పుడే సినిమా ఇండస్ట్రీ బాగుంటుంది'' అన్నారు.

రీ రిలీజ్‌లకు అందుకే ఆదరణ! – రామ్‌గోపాల్ వర్మ



• రామ్‌గోపాల్ వర్మ, నట్టి కుమార్

''పదేళ్లకు ఒకసారి యూత్ జనరేషన్ మారుతుంది. అందుకే రీ రిలీజ్ సినిమాలకు విశేషమైన స్పందన లభిస్తోంది'' అని ప్రముఖ దర్శక, నిర్మాత రామ్‌గోపాల్ వర్మ అన్నారు. నితిన్, ప్రియాంక కొఠారి జంటగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అడవి'. విశాఖ టాకీస్‌పై నట్టి కుమార్ నిర్మించిన ఈ సినిమా 2009లో విడుదలైంది. ఈ చిత్రాన్ని ఈ నెల 14న రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''తరం మారుతున్న ప్రతీసారి గతంలో వచ్చిన కొన్ని సినిమాలు చూడాలని మారుతున్న యూత్ కోరుకుంటుంటారు. 'అడవి'లో ఫారెస్ట్ ఫొటోగ్రఫీ, సాంగ్స్, సౌండ్ వంటివి హైలైట్‌గా ఉంటాయి. గతంలో నేను తీసిన పలు హిట్ సినిమాలను ఆయా నిర్మాతలతో మాట్లాడి రీ రిలీజ్ చేయాలని అనుకుంటున్నాను. కేసీఆర్‌గారి బయోపిక్ చేసే ఆలోచన ఉంది'' అన్నారు. నట్టి కుమార్ మాట్లాడుతూ– ''అడవి' సినిమాను దాదాపు వంద థియేటర్లలో మళ్లీ విడుదల చేస్తున్నాం. అలాగే ప్రభాస్ 'రెబల్'ను ఈ నెల 15న, 22న 'వర్షం' సినిమాను రీ రిలీజ్ చేయబోతున్నాను. రామ్‌గోపాల్ వర్మగారు, నేను పాతికేళ్లుగా మంచి స్నేహితులం. కొద్దికాలం క్రితం మా మధ్య వచ్చిన అభిప్రాయభేదాలు సమసిపోయాయి. మా కాంబినేషన్‌లో మళ్లీ సినిమాలు చేస్తాం'' అన్నారు.

ఇటీవల చిరంజీవి, ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు మధ్య జరిగిన ఘటన గురించి రామ్‌గోపాల్ వర్మ చేసిన ట్వీట్‌పై ఓ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు వర్మ బదులిస్తూ, ''ఈ ఘటన నాకు ఆలస్యంగా తెలిసింది. అక్కడ చిరంజీవితో ఫోటోలు దిగే వ్యక్తులను కాకుండా చిరంజీవినే అనడం ఎంత మాత్రం కరెక్ట్ కాదు'' అన్నారు.



• కృతీ సనన్

చలిలో మిలీ



• జాన్వీ

మైనస్ 16 డిగ్రీల చలి ఉన్న గదిలో చిక్కుకుపోయింది మిలీ. మళ్లీ ఆ గది తలుపులు తెరచుకునేది మరుసటి రోజే. మరి.. మిలీ ఎలా, ఏ విధంగా ఈ ప్రమాదం నుంచి బయటపడింది అనే విషయాలను వెండితెరపై చూడాల్సిందే. జాన్వీ కపూర్ టైటిల్ రోల్‌లో, మనోజ్ పహ్వా, సన్నీ కౌశల్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మిలీ'. ఈ చిత్రం నవంబరు 4న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో ఇరవైనాలుగేళ్ల యువతి మిలి నౌడియాల్ పాత్రలో నటించారు జాన్వీ కపూర్. మలయాళం హిట్ 'హెలెన్'కు 'మిలీ' హిందీ రీమేక్. మాతృతకు దర్శకత్వం వహించిన మత్తు కుట్టి జేవియర్‌నే 'మిలీ'ని తెరకెక్కించారు. ఓ యువతి ఓ షాపులో పార్ట్ టైమ్ జాబ్ చేస్తున్నప్పుడు అనుకోకుండా ఓ డీప్ ఫ్రీజ్ రూమ్‌లో చిక్కుకుపోయినప్పుడు ఏం జరిగింది? అనే అంశం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది.

గెట్.. సెట్.. డబ్

ప్రభాస్ హీరోగా ఓం రౌత్ దర్శకత్వంలో రూపొందిన పాన్ ఇండియా మూవీ 'ఆదిపురుష్'. రామాయణం ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో రాముడిగా ప్రభాస్, సీతగా కృతీ సనన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్, రావణుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం టీజర్ ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. మైథలాజికల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన సినిమా కాబట్టి గ్రాఫిక్స్ వర్క్ ఎక్కువగా జరుగుతోంది. తాజాగా 'ఆది పురుష్' సినిమాకు సంబంధించిన డబ్బింగ్ వర్క్స్ కూడా షురూ అయ్యాయి. ఈ సినిమాలో తన పాత్రకు డబ్బింగ్ చెబుతున్నారు కృతీ సనన్. ''గెట్ సెట్ డబ్'' అంటూ సోషల్ మీడియా వేదికగా 'ఆది పురుష్' డబ్బింగ్ ఆరంభించినట్లు వెల్లడించారు కృతి. ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న రిలీజ్ కానుంది.

మంచి కాన్సెప్ట్ అనిపిస్తోంది

– మంత్రి హరీశ్‌రావు



• సూర్యనారాయణ, హరీశ్‌రావు

సిద్ స్వరూప్, కార్తికేయ రెడ్డి, ఇందు ప్రియ ప్రధాన పాత్రల్లో సూర్యనారాయణ అక్కమ్మ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'దోస్తాన్'. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు రిలీజ్ చేసి, మాట్లాడుతూ – ''ఫస్ట్ లుక్ చూస్తుంటే మంచి కాన్సెప్ట్ ఉన్న కథను సెలక్ట్ చేసుకుని చిత్ర యూనిట్ సినిమా తీశారని అనిపిస్తోంది. ఈ సినిమాలో నటించిన అందరికీ మంచి పేరు వచ్చి, నిర్మాత సూర్యనారాయణకు పెద్ద హిట్‌గా నిలవాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''సిద్ స్వరూప్ అందించిన కథ నచ్చడంతో ఈ సినిమా చేశాం. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది'' అన్నారు సూర్యనారాయణ. ''మంచి కాన్సెప్ట్ ఉన్న సినిమాలో నటించే చాన్స్ ఇచ్చిన సూర్యనారాయణ అక్కమ్మగారికి థ్యాంక్స్'' అన్నారు సిద్ స్వరూప్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
479	140
57,626	17,124

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	10,449	▲	21
డోజోన్స్	29,340	▲	101
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,826	▽	59
డాక్స్	12,172	▽	48
షాంఘై	3,026	▲	46
నికాయ్	26,397	▽	4

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

'అదానీ'కి టెలికం లైసెన్స్



న్యూఢిల్లీ: దేశీయంగా టెలికం సర్వీసులకు సంబంధించి అదానీ డేటా నెట్‌వర్క్‌కు ఏకీకృత లైసెన్సు (యూఎల్) లభించింది. కేంద్రం తాజాగా దీన్ని మంజూరు చేసినట్లు సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. అదానీ గ్రూప్‌లో భాగమైన అదానీ డేటా నెట్‌వర్క్స్ (ఏడీఎన్ఎల్) ఇటీవల జరిగిన 5జీ స్పెక్ట్రం వేలంలో 26 గిగాహెట్జ్ బ్యాండ్‌లో 20 ఏళ్ల వ్యవధికి 400 మెగాహెట్జ్ మేర స్పెక్ట్రంను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 212 కోట్లు వెచ్చించింది. ఈ స్పెక్ట్రంను తమ గ్రూప్ వ్యాపారాల కస్టమర్ల కోసం రూపొందిస్తున్న సూపర్ యాప్‌తో పాటు తమ డేటా సెంటర్ల కోసం మాత్రమే వినియోగించుకునే యోచనలో ఉన్నట్లు అదానీ గ్రూప్ గతంలోనే పేర్కొంది.

గృహ రుణాలపై పండుగ ఆఫర్లు

8.40% రేటుకు ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ ఆఫర్

ముంబై: ఇటీవల ఆర్‌బీఐ రెపో రేటును 1.9 శాతం మేర పెంచడంతో రుణాలపై వడ్డీ రేట్లు పెరిగిపోయాయి. అయినప్పటికీ పండుగల దృష్ట్యా ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ తక్కువ రేటుకే గృహ రుణాలను ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. ఎస్‌బీఐ పావు శాతం మేర గృహ రుణాలపై రేటు తగ్గింపును అందిస్తున్నట్టు ప్రకటించింది. 2023 జనవరి 31 వరకు తీసుకునే గృహ రుణాలపై 8.40 శాతం రేటు అమలవుతుందని తెలిపింది. ప్రాసెసింగ్ ఫీజును ఎత్తివేస్తున్నట్టు తెలిపింది. టాపప్ లోన్లపైనా 0.15 శాతం తక్కువ రేటును ఆఫర్ చేస్తున్నట్టు పేర్కొంది. తన గృహ రుణాల విలువ రూ.6 లక్షల కోట్ల మార్క్‌ను దాటినట్టు వెల్లడించింది. పరిశ్రమలో ఈ మార్క్‌ను సాధించిన తొలి సంస్థగా పేర్కొంది. గృహ రుణాల్లో అతిపెద్ద ఎన్‌బీఎఫ్‌సీ అయిన హెచ్‌డీఎఫ్‌సీ సైతం 0.20% తక్కువగా, 8.40%కే గృహ రుణాలను అందిస్తున్నట్టు ప్రకటించింది. పండుగ ఆఫర్ నవంబర్ 30 వరకు అందుబాటులో ఉంటుందని హెచ్‌డీఎఫ్‌సీ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. కనీసం 750 క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి 8.40% రేటు వర్తిస్తుందని తెలిపింది. జూన్ నాటికి గృహ రుణాల విలువ రూ.5.36 లక్షల కోట్లుగా ప్రకటించింది.

బులియన్ రూ.లలో




ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	50,755	▲	19
బంగారం (99.5 స్వచ్ఛత)	50,552	▲	19
వెండి (కిలో)	57,104	▼	510

ధరల మంట.. పరిశ్రమలకు సెగ!

- సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 7.41%
- ఆహార ధరల తీవ్రత
- ఆగస్టులో ఐఐపీ 0.8% శాతం క్షీణత
- తయారీ, మైనింగ్ పేలవం



న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి బుధవారం వెలువడిన అధికారిక గణాంకాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణం వరుసగా తొమ్మిదవ నెల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి కేంద్రం నిర్దేశిస్తున్న ఆరు శాతం వద్ద కట్టడి పరిధి దాటి నమోదయ్యింది. పైగా ఆగస్టులో 7% ఉంటే, సెప్టెంబర్‌లో 7.41%కి (2021 ఇదే నెల ధరలతో పోల్చి) పెరిగింది. గత ఏడాది సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 4.35 శాతమే. ఇక ఆగస్టులో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో వృద్ధిలేకపోగా 0.8 శాతం క్షీణించింది.

సామాన్యునిపై ధరల భారం

రిటైల్ ద్రవ్యోల్బణ బాస్కెట్‌లో కీలక ఆహార విభాగం ధరలు సెప్టెంబర్‌లో తీవ్రంగా పెరిగాయి. మొత్తంగా రిటైల్ ద్రవ్యోల్బణం ఐదు నెలల గరిష్టం ... 7.41 శాతం పెరగ్గా, ఒక్క ఫుడ్ బాస్కెట్ ఇన్‌ఫ్లేషన్ 8.60 (ఆగస్టులో 7.62 శాతం) శాతానికి చేరింది. కేంద్రం నిర్దేశిస్తున్న 6 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం హద్దు మీరి పెరిగిన నేపథ్యంలో ఈ ఏడాది మే నుంచి వరుసగా నాలుగుసార్లు ఆర్‌బీఐ రెపో రేటు పెంచింది. మేలో 4 శాతంగా ఉన్న రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు) ఈ నాలుగు దఫాల్లో 190 బేసిస్ పాయింట్లు పెరిగి, ఏకంగా 5.9 శాతానికి (2019 ఏప్రిల్ తర్వాత) చేరింది. మరింత పెరగవచ్చనీ ఆర్‌బీఐ సంకేతాలు ఇచ్చింది. రిటైల్ ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సగటు అంచనా 6.7 శాతంకాగా, క్యూ2 , క్యూ3, క్యూ4ల్లో వరుసగా 7.1 శాతం, 6.5%, 5.8 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ భావిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఈ రేటు 5.1 శాతానికి దిగివస్తుందని అంచనావేసింది. అక్టోబర్, నవంబర్‌ల్లోనూ ద్రవ్యోల్బణం ఎగువబాటనే పయనిస్తే, తదుపరి పాలసీ సమీక్ష డిసెంబర్ 5 నుంచి 7 సమయంలో ఆర్‌బీఐ రెపో రేటును మరో అరశాతం పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. గడచిన తొమ్మిది నెలలుగా ద్రవ్యోల్బణం కట్టడిలో ఎందుకు లేదన్న అంశంపై కేంద్రానికి ఆర్‌బీఐ త్వరలో ఒక నివేదిక సమర్పిస్తుందని ఉన్నత స్థాయి వర్గాలు తెలిపాయి.

18 నెలల కనిష్టానికి పారిశ్రామిక రంగం

ఇక ఆగస్టులో పారిశ్రామిక ఉత్పత్తి గడచిన 18 నెలల్లో ఎన్నడూ లేని తీవ్ర పతన స్థాయి 0.8 శాతం క్షీణతను చూసింది. 2021 ఫిబ్రవరిలో ఐఐపీలో 3.2 శాతం క్షీణత నమోదయ్యింది. తాజా సమీక్షా నెల్లో సూచీలో దాదాపు 60 శాతం వెయిటేజ్ ఉన్న తయారీ రంగం కూడా 0.7% క్షీణతను (2021 ఇదే నెలతో పోల్చి) చూసింది. గత ఏడాది ఇదే కాలంలో తయారీ ఉత్పత్తి వృద్ధి రేటు 11.1%. మైనింగ్ ఉత్పాదకత 23.3 శాతం వృద్ధి నుంచి 3.9% క్షీణతలోకి జారింది. విద్యుత్ రంగం ఉత్పత్తి వృద్ధి రేటు 16% నుంచి 1.4 శాతానికి పడిపోయింది. క్యాపిటల్ గూడ్స్ విభాగంలో వృద్ధి రేటు 20% నుంచి 5%కి పడిపోయింది.



కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు

సెన్సెక్స్ లాభం 479 పాయింట్లు



ముంబై: కనిష్ట స్థాయిల వద్ద బ్యాంకింగ్, ఐటీ, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ మార్కెట్ మూడురోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కింది. ద్రవ్యోల్బణ గణాంకాలు, ఫెడ్ మీటింగ్ మినిట్స్ వెల్లడి ముందు యూరప్ మార్కెట్లు, అమెరికా ఫ్యూచర్లు లాభాల్లో ట్రేడవుతుండటం సెంటిమెంట్‌ను బలపరిచింది. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 479 పాయింట్లు బలపడి 57,626 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140 పాయింట్లు పెరిగి 17,124 వద్ద నిలిచింది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో మార్కెట్ పతనంతో ప్రధాన షేర్ల వ్యాల్యుయేషన్లు దిగివచ్చాయి. అలాగే ధరలు గరిష్టస్థాయిల నుంచి కనిష్టాలకు చేరుకున్నాయి. ఇదే అదనుగా భావించిన ఇన్వెస్టర్లు కనిష్ట స్థాయిల వద్ద మధ్య, చిన్న తరహా షేర్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1%–అరశాతం ర్యాలీ చేశాయి. ఒక్క మీడియా షేర్లు మాత్రం స్వల్పంగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.542 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.ఆసియాలో చైనా, దక్షిణ కొరియా సూచీలు లాభపడ్డాయి.

మార్కెట్‌లో మరిన్ని సంగతులు

- చివరిరోజు నాటికి ట్రాక్షన్ టెక్ ఐపీవోకు 2.01 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా మొత్తం 2.12 కోట్ల షేర్లను జారీ చేయగా.., 4.27 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 12 పైసలు పతనమై 82.33 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 82.15 వద్ద గరిష్టాన్ని, 82.37 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది.
- బీఎస్ఈలో రూ.1.56 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రూ.271.67 లక్షల కోట్లకు చేరింది.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

పదేళ్ల క్రితం తీసుకున్న వారికి యూఐడీఏఐ సూచన

న్యూఢిల్లీ: ఆధార్‌కు సంబంధించి యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ (యూఐడీఏఐ) కీలక సూచన చేసింది. పదేళ్ల క్రితం ఆధార్ నంబర్ తీసుకున్న వారు వెంటనే తమ గుర్తింపు, నివాస రుజువులతో వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని కోరింది. అప్‌డేషన్‌ను ఆన్‌లైన్‌లో మైఆధార్ పోర్టల్ నుంచి లేదా ఆధార్ సేవా కేంద్రాల నుంచి చేసుకోవచ్చని సూచించింది. పదేళ్ల క్రితం ఆధార్ తీసుకుని, తర్వాతి కాలంలో ఒక్కసారి కూడా అప్‌డేట్ చేసుకోనివారు.. తమ తాజా వివరాలను అందించాలని కోరింది. ''గత పదేళ్ల కాలంలో వ్యక్తుల గుర్తింపునకు ఆధార్ కీలకంగా మారింది. వివిధ ప్రభుత్వ పథకాలు, సేవలకు ఆధార్ నంబర్‌ను వినియోగిస్తున్నారు. ఎటువంటి అవాంతరాల్లేకుండా ప్రభుత్వ ప్రయోజనాలను అందుకోవాలంటే, వ్యక్తులు తమ ఆధార్ డేటాను అప్‌డేట్ చేసుకోవాలి''అని ఐఆర్‌డీఏఐ పేర్కొంది.



విప్రో లాభం 9% డౌన్

- క్యూ2లో రూ. 2,659 కోట్లు
- ఆదాయం 15% అప్; రూ.19,667 కోట్లు



న్యూఢిల్లీ: సిబ్బంది ఖర్చులు పెరగడం, అమెరికాయేతర మార్కెట్ల నుంచి ఆదాయాలు తగ్గడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఐటీ సేవల సంస్థ విప్రో నికర లాభం 9.3% క్షీణించింది. రూ. 2,659 కోట్లకు పరిమితమైంది. గతేడాది ఇదే కాలంలో లాభం రూ. 2,930 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం సుమారు 15% పెరిగి రూ. 19,667 కోట్ల నుంచి రూ. 22,540 కోట్లకు చేరింది. సీక్వెన్షియల్‌గా లాభం సుమారు 4%, ఆదాయం 5% వృద్ధి చెందాయి. 'ఆర్డర్లు, భారీ డీల్స్, ఆదాయాల్లో పటిష్టమైన వృద్ధి సాధించడం.. మార్కెట్లో మా పోటీతత్వం మెరుగుపడటాన్ని సూచిస్తోంది' అని కంపెనీ సీఈవో థియెరీ డెలాపోర్ట్ తెలిపారు. వివాదాస్పదమైన మూన్‌లైటింగ్‌పై (రెండు సంస్థల్లో ఉద్యోగాలు చేయడం) స్పందిస్తూ ఇది న్యాయపరమైన అంశం కంటే నైతిక విలువలకు సంబంధించిందని డెలాపోర్ట్ పేర్కొన్నారు. ఉద్యోగులు చిన్నా చితకా ఇతరత్రా పనులు చేసుకోవడం ఫర్వాలేదని కానీ ఏకంగా పోటీ కంపెనీకి పని చేయడం మాత్రం నైతికత కాదని ఆయన స్పష్టం చేశారు. మూన్‌లైటింగ్ చేస్తున్న 300 మంది ఉద్యోగులను తొలగించామని విప్రో చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో డెలాపోర్ట్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఇతర విశేషాలు..

- ఆర్డరు బుకింగ్‌లు 23.8 శాతం, భారీ డీల్స్ 42 శాతం పెరిగాయి. క్యూ2లో 725 మిలియన్ డాలర్ల విలువ చేసే 11 భారీ డీల్స్ కుదిరాయి.
- సమీక్షాకాలంలో విప్రో 10,000 మంది ఉద్యోగులను ప్రమోట్ చేసింది. అట్రిషన్ రేటు వరుసగా మూడో త్రైమాసికంలోనూ తగ్గింది. క్యూ1లో 23.3 శాతంగా ఉన్న ఈ రేటు స్వల్పంగా 23 శాతానికి దిగి వచ్చింది.
- సెప్టెంబర్ నాటికి ఉద్యోగుల సంఖ్య నికరంగా కేవలం 605 పెరిగి 2,59,179కి చేరింది. తాజాగా 10,000 మంది ఫ్రెషర్లను తీసుకుంది.

బుధవారం బీఎస్ఈలో విప్రో షేరు సుమారు 1% లాభంతో రూ. 407.75 వద్ద క్లోజయ్యింది.

అంచనాలు మించిన హెచ్‌సీఎల్ టెక్

- లాభం 7 శాతం వృద్ధి; రూ. 3,489 కోట్లు
- రూ. 10 మధ్యంతర డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఐటీ సర్వీసుల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ (హెచ్‌సీఎల్‌టెక్) అంచనాలకు మించి లాభాలను ప్రకటించింది. క్యూ2లో లాభం 7 శాతం వృద్ధి చెంది రూ. 3,489 కోట్లకు చేరింది. గతేడాది సెప్టెంబర్ త్రైమాసికంలో ఇది రూ. 3,259 కోట్లు. ఇక ఆదాయం 19.5 శాతం పెరిగి రూ. 24,686 కోట్లకు చేరింది. సీక్వెన్షియల్‌గా చూస్తే ఆదాయం 5 శాతం, లాభం 6 శాతం పెరిగాయి. జూన్ త్రైమాసికంతో పోలిస్తే క్యూ2లో లాభం 2.7 శాతం, ఆదాయం 3.4 శాతం పెరగవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. కొత్త ఆర్డర్ల బుకింగ్ పటిష్టంగా ఉందని, భవిష్యత్ వృద్ధికి గణనీయంగా ఊతమివ్వగలదని సంస్థ సీఈవో సి. విజయకుమార్ ధీమా వ్యక్తం చేశారు. షేరుకు రూ. 10 చొప్పున కంపెనీ మధ్యంతర డివిడెండు ప్రకటించింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయ గైడెన్స్‌ను 13.5–14.5 శాతానికి పెంచింది. సమీక్షాకాలంలో కొత్తగా 8,359 మంది ఉద్యోగులు చేరారు. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,19,325కి చేరింది. ఇందులో 10,339 మంది ఫ్రెషర్స్ ఉన్నారు. ఐటీ సేవల విభాగంలో అట్రిషన్ రేటు (ఉద్యోగుల వలసలు) 23.8 శాతంగా ఉంది.

బీఎస్ఈలో బుధవారం హెచ్‌సీఎల్ టెక్ షేరు 1% పైగా లాభపడి రూ. 951.65 వద్ద క్లోజయ్యింది.

అన్‌లిమిటెడ్ ఫ్యాషన్ దీపావళి ఆఫర్లు

హైదరాబాద్: దీపావళి పండుగ సందర్భంగా అన్‌లిమిటెడ్ ఫ్యాషన్ ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.7వేల కొనుగోలుపై రెండు జార్ల పిజియాన్ మిక్సర్ గ్రైండర్(రూ.3,175 విలువైన)ను రూ.399లకే పొందవచ్చు. అలాగే 3,500 కొనుగోలుపై రూ.2వేలు విలువ చేసే 10 పీసుల సెల్లో డిన్నర్ సెట్ రూ.199లకే అందిస్తుంది. ప్రారంభ ధర రూ.200తో అన్ని రకాల బ్రాండెడ్ ఫ్యాషన్ దుస్తులను అందుబాటులోకి తెచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ కార్డు ద్వారా జరిపే లావాదేవీలపై అదనపు డిస్కౌంట్ పొందవచ్చు. ఈ గొప్ప అవకాశాన్ని కస్టమర్లందరూ వినియోగించుకోవాలని కంపెనీ సీవోవో వినీత్ జైన్ కోరారు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగాల ప్రత్యేకం-2022
ప్రముఖ సబ్జెక్ట్ నిపుణులు ప్రిపేర్ చేసిన 'తెలంగాణ హిస్టరీ ప్రాక్టీస్ టెస్టులు'

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

గ్రూప్-1 ప్రిలిమ్స్.. తుది మెరుగులు!

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా జరిగే గ్రూప్-1 పరీక్షకు మరో మూడు రోజుల సమయమే ఉంది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల(అక్టోబర్) 16న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనుంది. ఇప్పటి వరకు పరీక్షకు సన్నద్ధమైన అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌కు తుది మెరుగులు దిద్దుకోవాలి. నేర్చుకున్న అంశాలను మరోమారు రివిజన్ చేసుకోవాలి. పరీక్ష ముందు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలి. గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్షకు ముందు అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు..



టీఎస్‌పీఎస్సీ ఎగ్జామ్స్

పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల్లో చాలా మంది పరీక్ష సమయం దగ్గర పడగానే అనవసర ఆందోళనకు గురవుతుంటారు. ప్రిపరేషన్ పూర్తిచేయలేదని కుంగిపోతుంటారు. వారు ఒక్క విషయాన్ని గమనించాలి. ఎంత చదివినా ఇంకా చదవాల్సిన అంశాలు మిగిలే ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు ఈ విషయంలో ఆందోళన చెందొద్దు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన మనసుతో పరీక్షకు హాజరవడంపైనే దృష్టి సారించాలి. ఈ సమయంలో కొత్త అంశాలను చదవకుండా ఇప్పటివరకు నేర్చుకున్న అంశాలనే రివిజన్ చేసుకోవాలి.

క్లిష్టతపై కంగారొద్దు

రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలో ప్రశ్నల సరళి, కాఠిన్యతపై అభ్యర్థులు కంగారు పడొద్దు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గత పరీక్షల మాదిరి ప్రశ్నల సరళి, ప్రామాణికత ఉంటుందని కచ్చితంగా చెప్పలేం. పరీక్షలో అడిగే 150 ప్రశ్నల్లో కొన్ని ప్రశ్నలు దాదాపు అభ్యర్థులందరికీ కఠినంగానే ఉంటాయి. అలాంటప్పుడు మార్కులతోపాటు కటాఫ్ తగ్గే అవకాశం ఉంటుంది. కాబట్టి క్లిష్టమైన ప్రశ్నలను చూసి అభ్యర్థులు ఆందోళన చెందొద్దు. తమను తాము తక్కువగా అంచనా వేసుకోవద్దు. ఆత్మన్యూనత భావన నుంచి బయటపడాలి. ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరుకావాలి. అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేందుకు ప్రయత్నించాలి.

ఆప్షన్లపై అప్రమత్తం

బహుళైచ్చిక సమాధాన ప్రశ్నల్లో ఆప్షన్లు గందరగోళానికి గురిచేసేవిగా ఉంటాయి. అభ్యర్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు అత్యంత సారూప్యమున్న ఆప్షన్లను ఇస్తారు. కాబట్టి అభ్యర్థులు ప్రశ్నను చదవగానే సమాధానాన్ని ఊహించుకోవద్దు. ఆప్షన్లను అప్రమత్తతతో పరిశీలించాలి. వాటిని అర్థం చేసుకుని సరైన సమాధానాన్ని ఎంచుకోవాలి.

తెలిసిన ప్రశ్నలకు ముందుగా

ప్రశ్నపత్రంలో బాగా తెలిసిన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు గుర్తించాలి. క్లిష్టమైన ప్రశ్నలకు తర్వాత సమయాన్ని కేటాయించాలి. సబ్జెక్టు విషయంలో జనరల్‌స్టడీస్‌కు సంబంధించిన ఎకానమీ, జాగ్రఫీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర సబ్జెక్టులు ఒకదానికొకటి అనుసంధానాన్ని కలిగి ఉంటాయి. వాటిల్లోంచి అడిగే క్లిష్టమైన ప్రశ్నలకు సమకాలీన అంశాలను పరిగణనలోకి తీసుకుని జవాబులను గుర్తించాలి.

వ్యూహాత్మకంగా ఆలోచించాలి

పరీక్షలో కొన్ని తెలియని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేటప్పుడు అభ్యర్థులు వ్యూహాత్మకంగా ఆలోచించాలి. అంటే.. తెలిసిన అంశాల ఆధారంగా తెలియని ప్రశ్నలకూ సమాధానాలు రాబట్టాలి. ఉదాహరణకు కేంద్రంలో ఎంపీలపై అనర్హత వేటు సందర్భంలో కేంద్ర ఎన్నికల సంఘం సలహా మేరకు రాష్ట్రపతి చర్యలు తీసుకుంటారు. అలాగే రాష్ట్రంలో శాసన సభ్యుల అనర్హత విషయంలో ఎవరి సలహా మేరకు గవర్నర్ చర్య తీసుకుంటారనే ప్రశ్నకు చాలామంది అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం అని పొరపాటు పడే అవకాశం ఉంది. కానీ ఇటువంటి ప్రశ్నల విషయంలో అభ్యర్థులు తెలివిగా వ్యవహరించాలి. 1993కు ముందు రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఏర్పడక ముందు ఎవరి సలహా తీసుకునేవారు అని ఆలోచించాలి. దాంతో రాష్ట్రంలోనూ కేంద్ర ఎన్నికల సంఘం సలహా మేరకే రాష్ట్ర శాసన సభ్యులపై అనర్హత వేటు వేసేందుకు గవర్నర్‌కు అధికారాలుంటాయనే తెలివైన గెస్సింగ్ ద్వారా సమాధానాన్ని గుర్తించవచ్చు.

మరిన్ని జాగ్రత్తలు..

- పరీక్ష హాల్ టికెట్, బ్లూ/బ్లాక్ పెన్నులను ముందుగానే సిద్ధం చేసుకోవాలి. హాల్ టికెట్‌పై సూచనలను చదివి అవసరమైన వాటిని సిద్ధం చేసుకోవాలి.
- పరీక్షా కేంద్రాన్ని ముందు రోజే సందర్శించి నిర్ధారణ చేసుకోవాలి.
- పరీక్ష ముందు రోజు తగినంత నిద్రపోవాలి. ఒత్తిళ్లకు దూరంగా ఉండాలి.
- పరీక్ష హాల్లోకి కాలిక్యులేటర్లు, ఫోన్, బ్లూటూత్, పెన్‌డ్రైవ్‌లు, వాచ్ తదితర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుమతించరు. వాటిని తీసుకొచ్చి ఆందోళన చెందడం కంటే తీసుకురాకుండా ఉండటం మేలు.
- పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను రెండు గంటల ముందునుంచే అనుమతిస్తారు. 15 నిమిషాల్లో పరీక్షల ప్రారంభం అవుతుందనగా గేట్ మూసివేస్తారు. అభ్యర్థులు వీలైనంత తొందరగా కేంద్రానికి చేరుకుంటే పరీక్ష హాల్లో ప్రశాంతంగా ఉండొచ్చు.
- ఓఎంఆర్ షీట్‌ను ఇన్విజిలేటర్‌కు ఇచ్చే సమయంలో దానిపై పొందుపరిచిన హాల్ టికెట్ నంబరు, టెస్ట్ బుక్‌లెట్ నంబరు తదితర సమాచారాన్ని నిర్ధారించుకోవాలి.

నిర్లక్ష్యం చేయొద్దు

అభ్యర్థులు చిన్న చిన్న విషయాలపైనా జాగ్రత్తగా వ్యవహరించాలి. వేటినీ నిర్లక్ష్యం చేయొద్దు. ప్రశ్నపత్రంపై టెస్ట్ బుక్‌లెట్ సిరీస్‌కు బదులు ఆరు అంకెల టెస్ట్ బుక్‌లెట్ నంబరును ముద్రించనున్నారు. ఓఎంఆర్ షీట్‌లోనూ ఈ ఆరంకెల టెస్ట్ బుక్‌లెట్ నంబరునే బబ్లింగ్ చేయాలి. అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన మోడల్ ఓఎంఆర్ షీట్‌ను పరిశీలించి అవగాహన ఏర్పరచుకోవాలి.

– బి.కృష్ణా రెడ్డి, సబ్జెక్టు నిపుణులు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఐఎన్, హైదరాబాద్‌లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్.. 2023 జనవరిలో ప్రారంభమయ్యే పోస్ట్–గ్రాడ్యుయేట్ సర్టిఫికేట్ కోర్స్ ఇన్ న్యూట్రిషన్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 20
» అర్హత: మాస్టర్స్ డిగ్రీ(బయోకెమిస్ట్రీ/ఫిజియాలజీ/ఫుడ్–న్యూట్రిషన్/ డైటెటిక్స్/బయాలజీ/జువాలజీ/బయో మెడికల్ సైన్సెస్) లేదా ఎంబీబీఎస్, బీడీఎస్, బీహెచ్ఎంఎస్, బీపీటీ, బీయూఎంఎస్,బ్యాచిలర్ ఆఫ్ నేచురోపతి, బీఫార్మసీ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 50 ఏళ్లు మించకూడదు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్,ఎక్స్‌టెన్షన్–ట్రైనింగ్, ఎన్ఐఎన్, తార్నాక, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరి తేది: 01.11.2022
» వెబ్‌సైట్: www.nin.res.in

బార్క్, ముంబైలో 78 రీసెర్చ్ అసోసియేట్ పోస్టులు

ముంబైలోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్(బార్క్).. రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 78
» విభాగాలు: ఆర్ అండ్ డీ, కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, హైడ్రోజన్ ఎనర్జీ తదితరాలు.
» అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎంటెక్/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.

వేతనం

» రీసెర్చ్ అసోసియేట్ 1: నెలకు రూ.47,000తో పాటు ఇతర అలవెన్సులు కల్పిస్తారు.
» రీసెర్చ్ అసోసియేట్ 2: నెలకు రూ.49,000తో పాటు ఇతర అలవెన్సులు కల్పిస్తారు.
» రీసెర్చ్ అసోసియేట్ 3: నెలకు రూ.54,000తో పాటు ఇతర అలవెన్సులు కల్పిస్తారు.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫీసర్, రిక్రూట్‌మెంట్–5, సెంట్రల్ కాంప్లెక్స్, బార్క్, ట్రాంబే, ముంబై–400085 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 28.10.2022
» వెబ్‌సైట్: www.barc.gov.in

జవహర్ నవోదయ విద్యాలయాల్లో తొమ్మిదో తరగతిలో ప్రవేశాలు

నవోదయ విద్యాలయ సమితి.. దేశవ్యాప్తంగా ఉన్న 650 జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: ప్రభుత్వం లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో 2022–23 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.
» వయసు: 01.05.2008 నుంచి 30.04.2010 మధ్య జన్మించి ఉండాలి.
» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.10.2022
» ఎంపిక పరీక్ష తేది–స్థలం: 11.02.2023, సంబంధిత జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయం లేదా ఎన్‌వీఎస్ కేటాయించిన ఇతర కేంద్రంలో పరీక్ష నిర్వహిస్తారు.
» వెబ్‌సైట్: navodaya.gov.in

యూకో బ్యాంక్, కోల్‌కతాలో 10 సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులు

కోల్‌కతాలోని యూకో బ్యాంక్‌లో సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 10
» అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఆర్మీ, నేవీ, వైమానిక దళం లేదా పారామిలిటరీ ఫోర్సెస్ అసిస్టెంట్ కమాండెంట్స్/కమీషన్డ్ ఆఫీసర్‌గా ఐదేళ్ల పని అనుభవం ఉండాలి.
» వయసు: 01.01.2022 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» జీతం: నెలకు రూ.36,000 నుంచి రూ.63,840 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:19.10.2022
» ఆన్‌లైన్ పరీక్ష తేది: నవంబర్ 2022/డిసెంబర్ 2022
» వెబ్‌సైట్: www.ucobank.com

ఐఐటీ కాన్పూర్‌లో 119 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు

కాన్పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 119
» అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీ(కంప్యూటర్ అప్లికేషన్) ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు:21 నుంచి 30 ఏళ్ల వయసు ఉండాలి.
» జీతం: నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/జాబ్ ఓరియంటెడ్ ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 09.11.2022
» వెబ్‌సైట్: iitk.ac.in

ప్రతిభకు ప్రోత్సాహం.. ఎన్ఎంఎంఎస్

ఎన్ఎంఎంఎస్ ప్రకటన విడుదల

ప్రతిభ ఉండి, ఆర్థిక సమస్యలు ఎదుర్కొనే విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) కింద ఆర్థిక చేయూతనిస్తోంది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ చదివే పేద విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించే ఉద్దేశంతో ఏటా ఈ స్కాలర్‌షిప్స్‌ను అందిస్తోంది. ప్రస్తుతం 2022 సంబంధించి ఎన్ఎంఎంఎస్ నోటిఫికేషన్‌ను ఏపీ డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ విభాగం విడుదల చేసింది.



రూ.12వేల స్కాలర్‌షిప్

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12వేలను స్కాలర్‌షిప్‌గా అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తి చేసే వరకూ.. ఈ ఉపకార వేతనం లభిస్తుంది.

అర్హతలు

ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో చదివే విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. ఏడో తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. తుది ఎంపిక సమయం నాటికి 8వ తరగతిలో 55శాతం మార్కులు పొందాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు.

ఎంపిక విధానం

ఎన్ఎంఎంఎస్ రాత పరీక్ష ద్వారా విద్యార్థులను స్కాలర్‌షిప్స్‌కు ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష ఇలా

అర్హులైన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లుగా ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ టెస్ట్(మ్యాట్), స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సాట్).. ఇలా రెండు పేపర్లు కలిపి 180 ప్రశ్నలకు 180 మార్కులుంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు.

మ్యాట్

ఈ పేపర్‌లో మూడు విభాగాల నుంచి 90 ప్రశ్నలను అడుగుతారు. మెంటల్ ఎబిలిటీ–45 ప్రశ్నలు, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ–20 ప్రశ్నలు, హిందీ ప్రొఫిషియన్సీ నుంచి 25 చొప్పున ప్రశ్నలను ఇస్తారు.

సాట్

ఈ పేపర్‌లో కూడా మూడు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 90 ప్రశ్నలుంటాయి. ఇందులో సైన్స్–35 ప్రశ్నలు, సోషల్ స్టడీస్–35, మ్యాథమెటిక్స్ విభాగం నుంచి 20 చొప్పున ప్రశ్నలను అడుగుతారు.

దరఖాస్తు విధానం

ఆయా స్కూళ్ల రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలి. అనంతరం సంబంధిత ప్రింటవుట్లను,ధ్రువీకరణ పత్రాలను డీఈవోలకు పంపించాలి.

పరీక్ష ఫీజు

ప్రతి విద్యార్థి పరీక్ష ఫీజు కింద రూ.100 ఎస్‌బీఐ చలానా రూపంలో సంబంధిత ధ్రువపత్రాలతో పాటు జతచేయాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తు చేయడానికి చివరి తేదీ: 31.10.2022.
- దరఖాస్తు ఫారాలు, ధ్రువపత్రాలను డీఈవో కార్యాలయంలో అందజేసేందుకు చివరి తేదీ: 02.11.2022.
- డీఈవో లాగిన్‌లో ఆమోదం పొందేందుకు చివరి తేదీ: 04.11.2022
- వెబ్‌సైట్: https://bse.ap.gov.in

క్లుప్తంగా

వైవీయూలో జర్నలిజం పీజీ డిప్లొమా కోర్సులకు అనుమతి

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ పబ్లిక్ రిలేషన్ (పీజీడీపీఆర్), పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ తెలుగు జర్నలిజం (పీజీడీటీజే) కోర్సుల నిర్వహణకు అనుమతి లభించింది. ముద్రణ, దృశ్యశ్రవణ మాధ్యమాల్లో ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీల్లో ప్రజా సంబంధాల అధికారులు, మీడియా కన్సల్టెంట్‌లుగా చేరేందుకు విద్యార్థులకు ఈ కోర్సు ఉపయోగకరంగా ఉంటుంది. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య మునగల సూర్యకళావతి, రిజిస్ట్రార్ ఆచార్య డి.విజయరాఘవప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో ఈ కోర్సులు అందుబాటులోకి వచ్చినట్లు వైవీయూ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ శాఖ సమన్వయకర్త డాక్టర్ తమ్మినేని శ్యామ్‌స్వరూప్ బుధవారం తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరం నుంచి ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు.

నవంబర్ 23 నుంచి విశాఖలో ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్



లోగోను ఆవిష్కరిస్తున్న ఆదిత్యకుమార్ నాయక్ తదితరులు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ఈ ఏడాది నవంబర్ 23 నుంచి 25వ తేదీ వరకు 13వ రాష్ట్రస్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ అపెక్స్–2022 నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ ఆదిత్యకుమార్ నాయక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆధ్వర్యంలో జరుగనున్న ఎగ్జిబిషన్ విశాఖపట్నం, రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మీ కల్యాణమండపంలో నిర్వహిస్తామన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కృష్ణలంకలోని పోస్టల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఎగ్జిబిషన్ విధివిధానాలను ఆయన విడుదల చేశారు. విశాఖపట్నంలోని లైట్‌హౌస్, కూచిపూడి నృత్యం, కలంకారి డిజైన్ నేపథ్యంలో ఉండే లోగోను ఆవిష్కరించారు. ఆదిత్యకుమార్ నాయక్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్‌ను విభజించిన తర్వాత జరగబోయే మొదటి రాష్ట్రస్థాయి ఫిలాటలి ప్రదర్శన ఇదేనన్నారు. పాఠశాల విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ తదితర పోటీలను డిపార్ట్‌మెంట్ ఫిలాటెలిస్టుల సమన్వయంతో నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలో నివసించే స్టాంప్ సేకరణదారులకు ఎగ్జిబిషన్‌లో పాల్గొనే అవకాశం కల్పించామన్నారు. ఫిలాటలి అండ్ టెక్నాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ జి.వి.బాలసరస్వతి, రిక్రూట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులకు పోస్టింగ్

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలో వైద్యులు, వైద్య సిబ్బంది నియామక ప్రక్రియ కొనసాగుతోంది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఇచ్చారు. ఇటీవల 375 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ప్రత్యక్ష పద్ధతిలో భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చారు. 375 పోస్టులకు గాను 191 మంది ఎంపికయ్యారు. వీరందరికీ పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన పోస్టులు వాక్ ఇన్ ఇంటర్వ్యూల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు.

'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లను వేగవంతం చేయాలి'



సాక్షి, అమరావతి/భవానీపురం (విజయవాడ పశ్చిమ): జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ (ఎం.ఐ.జి.) లే ఔట్‌ల పనుల్లో పురోగతి కనిపించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల సొంతింటి కలను త్వరగా నిజం చేయాలని కోరారు. పనులు ప్రారంభమైనచోట ఎప్పటికప్పుడు పురోగతి ఉండాలన్నారు. భూసేకరణ జరగని ప్రాంతాల్లో వెంటనే చేపట్టాలని సూచించారు. సీఎం జగన్ ఆశయం నెరవేర్చటంలో భాగంగా ఈ లేఔట్‌లపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని చెప్పారు. పక్కాగా డీపీఆర్, ప్రతిపైసా ఖర్చులు, రాబడుల వివరాలు పారదర్శకంగా ఉండాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ల ఏర్పాటు సీఎం లక్ష్యమని చెప్పారు. ఆ దిశగా వేగంగా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. మొత్తం 135 నియోజకవర్గాల్లోని లేఔట్‌ల కోసం భూమిని గుర్తించినట్టు అధికారులు తెలిపారు. 17 చోట్ల టెండర్లతో పాటు లాటరీ ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. ఏపీ లేఔట్ల మౌలిక వసతుల కల్పన పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.



85% రాష్ట్ర విద్యార్థులకే.. మెడికల్ సీట్లు

శుభవార్త చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం.. 'బీ' కేటగిరీ సీట్లపై ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న తరుణంలో ఆయా కోర్సుల్ని చేయాలనుకునే విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు సంబంధించిన బీ కేటగిరీ సీట్లలో 85 శాతం సీట్లను ఏపీ విద్యార్థులకు రిజర్వ్ చేస్తూ అడ్మిషన్ల నిబంధనలు సవరించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 11 ప్రభుత్వ, 15 ప్రైవేట్, 2 మైనార్టీ మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ప్రైవేట్ కాలేజీల్లో 2,450 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా.. ఈ ఏడాది రెండు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఒక్కో కాలేజీకి 50 చొప్పున 100 సీట్లు పెరిగాయి. మరోవైపు తిరుపతి జిల్లా రేణిగుంటలో శ్రీ బాలజీ మెడికల్ కాలేజీలో అడ్మిషన్లకు అనుమతులు లభించాయి. ఇక్కడ 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. అంటే ప్రైవేట్ కాలేజీల్లో 2,700 ఎంబీబీఎస్ సీట్లు ఈ విద్యా సంవత్సరం అందుబాటులో ఉంటాయి. ఇందులో బీ కేటగిరీ కింద 35 శాతం అంటే 945 సీట్లు ఉన్నాయి. గత ఏడాది వరకూ వీటికి అన్ని రాష్ట్రాల విద్యార్థులు అర్హులుగా ఉన్నారు. తాజా సవరణ మేరకు బీ కేటగిరీలో సీట్లలో 85 శాతం సీట్లు అంటే సుమారు 804 సీట్లు ప్రత్యేకంగా ఏపీ విద్యార్థుల కోసం కేటాయిస్తారు. మిగతా 15 శాతం సీట్లు మాత్రమే ఓపెన్ కోటాలో ఇతర రాష్ట్ర విద్యార్థులు పోటీ పడతారు. ఓపెన్ కోటాలోనూ మన రాష్ట్ర విద్యార్థులకు కూడా అవకాశం ఉంటుంది.

రాష్ట్ర విద్యార్థులకు ఎంతో మేలు

ఇప్పటివరకు 'బీ' కేటగిరీలో ఉండే 35 శాతం కోటాలో ఎలాంటి స్థానిక రిజర్వేషన్లు లేవు. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు 'బీ' కేటగిరీ ఎంబీబీఎస్ సీట్లను ఎక్కువగా సొంతం చేసుకునేందుకు అవకాశాలు ఉండేవి. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో మన విద్యార్థులకు ఎంతో మేలు చేకూరనుంది.

'కన్వీనర్' సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లలో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్) యూజీ– 2022లో అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాసు చేసుకోవాల్సిందిగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6గంటల వరకూ దరఖాస్తులకు అవకాశం కల్పించారు. https://ugcq.ntruhsadmissions.com/ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ అప్లికేషన్‌ను అందుబాటులో ఉంచారు. పూర్తి నోటిఫికేషన్ http://ntruhs.ap.nic.in/ వెబ్‌సైట్‌లో ఉంది. నియమ, నిబంధనల కోసం 89787 80501, 79977 10168, 93918 05238, 93918 05239 నంబర్లలోను, ఫీజు చెల్లింపు కోసం 83338 83934లోనూ సంప్రదించాలి.

బోధనా విధానంపై సర్వే

- టీచర్ల నుంచి అభిప్రాయాల సేకరణ
- 'సాల్ట్' పథకం అమలులో భాగంగా ప్రభుత్వం ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులకు వృత్తిపరంగా నైపుణ్యాలను మరింత పెంపొందించే ప్రణాళికలో భాగంగా పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం వారి నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టింది. అనంతరం శిక్షణ ప్రాజెక్టును అమల్లోకి తేనుంది. ఆంధ్రప్రదేశ్ అభ్యసన, పరివర్తన సహాయక పథకం (సాల్ట్) అమలులో భాగంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి జిల్లాల అధికారులకు సర్క్యులర్ ద్వారా సూచనలు చేశారు. ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి అవసరాలను అంచనా వేయడానికి వారి అవసరాల ఆధారంగా తగిన శిక్షణ అందించేందుకు ఆన్‌లైన్ సర్వే నిర్వహిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. పాఠశాల విద్య ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు, డీఈవోలకు సంబంధిత సమాచారం పంపారు. ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల ఉపాధ్యాయులంతా విధిగా ఆన్‌లైన్ సర్వేను పూరించాలన్నారు. బుధవారం నుంచి ఈ సర్వే ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభమైందని, ఇది అక్టోబర్ 16వ తేదీ సాయంత్రం వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులంతా వారి సబ్జెక్టులతో సంబంధం లేకుండా 1నుంచి 10 తరగతులు బోధించేలా అవసరమైన సూచనలు జారీ చేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులంతా ఆన్‌లైన్ సర్వే పూరించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. హెచ్‌ఎంలంతా తమ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను నిర్ణీత సమయంలోగా సర్వే పూర్తి చేసేలా చూడాలని కోరారు.

లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు

- ఐదు నెలల కాల పరిమితితో కోర్సు
- వచ్చే నెల ఒకటో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి : రాష్ట్ర పౌర గ్రంథాలయాల శాఖ ఆధ్వర్యంలో 5 నెలల కాల పరిమితితో లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(సీఎల్ఐఎస్సీ) సర్టిఫికెట్ కోర్సును అందిస్తున్నట్టు గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన పీఎస్ స్కూల్ ఆఫ్ లైబ్రరీ సైన్స్(విజయవాడ), రాయలసీమ ఇనిస్టిట్యూట్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(గాంధీనగర్, కడప), వావిలాల సంస్థ లైబ్రరీ సైన్స్(అరండల్ పేట, గుంటూరు)లలో ఒక్కో సంస్థలో తెలుగు మాధ్యమంలో 40, ఆంగ్ల మాధ్యమంలో 40 సీట్ల చొప్పున మొత్తం 240 సీట్లు ఉన్నట్టు చెప్పారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకు సర్టిఫికెట్ కోర్సు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇంటర్(జనరల్) లేదా యూజీసీ గుర్తింపు కలిగిన ఏదైనా విద్యా సంస్థలో తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితాను రూపొందిస్తామన్నారు. డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైతే ఎంపికలో వెయిటేజీ ఉంటుందని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు నవంబర్ ఒకటో తేదీ నుంచి 15 వరకు ఆయా సంస్థల ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తులు పొందొచ్చని, నవంబరు 18లోగా వాటిని ప్రిన్సిపాళ్లకు పంపించాలని సూచించారు.

వైఎస్సార్ బీమా పేరిట మోసం

- అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడి అరెస్టు
- 9 అకౌంట్లలో ఉన్న రూ.7,34,964 ఫ్రీజ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: వైఎస్సార్ బీమా పేరుతో మోసానికి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడిని వైఎస్సార్ జిల్లా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ జిల్లాలో రెండు నెలలుగా ఓ అంతర్రాష్ట్ర ముఠా పథకం ప్రకారం కోవిడ్ సందర్భంగా మరణించిన మృతుల వివరాలను సేకరిస్తున్నది. వాటి ఆధారంగా ఆయా మృతుల బంధువులకు ఫోన్‌లు చేసి.. తాము కలెక్టరేట్ నుంచి ఫోన్ చేస్తున్నామని, వైఎస్సార్ బీమా పథకం కింద నష్టపరిహారం వస్తుందని మభ్యపెడుతోంది. అయితే అంతకు ముందు.. కొంతమొత్తం ప్రభుత్వానికి చెల్లిస్తేనే ఆ మేరకు నష్టపరిహారం మంజూరవుతుందని అమాయక ప్రజలను నమ్మిస్తున్నది. అనంతరం ఫోన్–పే తదితర మనీ వ్యాలెట్ల నుంచి లక్షల రూపాయలను స్వాహా చేస్తోంది. కడపకు చెందిన బీరం రమణారెడ్డి, నిర్మల, ఎం.వి. సునీత, ఖాజీపేటకు చెందిన నాగవేణి, పెండ్లిమర్రికి చెందిన విఘ్నేశ్వరి, విజయకుమారి, బి.మఠానికి చెందిన కృష్ణచైతన్య, ప్రొద్దుటూరుకు చెందిన జింక హారతి, బద్వేల్‌కు చెందిన పి.ఆదిలక్ష్మి సదరు ముఠా చేతిలో చిక్కి సుమారు రూ.9 లక్షల మేరకు సమర్పించుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 6వ తేదీన కేసు నమోదు చేసి కడప వన్‌టౌన్ సీఐ ఎస్.వి.నాగరాజు దర్యాప్తు చేపట్టారు. కేసు పరిశోధనలో భాగంగా కడప సైబర్ క్రైం టీం సహాయంతో యూపీఐల ఆధారంగా 9 బ్యాంక్ అకౌంట్లను గుర్తించారు. వీటిలోని రూ.7,34,964 ఫ్రీజ్ చేశారు. ముఠాలో సభ్యుడైన ఖాజీపేట మండలం మిడుతూరు గ్రామానికి చెందిన మీనుగ వెంకటేష్‌ను ఇర్కాన్ జంక్షన్ వద్ద అరెస్ట్ చేశారు. కొంతమంది వ్యక్తులతో కలిసి వెంకటేష్ ఢిల్లీలో ఓ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి బీమా పేరిట దందాను నడుపుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ పాల్గొన్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

నవంబర్ 4 నుంచి ఆక్వా ఎక్స్ ఇండియా–22

సాక్షి, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వేదికగా నవంబర్ 4,5,6 తేదీల్లో నాల్గో ఆక్వా ఎక్స్ ఇండియా–2022ను విజయవంతం చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. ఆక్వా రైతులతో పాటు ఈ రంగంలో ఉన్న ప్రతీ ఒక్కర్ని ఒకే వేదికపైకి తీసుకురావాలన్న సంకల్పంతో ప్రతియేటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చేపల ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడంలో సమీకృత సమగ్ర పద్ధతిలో మత్స్య రంగ అభివృద్ధిని సమన్వయం చేయడంలో ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. విజయవాడలో బుధవారం రాత్రి ఓ హోటల్‌లో నిర్వహించిన ఆక్వా ఎక్స్ ఇండియా కర్టన్ రైజర్ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఆక్వా రంగ అభ్యున్నతి కోసం మూడేళ్లుగా సీఎం వైఎస్ జగన్ ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం వలనే ఈ రంగంలో దేశంలోనే నంబర్‌వన్‌గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు దంతులూరి వేణు, వి.రామరాజు, డాక్టర్ సమీర్ పాల్గొన్నారు.

ఏపీ మెడ్‌టెక్ జోన్ నుంచి ఎంఆర్ఐ పరికరాలు

- 1.5 టెస్లా ఎంఆర్ఐ సూపర్ కండక్టింగ్ మాగ్నెట్స్ తయారీ
- దేశంలోనే తొలిసారిగా ఇక్కడ నుంచే పరీక్ష, అభివృద్ధి, ఉత్పత్తి
- ఇకపై తక్కువ వ్యవధిలోనే ఎంఆర్ఐ స్కానింగ్ ఫలితాలు



మెడ్‌టెక్ జోన్ తయారు చేసిన సూపర్ కండక్టింగ్ మాగ్నెట్స్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం : వైద్య ఉపకరణాల ఉత్పత్తికి వేదికగా నిలుస్తూ ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చుకున్న ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ మరో అత్యాధునిక ఆవిష్కరణకు కేంద్ర బిందువుగా మారింది. ఎంఆర్ఐ పరికరాల్లో ఉపయోగించే మాగ్నెట్స్‌లో అత్యుత్తమ ఫలితాలను తక్కువ కాలంలోనే అందించేలా సూపర్ కండక్టింగ్ మాగ్నెట్స్‌ని తయారు చేసింది. మెడ్‌టెక్ జోన్ నుంచే పరికరాల ఉత్పత్తి, పరీక్షలు, అభివృద్ధి జరగడం దేశంలోనే తొలిసారి కావడం విశేషం. మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ)ని అత్యంత శక్తివంతమైన అయస్కాంత క్షేత్రం, రేడియో తరంగాలను ఉపయోగించడంపై ఆధారపడి ఉంటుంది. ఛాతీ, ఉదరం, మెదడు, వెన్నెముక లేదా కటి ప్రాంతంతో సంబంధం ఉన్న అనేక భాగాల ఆరోగ్య స్థితిగతుల్ని తెలుసుకునేందుకు ఎంఆర్ఐ తీస్తారు. ఎంఆర్ఐ స్కానర్ల నుంచి వచ్చే అయస్కాంత క్షేత్రాలు, రేడియో తరంగాలు శరీర కణజాలాల్లో ఉండే ప్రోటాన్‌లతో జరిపే పరస్పర చర్య ద్వారా ఆ భాగానికి సంబంధించిన చిత్రాన్ని తీస్తుంది. ఈ స్కాన్ ఆధారంగా.. ఆరోగ్య సమస్యల్ని వైద్యులు నిర్ధారిస్తుంటారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 1.5 టెస్లా ఎంఆర్ఐ కండక్టింగ్ మాగ్నెట్స్‌ని మాత్రమే వినియోగిస్తున్నారు. కానీ.. ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో మాత్రం ఎంఆర్ఐలలో అత్యంత కీలకమైన పరికరంగా పరిగణించే సూపర్ కండక్టింగ్ మాగ్నెట్స్‌ని మరింత శక్తివంతంగా తయారు చేశారు. దీని ద్వారా ఎంఆర్ఐ స్కానింగ్ తీసే సమయం మరింత తగ్గే అవకాశం ఉందని మెడ్‌టెక్ వర్గాలు వెల్లడించాయి. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఈ సూపర్ కండక్టింగ్ మాగ్నెట్స్‌ని ఉత్పత్తి చేయడమే కాకుండా.. మెడ్‌టెక్ జోన్ లోనే పరీక్షలు నిర్వహించడంతో పాటు.. పరికరాలనూ అభివృద్ధి చేశారు. ఎంఆర్ఐ స్కానర్‌ను తయారు చేసే అసలు తయారీదారులకు అత్యంత కీలక భాగమైన సూపర్ కండక్టింగ్ మాగ్నెట్స్‌ని విశాఖ నుంచే ఎగుమతి చేస్తున్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

- నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ముఖ్యనేతలతో చంద్రబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ముందే ఎన్నికలు వస్తాయనే ఆలోచనతో పనిచేయాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ముఖ్యనేతలతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము గెలుస్తామనే నమ్మకాన్ని నేతలే తనకు కల్పించాలని చెప్పారు. పనితీరులోనే తాము గెలిచే అభ్యర్థులమని ఎవరికివారు నిరూపించుకోవాలన్నారు. లేకపోతే భిన్నమైన నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనతో నష్టపోనివర్గం అంటూ లేదని విమర్శించారు. ఈ ప్రజావ్యతిరేకతను పార్టీకి అనుకూలంగా మార్చుకోవాలని సూచించారు. మూడు రాజధానులంటూ సీఎం జగన్ మోసపూరిత ప్రకటనలతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విశాఖను మింగేసి ఉత్తరాంధ్రను కబళిస్తున్న వైఎస్సార్‌సీపీ మూకకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విశాఖను కొల్లగొట్టి కంపెనీలను వెళ్లగొట్టిన వాళ్లు అక్కడి ప్రజల గురించి ఇప్పుడు మాట్లాడుతున్నారని చెప్పారు. సేవ్ ఉత్తరాంధ్ర పేరుతో ప్రజలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు టీడీపీ నాయకులు నిలబడాలని, విశాఖలో వేల ఎకరాలను, వేలకోట్ల ఆస్తులను వైఎస్సార్‌సీపీ గద్దలు చెరబడుతున్న వైనాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. జగన్ జనాన్ని మోసం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

చెన్నై కార్గోలో 1,200 అరుదైన జంతువుల సీజ్!



సాక్షి, చెన్నై: చెన్నై విమానాశ్రయం కార్గోలో విదేశాల నుంచి తరలించిన అరుదైన జంతువులను డీఆర్ఐ అధికారులు బుధవారం సీజ్ చేశారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) చెన్నై జోనల్ యూనిట్‌కు చెందిన ప్రత్యేక బృందం ఈ నెల 6వ తేదీన చెన్నై ఎయిర్ కార్గోలో తనిఖీ చేసింది. ఓ బాక్సులో భారీగా అరుదైన పాములు, కొండచిలువలు, తొండలు, నక్షత్ర తాబేళ్లు, బల్లులు సహా మొత్తం 1,200 జంతువులున్నట్లు గుర్తించారు. వీటిని సింగపూర్ నుంచి దిగుమతి చేసుకున్న వ్యక్తిని తాజాగా అరెస్టు చేసి.. అతడి బీఎండబ్ల్యూ కారును సైతం సీజ్ చేశారు. ఈ జంతువులను ఇండియాలో ఉంచేందుకు అనుమతి లేకపోవడంతో తిరిగి సింగపూర్‌కు పంపించేశారు.

బిల్లుల చెల్లింపుల్లో జాప్యానికి వడ్డీ ఎలా కోరతారు?

- ఒప్పందంలో వడ్డీ చెల్లింపు నిబంధన లేనప్పుడు వడ్డీ అడగడానికి వీల్లేదు
- కాంట్రాక్టర్లకు తేల్చిచెప్పిన హైకోర్టు ధర్మాసనం



వడ్డీ చెల్లింపు ఆదేశాలపై అప్పీళ్లు..

సాక్షి, అమరావతి: ఆయా ప్రభుత్వ శాఖల పనులు చేసినందుకు చెల్లించాల్సిన బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వ జాప్యానికి వడ్డీ చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరుతుండటంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం తెలిపింది. కాంట్రాక్టు ఒప్పందంలో వడ్డీ చెల్లింపు నిబంధన ఉంటే తప్ప, బిల్లుల చెల్లింపుల్లో జరిగిన జాప్యానికి వడ్డీ కోరలేరని కాంట్రాక్టర్లకు తేల్చిచెప్పింది. ఒప్పందంలో ఎలాంటి నిబంధన లేనప్పుడు, అధికరణ 226 కింద వడ్డీ చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని హైకోర్టును కోరడానికి వీల్లేదంది. ఈ విషయంలో తగిన ఉత్తర్వులినిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట పరిధిలో వై.బాబూరావు అనే కాంట్రాక్టర్ వ్యవసాయ శాఖ పనులు చేశారు. తనకు చెల్లించాల్సిన రూ.23.21 లక్షల బకాయిలను వడ్డీతో సహా చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ పిటిషనర్‌కు చెల్లించాల్సిన రూ.23.21 లక్షలను 12 శాతం వార్షిక వడ్డీతో కలిపి నాలుగు వారాల్లో చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. దీంతో ప్రభుత్వం బాబూరావుకు రూ.23.21 లక్షలు చెల్లించింది. అయితే వడ్డీ చెల్లించాలన్న సింగిల్ జడ్జి ఆదేశాలతోపాటు ఇలాంటివే మరికొన్నింటిపైనా ధర్మాసనం ముందు ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీళ్లన్నింటిపై సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది.

గత ప్రభుత్వ పాపాలకు మేం మూల్యం చెల్లించుకుంటున్నాం..

ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. 'రోజుకు 320 నుంచి 350 వరకు హైకోర్టులో పిటిషన్లు దాఖలవుతుంటే, అందులో 220–250 వరకు రిట్ పిటిషన్లే ఉంటున్నాయి. ఇందులో 200 కేసుల వరకు పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ బిల్లుల చెల్లింపుల కోసం దాఖలవుతున్నవే ఉన్నాయి. ఆ బిల్లులు చెల్లించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడంపై దాఖలవుతున్న కోర్టు ధిక్కార వ్యాజ్యాలు ఈ సంఖ్యకు అదనం. ఇవన్నీ కూడా కోర్టుపై అదనపు భారాన్ని పెంచుతున్నాయి. ఈ సంఖ్యను తగ్గించాల్సిన అవసరం ఉంది' అని స్పష్టం చేసింది. ప్రభుత్వ న్యాయవాది (ఆర్ అండ్ బీ) కోనపల్లి నర్సిరెడ్డి స్పందిస్తూ.. తాము సింగిల్ జడ్జి ఇచ్చిన వడ్డీ చెల్లింపు ఉత్తర్వులను మాత్రమే సవాల్ చేశామన్నారు. అనంతరం అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ జోక్యం చేసుకుంటూ.. ఈ బిల్లుల వ్యవహారమంతా గత ప్రభుత్వ పాపమేనన్నారు. ఆ పాపాలకు తమ ప్రభుత్వం మూల్యం చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో రూ.2,800 కోట్ల మేర చెల్లింపులు చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో చాలా పనులు చేయకుండానే బిల్లులు సమర్పించారని, దీనిపై పరిశీలన కూడా చేస్తున్నామని తెలిపారు. అందువల్లే బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందన్నారు.

వడ్డీ చెల్లింపు ఆదేశాలు ఇవ్వడానికి మాది సివిల్ కోర్టు కాదు..

ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. వడ్డీ చెల్లించాలని కాంట్రాక్ట్ ఒప్పందంలో ఉందా? అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఒప్పందంలో వడ్డీ చెల్లింపు నిబంధన లేనప్పుడు వడ్డీ చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడం కుదరదని స్పష్టం చేసింది. వడ్డీ కావాలనుకుంటే అందుకు సివిల్ కోర్టుకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపింది. వడ్డీ చెల్లింపునకు ఆదేశాలు ఇవ్వడానికి తమది సివిల్ కోర్టు కాదని స్పష్టం చేసింది. వడ్డీ చెల్లింపు విషయంలో సుప్రీంకోర్టు తీర్పులను తమ ముందుంచాలని అటు ప్రభుత్వ న్యాయవాది నర్సిరెడ్డికి, ఇటు పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రీకాంత్‌కు ధర్మాసనం స్పష్టం చేసింది.

జీవిత ఖైదీల విడుదలపై పలు సందేహాలు లేవనెత్తిన హైకోర్టు

సాక్షి, అమరావతి : జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీలను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేసే విషయంలో ప్రభుత్వానికి ఉన్న అధికారంపై హైకోర్టు పలు సందేహాలు వ్యక్తం చేసింది. ఆ ఖైదీలకు శిక్ష పడే సమయానికి రాష్ట్ర ప్రభుత్వం ఏ విధానాన్ని అయితే అమలు చేస్తుందో, అదే విధానం వారి విడుదల విషయంలోనూ అనుసరించాల్సి ఉంటుందంటూ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును హైకోర్టు గుర్తు చేసింది. ప్రస్తుత కేసులో దోషులకు శిక్ష పడే సమయానికి ఉన్న విధానం, వారి విడుదల సమయంలో ఉన్న విధానం వేర్వేరుగా ఉన్న నేపథ్యంలో వారి విడుదలను హైకోర్టు ప్రశ్నించింది. దోషులకు 2006లో శిక్ష పడినందున అప్పటి విధానం, ఈ శిక్షను ఖరారు చేస్తూ 2013లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చే సమయానికి ఉన్న విధానం, ఇటీవల వారిని విడుదల చేసినందున ప్రస్తుత విధానం, ఇలా ఆ విధానాలన్నింటినీ తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ విధాన నిర్ణయాల సహేతుకతను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. ఖైదీలను విడుదల చేసే అధికారం గవర్నర్‌కు ఉందని, అయితే జీవిత ఖైదు పడిన ఖైదీలు 14 ఏళ్ల శిక్ష అనుభవిస్తేనే వారిని విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉందని గుర్తు చేసింది. ప్రస్తుత కేసులో దోషులను విడుదల చేయాలంటూ గవర్నర్‌ను కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఫైల్‌లో ఏ కారణాలు పేర్కొంది.. ఏ కారణాలతో గవర్నర్ వారి విడుదలకు ఆదేశాలిచ్చారో తెలుసుకోవాల్సిన అవసరం తమకుందని హైకోర్టు తెలిపింది. ఈ సందేహాలన్నింటినీ నివృత్తి చేయాలని అటు రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదిని, ఇటు పిటిషనర్ తరఫు న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను 18కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. తన భర్త పార్థమరెడ్డి హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న 8 మంది నేరస్తులన్ను విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మెట్టు గ్రామానికి చెందిన ముడి నవనీతమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

3 నెలల్లో పోలీసు కంప్లయింట్ అథారిటీలు ఏర్పాటు చేయండి: హైకోర్టు

సాక్షి, అమరావతి: రాష్ట్ర, జిల్లా పోలీసు కంప్లయింట్ అథారిటీలను మూడునెలల్లో ఏర్పాటు చేయాలని హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జిల్లా పోలీస్ కంప్లయింట్ అథారిటీలను ఏర్పాటు చేయకపోవడంపై, రాష్ట్ర పోలీస్ కంప్లయింట్ అథారిటీ చైర్మన్‌గా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కనగరాజ్‌ను నియమిస్తూ ఇచ్చిన జీవోపై దాఖలైన వేర్వేరు వ్యాజ్యాలను హైకోర్టు పరిష్కరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజుల ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా పోలీస్ కంప్లయింట్ అథారిటీలను ఏర్పాటు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ విశాఖపట్నానికి చెందిన న్యాయవాది ఎం.మనోజ్‌కుమార్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. రాష్ట్ర పోలీసు కంప్లయింట్ అథారిటీ చైర్మన్‌గా మద్రాసు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కనగరాజ్‌ను నియమిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవోను సవాలు చేస్తూ న్యాయవాది పారా కిషోర్ పిల్ వేశారు. ఈ వ్యాజ్యాలపై ఇప్పటికే పలుమార్లు విచారించిన సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర పోలీసు కంప్లయింట్ అథారిటీ చైర్మన్ నియామకం విషయంలో కొత్త నిబంధనలు తీసుకొచ్చామన్నారు. గతంలో తీసుకొచ్చిన నిబంధనలు అమల్లో లేనట్లేనని తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం రాష్ట్ర అథారిటీ చైర్మన్ నియామకం కోసం హైకోర్టు ఓ ప్యానెల్‌ను పంపిందన్నారు. జిల్లా అథారిటీ విషయంలో ఏపీపీఎస్సీ నుంచి ప్యానెల్ రావాల్సి ఉందని తెలిపారు. దీంతో ధర్మాసనం.. కొత్త నిబంధనల నేపథ్యంలో జస్టిస్ కనగరాజ్ నియామకంపై దాఖలైన వ్యాజ్యం నిరర్థకమని స్పష్టం చేసింది. పోలీసు కంప్లయింట్ అథారిటీలను మూడునెలల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.